
భాగవతము

# భాగవత కథ-చతుర్వింశ భాగము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

# భాగవతకథ

(శ్రీ మద్భాగవత దర్శనము)

చతుర్వింశ భాగము

హిందీ మూలము

శ్రీగంగా ప్రభు దత్త బ్రహ్మచారి మహారాజు

ఆంధ్రానువాదకులు, శ్రీరామ శరణ్

శ్రీ కుందుర్తి వేంకట నరసయ్య

శ్రీ వేంకటేశ్వరార్ష భారతి ధర్మసంస్థ

హైదరాబాదు.

2740/ROP

# తొలి పలుకు

బ్రహ్మ సృష్టిలో మానవుఁ డుత్తమోత్తముఁడుగా పరిగణింపఁబడుచున్నాఁడు. అందు కితరజీవజంతువులకు లేని జ్ఞానమతని కుండుటయే కారణము. భగవంతుఁడు కరుణాళువై ప్రసాదించిన యీ జ్ఞానము సాహాయ్యమున మానవుఁడు తురీయ పురుషార్థమైన మోక్షమును బొందుటకు యత్నింప వలయును. అతఁడట్లు చేయనిచో నాహారభయ నిద్రాదులతోఁ గాలము పుచ్చుచుండు నితర జీవులకును అతనికిని ఆకారమున మాత్రమే భేదముండును. మోక్షప్రాప్తికి మన పూర్వులు మూఁడు మార్గములను నిర్దేశించి యుండిరి. అవి జ్ఞాన, కర్మ, భక్తి మార్గములు. ఈ కలియుగమున వీనిలో మొదటి రెండు మార్గములను అవలంబింపఁ జాలువా రరుదుగా నుందురు. ఇంక మూఁడవదైన భక్తి మార్గమును స్త్రీలనక, పురుషులనక, బాలురనక, వృద్ధులనక, పండితులనక, పామరులనక అందఱు ననుసరించి మోక్షసౌధమును జేరవచ్చును.

వేదార్థోపబృంహణార్థమై భగవంతుఁడగు కృష్ణద్వైపాయనుఁడు బ్రహ్మసూత్ర శ్రీ మద్భాగవతములతోపాటు పదునెనిమిది మహాపురాణములను, ఉపపురాణములను కూడ రచించి యుండెను. ఇవి కథోపాఖ్యాన పూర్వకముగా వేదనిక్షిప్తములైన ధర్మ నీతి తత్త్వములను జిజ్ఞాసువు లందఱికిని సుబోధ మొనరించును. పదునెనిమిది పురాణములలో భాగవత మొకటి. ఇది శ్రీ మద్భాగవతమా, దేవీ భాగవతమా, అను విషయమున పండితులలో వివాదమున్నది.

కాని పలువురది శ్రీ మద్భాగవతమేయని భావించుచున్నారు. ఇది యెంతమనోహరమో, భాషా భావము లందంత క్లిష్టమైనది. అందు చేతనే "విద్యావతాం భాగవతే పరీక్షా" అను నానుడి యేర్పడుటయు, పోతరాజు "భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు శూలికైనఁ దమ్మిచూలికైన"నని చెప్పుటయు సంభవించినది. "భగవతః ఇదమ్" (భగవంతునికి సంబంధించునది) అని భాగవత శబ్దమునకు వ్యుత్పత్తి. ఇందు భగవన్మాహాత్మ్య బోధకములైన విషయములు కథలు అనేకములుండును.

సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరములు, వంశానుచరితము అను పంచలక్షణములు పురాణమునందుండును. శ్రీమద్భాగవతము పురాణమగుటచే నిందా పంచలక్షణములును కలవు. వీనితో పాటించు శ్రీమన్నారాయణునికి సంబంధించిన ఏకవింశత్యవతారములును (21) వర్ణింపఁబడి యున్నవి. "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత" "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని శ్రీ మద్భగవద్గీతలో భగవంతుఁడు చెప్పినట్లాతఁడు ధర్మ సంస్థాపనము కొఱకును. సాధురక్షణ, దుష్టశిక్షణముల కొఱకును భూమిపై నవతరించుచుండును. ఆ యవతారముల విషయమే శ్రీ మద్భాగవతము నందు ప్రపంచింపఁబడినది. మత్స్యకూర్మాద్యవతారములన్నియు నవతార ప్రయోజనములను నిర్వహించిన మాట వాస్తవమేయైనను "కృష్ణస్తు భగవాన్ స్వయ" మ్మను సూక్తి ననుసరించి యిందు దశమస్కంధమున శ్రీ కృష్ణుని జన్మాది వృత్తాంతములు విపులతరముగా వివరింపఁబడినవి. భాగవత తారహారమునకు దశమస్కంధము తరళప్రాయము;

శ్రీ మద్భాగవతమున కర్మజ్ఞాన విషయములు కూడ ప్రతిపాదింపఁబడినను భక్తికే అందు ప్రాధాన్యము. మోక్ష ప్రాప్తి కదియే పరమసాధనమని యది బోధించును. అందలి కథోపాఖ్యానము లన్నియు భక్తిమహత్త్వ ప్రతిపాదనమునందే పర్యవసించును. జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు కూడ భక్తిని నిరసింప లేదనుటకు "మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ" అని వివేక చూడామణిలో చెప్పియుండుట నిదర్శనము. సత్యముకూడ నంతే. కలియుగము నందలి జనులు కర్మజ్ఞాన మార్గముల నవలంబింపఁ జాలని వారగుటచే భక్తినే ఆశ్రయింపవలయును. సంసార సాగర తరణమునకు భక్తియే నిరపాయమైన నౌక. వ్యాసభగవానుఁడు భాగ. వతము నిగమ కల్ప తరువు నుండి జాఱిన ఫలమని చెప్పియుండెను. అది కల్పతరువువలె భక్తులకు సర్వాభీష్టముల సిద్ధింపఁ జేయును

వ్యాసుఁడు సంస్కృతమున రచించిన శ్రీ మద్భాగవతమును మహా భక్తుఁడును, కవిపుంగవుఁడునైన బమ్మెర పోతరాజు గద్య పద్యాత్మముగా తెలుఁగున కనువదించెను. అతఁడు రచించిన భాగవతము నందలి కొన్ని భాగము లే కారణము చేతనో శిథిలమగుటచే వాని నతని మిత్రులో శిష్యులోయైన గంగన, సింగన, నారయ యనువారు పూరించిరి. అయినను తెలుఁగున భాగవతము మాట విన్నంతనే పోతరాజే తలంపునకు వచ్చును. ఆంధ్ర దేశమున నతని భాగవతమున కున్నంత ప్రచారము మఱే గ్రంథమునకును లేదనుటలో నతిశయోక్తిలేదు. అందుకతని పద్యములందలి ధారాశుద్ధియు నాన్యతో దృశ్యమైన మాధుర్యమును కారణములు. అందలి పద్యము లొండో, రెండో నోటికి రాని అక్షరాస్యుఁడు మున్న

మొన్నటి వఱకు ఆంధ్ర దేశమున నుండెడి వాఁడు కాఁడు. కాల వైపరీత్యముచే నిప్పుడందలి పద్యములను కంఠగతము రొనరించు కొను వారి సంఖ్య చదువుకొన్న వారిలోనే చాల తక్కువైనది. పోతరాజు సంస్కృత భాగవతమును యథాతథముగా నాంధ్రీక రించియుండలేదు. భక్తిభావ భరితమైన భాగముల నాతఁడు పెంపొం దించి యుండెను. అది గాక పద్యకావ్యముల నర్థము చేసికొనఁ గలవా రివ్వు డెందఱో యుండరు. అందుచే సంస్కృత భాగవతము నకు రెండు మూడు వచనానువాదములు కూడ వెలసినవి. భాగ వతమువంటి ఉత్తమ గ్రంథమెంత అధికముగా ప్రచారము పొందిన లోకమున కంత మేలు కలుగును.

తపోనిష్ఠాగరిష్ఠులు, యోగిపుంగవులు, భక్త శిఖామణులు నైన శ్రీశ్రీశ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు జగద్ధితార్థమై శ్రీ భాగ వతము నందలి విషయములను కథాదృష్టాంతానుభవ పూర్వకముగ సరళసుందరమైన హిందీ భాషలో నఱువది సంపుటములుగా వచన రూపమున రచించి యుండిరి. అది హిందీ భాషాభిజ్ఞుల అదృష్టము. వానిని భక్తవరేణ్యులు శ్రీ రామశరణ్ కుందుర్తి వేంకట నర్సయ్య గురుపుంగవులు సర్వసుబోధమైన భాషలో తెలిఁగించి యుండిరి. భక్తిప్రధానమైన శ్రీ మద్భాగవతమును భక్తవరేణ్యుఁడైన పోత రాజాంధ్రీకరించుటవలన నాంధ్రవలోకమున కెంత మహోపకారము జరిగినదో భక్త చూడామణులైన శ్రీ ప్రభుదత్తబ్రహ్మచారి గారి హిందీ గ్రంథములు భక్తి సముద్రులైన శ్రీ కుందుర్తి గురుపుంగవు లాంధ్రీకరించుటవలన కూడ నంత మహోపకారము జరిగినది. ఈ

గ్రంథమునకు శ్రీ మద్భాగవత దర్శనమను పేరు సార్థకము. అది రెండుసార్లు ముద్రితమైనది. కాని ప్రతులిప్పుడు లభ్యములగుటలేదు. అది చూచి నిత్యధర్మకార్యపరాయణులును వదాన్యశేఖరులునైన భక్తులొక రా సంపుటములను పునర్ముద్రించుట వలన లోకమునకు మేలు కలుగునను నుద్దేశముతో అందుకు సంకల్పించిరి. వారు సిద్ధ సంకల్పులు. వారి సంకల్పబీజము వృక్షమై యిప్పుడీ గ్రంథముల రూపమున ఫలించినది. ఆంధ్రు లాఫలమును ఆస్వాదించి ఆనంద పారవశ్యము పొందుదు రనుటలో సందేహము లేదు.

ఆ భక్తులే శ్రీ వేంకటేశ్వరార్షధర్మసంస్థను స్థాపించి దాని పక్షమున అష్టాదశ మహా పురాణములను తెలుగు లిపిలో తాత్పర్య సహితముగ ముద్రించి ఆంధ్రులకు మహోపకారము చేయుచున్నారు. ఈ భాగవతకథా సంపుటములు కూడ శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతీ ధర్మసంస్థ పక్షముననే ముద్రింపఁబడుచున్నవి.

శ్రీ వేంకటేశ నామ్నా
భారత సంస్కృతి ప్రవర్ధనార్థాయ
సంస్థాపితేయం ధర్మ
సంస్థార్షా జయతు భగవతః కృపయా.

దివాకర్ల వేంకటావధాని

నిగమకల్పతరో ర్గళితం ఫలం
శుకముఖాదమృతద్రవ సంయుతం
పిబత భాగవతం రస మాలయం
ముహురహో రసికా భువి భావుకాః

— సంస్కృత భాగవతము

లలితస్కంధము కృష్ణ మూలము శుకా
లాపాభిరామమ్ము మం
జులతాశోభితమున్ సువర్ణ సుమన
స్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వల వృత్తమ్ము మహాఫలమ్ము విమల
వ్యాసాలవాలమ్మునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరువు
ర్విన్ సద్ద్విజశ్రేయమై

— శ్రీ మదాంధ్ర మహాభాగవతము

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | సప్తమ వైవస్వత మన్వంతరము | 1 |
| 2. | ఆగామి సప్తమన్వంతరముల కథ | 18 |
| 3. | మన్వంతరములందు మన్వాదుల కార్యములు | 24 |
| 4. | బలి సురల స్వర్గము కొఱకు యత్నించుట | 30 |
| 5. | క్షయిష్ణువగు స్వర్గముపై బలి దండెత్తుట | 38 |
| 6. | దేవగురుని సమ్మతితో సురలు స్వర్గమును త్యజించుట | 44 |
| 7. | పుత్ర పరాభవముచే నదితి దుఃఖము | 53 |
| 8. | అదితికి కశ్యపుని ఉపదేశము | 63 |
| 9. | పయోవ్రత విధి | 69 |
| 10. | పయోవ్రతముచేఁ బ్రసన్నుఁడై ప్రభువు ప్రత్యక్షమగుట | 75 |
| 11. | అచ్యుతుఁ డదితికి పుత్రుడగునట్లు వరమొసంగుట | 82 |
| 12. | వామనమూర్తి ప్రాదుర్భావము | 92 |
| 13. | వటు వామనుని ఉపనయనము | 99 |
| 14. | బలి యజ్ఞమున వామనుడు | 108 |
| 15. | బలి-వామనుడు | 116 |
| 16. | వామనుడు బలికులమును గూర్చి ప్రశంసించుట | 124 |
| 17. | వామనుడు బలి యొక్క ప్రపితామహుల బ్రశంసించుట | 132 |
| 18. | వామనుడు బలిని మూఁడడుగు లడుగుట | 139 |
| 19. | శుక్రాచార్యుఁడు శిష్యునకు వుపదేశించుట | 145 |
| 20. | శుక్రాచార్యుని వ్యావహారిక ధర్మము | 153 |
| 21. | శుక్రాచార్యుని విపరీత ధర్మము | 162 |

# భాగవతకథ

## బలిచక్రవర్తి

మొదటి భాగము

## సప్తమ వైవస్వత మన్వంతరము

శ్లో॥ మనుర్వివస్వతః పుత్రః శ్రాద్ధదేవ ఇతి శ్రుతః !
సప్తమో వర్తమానో యస్తదపత్యాని మే శృణు॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౩ అ. ౧ శ్లో

తే. నరవరాధీశ యిప్పుడు నడుచుచున్న
వాఁడు సప్తమ మనువు వైవస్వతుండు
శ్రాద్ధ దేవుండనందగు జనవరేణ్య
పదురు నందను లతనికిఁ బ్రకటబలులు॥

—శ్రీమదాంధ్ర భాగవతము

ప్రపంచములో విశ్వకర్మచే నిర్మింపఁబడిన పదార్థములన్నిటికి నేదియో ఒక సంజ్ఞగలదు. సంజ్ఞలేని పదార్థమేలేదు. సంజ్ఞావంతములగు పదార్థములకు ఛాయ అవశ్యముండి తీరును. చీకటిలో సమస్త వస్తువులున్నను వాని సంజ్ఞ అజ్ఞాతముగ నుండును. ఘట, పట, వస్త్ర భూషణాది వివిధ పదార్థములున్నను నంధకారములో

వాని వివేకముండదు. ప్రకాశము లేక ఛాయ వ్యక్తముకాదు. కావున సంజ్ఞా ఛాయలకు స్వామి వివస్వంతుఁడగు సూర్యుఁడు. ఆతని వలననే శ్రాద్ధదేవాది ధర్మ ప్రవర్తకుల యుత్పత్తియగును.

సముద్ర మంథన కథను సమాప్తమొనర్చి పూర్వకథను ప్రారంభించుచు శ్రీ శుకుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను :- "రాజా ! నేను నీకు చతుర్దశ మన్వంతర కథలను గూర్చి చెప్పుచున్నాను. కృత, త్రేత, ద్వాపర, కలియుగములను నవి నాలుగు. ఇట్టి యుగ చతుష్టయములు వేయి గడచిన బ్రహ్మకొక పగలగును. దీనినిఁ గల్పమందురు. ఒక కల్పమునకు పదునాలుగు మన్వంతరములుండును. ప్రతి మన్వంతరమునను భగవంతునియొక్క ఒక విశిష్టావతారముండును. ఇంతవరకు నేను నీకాఱు కల్పముల యొక్కయు, వానిలోవచ్చు నవతారముల యొక్కయు వర్ణనమును గావించితిని. ప్రథమ స్వాయంభువ మన్వంతరమున యజ్ఞ భగవానుఁడు మన్వంతరావతారమయ్యెను. ద్వితీయ మన్వంతరము స్వారోచిషము. దానిలో విభుఁడవతరించెను. తృతీయమగు నుత్తమ మన్వంతరమందు సత్యసేనుఁడను భగవదవతారము వచ్చెను. చతుర్థమగు తామస మన్వంతరమున గజమును గ్రాహమునుండి వదలించిన హరి యవతారము వచ్చినది ఐదవదగు రైవత మన్వంతరమున వైకుంఠ భగవానుఁడు వచ్చెను. ఆఱవదగు చాక్షుష మన్వంతరమున మన్వంతవతారుఁడగు నజిత భగవానుఁడుసముద్ర మంథనమును విచిత్రలీల లొనర్చెను. ఈ సమయమున జరుగుచున్న మన్వంతరము వైవస్వత మన్వంతరము. ఇంతవరకు దీనిలో నిరు

వది యెనిమిది మహాయుగములు గడచినవి. ఈ యిరువది యెనిమి దవ కలియుగాదియందే పూర్ణావతారుఁడగు నంద నందనుఁ డవత రించినాఁడు."

అంతఁబరీక్షిన్మహారాజిట్లడిగెను :- "ఈ మన్వంతరము పేరేమి ? దీని కధిపతియగు మనువెవరు ? ఇందులో భగవంతుని మన్వంతరావతారములేవి ? ఇంద్ర, మనుపుత్ర, సప్తర్షి, దేవగణము లెవరు ? దీనిని మీరు విస్తారముగఁ జెప్పవలయును."

ఇది విని శుకదేవుఁడిట్లనెను :-రాజా ! వర్తమానమగు నీ సప్తమ మన్వంతరమున కధిపతి వివస్వంతుని పుత్రుఁడగు శ్రాద్ధ దేవుఁడు. ఈతని కిక్ష్వాకు, నభగ, ధృష్ట, శర్యాతి, నరిష్యంత, నాభాగ, దిష్ట, కరూష, వృషధ్ర, వసుమంతులను పదుగురు మను పుత్రులుదయించిరి. వారి వంశజులే నేఁటివరకు పృథివిని శాసించు చున్నారు. నీవు వీరి వంశజుఁడవే. అదిత, వసు, రుద్ర, విశ్వేదేవ, మరుద్గణము అశ్వినీ కుమారులు, విభుగణము వీరు దేవతాగణ ములు. ఈ మన్వంతరపు ఇంద్రునిపేరు పురందరుఁడు. కశ్యప, అత్రి, వసిష్ఠ, విశ్వామిత్ర, గౌతమ, జమదగ్ని, భరద్వాజ వీరి మవ్వంతరముల సప్తర్షులు, ఈ మన్వంతరమందు కశ్యపభగవానుని వలన వదితియందు వామనుఁడను మన్వంతరావతారము వచ్చెను. ఇంద్రునకుఁదమ్ముఁడగుటచే నీతఁడు పేంద్రుఁడనియును బిలువఁ బడెను. ఈ విధముగా నిట్లేడు మన్వంతరములు గడిచినవి. ఇప్పుడు నేను రాఁబోవు నేడు మన్వంతరముల వర్ణమునొనర్చెదను.

దీనిని దివ్యదృష్టిచేఁ గాంచి పూజ్యులగు మా తండ్రియు సర్వ సమర్థుఁడునగు వ్యాసమహర్షి దీనిన లిఖించి యుండెను. రాఁబోవు అష్టమమన్వంతరాధిపతియును వివస్వతుని పుత్రుఁడగు సావర్ణియే కాగలఁడు. ఈతఁడు శ్రాద్ధదేవ మనువునకుఁ దమ్ముఁడు. వీరికిఁ దండ్రి యొక్కఁడే. తల్లులు వేరు.

అంతఁ బరీక్షిన్మహారాజగుఁ బరీక్షిత్తు ఈ విధముగ బ్రశ్నిం చెను :-"స్వామీ! ఇద్దరు పుత్రులును మనువులైన వివస్వంతుని భార్యలెవరు? పుత్రులెవరో నాకు తెలుపవలయును. ఈ విషయ మును జెప్పిన తరువాత నష్టమ మన్వంతరమును వర్ణించుడు."

ఇది విని శుక దేవుఁడిట్లనెను :-"రాజా! ఇది చాల పెద్ద కథ, వేరే మన్వంతర ప్రసంగమున దీనినిఁ జెప్పుటకుఁ బ్రారం భించినచోఁ గథా ప్రవాహమాగిపోఁగలదు. కాని సంక్షేపముగ నీకు వివస్వంతుఁడగు పూర్వసంతతిని గూర్చి చెప్పెదను."

కశ్యపుని భార్యయగు నదితి గర్భమునుండి పండ్రెండుగురు పుత్రులుదయించిరని నేనిది వరకే చెప్పియుంటిని. వారు ద్వాదశా దిత్యులనఁబడిరి. వారిపేర్లు వివస్వాంత, అర్యమ, పూష, త్వష్ట, సవితా, ధాతా, విధాతా, వరుణ, మిత్ర, శక్ర, వామనులనువారు, వివస్వంతుఁడు వీరందఱిలోఁ బెద్దవాఁడు, ఈతఁడు ప్రజాపతియగు విశ్వకర్మ పుత్రికయగు సంజ్ఞను బెండ్లాడెను."

అంత శౌనకుఁడిట్లడిగెను :-"సూతా ! మేము పురాణ కథల లందు వివస్వంతునకు సంజ్ఞ, ఛాయ, బడవయను ముగ్గురు భార్య లుండినట్లు వినియున్నాము. మీరొకే భార్యయున్నట్లు చెప్పుచున్నారు. ఇదేమి?"

అంత సూతుఁడిట్లనెను :-"స్వామీ ! అది సత్యమే వివ స్వంతునకు ముగ్గురు భార్యలుండిరి. కాని ముగ్గురు నొక్కతే ఇవన్ని యును సంజ్ఞాభేదములే. సంజ్ఞయే వీనినన్నిటి నొనర్చెనని చెప్ప వలసియుండును. ఆమె యే యీ మూఁడు రూపములను ధరించి మూఁడి వలనను సంతానోత్పత్తినిఁ గావించెను."

అంత శౌనకుఁ డిట్లనెను :-సూతా ! ఒక్క సంజ్ఞ మూఁడు రూపముల నేల ధరించినది ? ఈ కథా ప్రసంగమును మాకుఁజెప్ప వలయును. దీనిని వినుటకు మాకు మిక్కిలి కుతూహలముగ నున్నది."

సూతుఁడిది విని యిట్లనెను : "మంచిది స్వామీ ! వినుఁడు. వివస్వంతుఁడను నది సూర్యునకుఁబేరు. ఈతఁడు మిక్కిలి ప్రకాశ వంతుఁడు. ఈతని తేజస్సు సహింపరానిది. ఎవ్వఁడును నధికకాల మీతని వైపు కన్నులను దెరచి చూడఁజాలఁడు. దేవతల శిల్పియగు విశ్వకర్మకు సంజ్ఞయను నొక పుత్రిక కలదు. ఆమెను వివస్వంతు నకిచ్చి పెండ్లిచేసెను. వివస్వంతుఁడు తన భార్యతో నుండెను. భార్యా భర్తలు సమానులైనచోఁ బ్రేమ పరస్పరముండును. భర్త ధనికుఁడై భార్య దరిద్రపు యింటి పిల్లయైనను, భార్య భాగ్యవం

తుని యింటిదై భర్త దరిద్రుఁడైనను బరస్పరము మనో మాలిన్య ముండి తీరును. భర్త బాగుగాఁ జదివినవాఁడై భార్య మూర్ఖురాలైనను, భార్య పూర్ణ విదుషీమణియై భర్త పేదసుద్దయైనను వారికి మనస్సులు కలువవు. పతి అత్యంత సుందరుఁడై, పత్ని కురూపియైనను, పత్ని అప్సరసవలె సుందరియై పతి యనాకారుఁడైనను వారిద్దరికినిఁగలియదు. పతి అత్యంత తేజస్వియై పత్ని అమాయకురాలును దెలివి తక్కువదైనను వారిద్దరకును గలియదు. కావున సంబంధము సమానకులములోఁ జేయవలయును. ఆశచేత నాఁడుపిల్లలను గొప్పవారింట నిచ్చినచో నిర్ధన బాలికలకు అడుగడుగుననెన్ని తిరస్కారములు కలుగుచుండునో ఆ విషయమును నాపిల్లలు తప్ప యింకెవరును దెలిసికొనఁజాలరు. విద్వాంసుఁడను లోభముచేఁ దన చదువురాని పుత్రికను మంచి చురుకైన వాఁడును, విద్వాంసుఁడునైన వానికిచ్చి వివాహ మొనరించినచో నామె పతికెంత దూరముగ నుండవలసివచ్చునో, యే విధముగ నప్పుడప్పుడు సంబంధ విచ్ఛేదముకూడ జరుగునో అట్టి సంఘటనలు పూర్వము నుండియును వచ్చుచునే యున్నవి.

విశ్వకర్మవలనను నీ పొఱపాటే జరగినది. సంజ్ఞ అమాయకపు స్త్రీ. సూర్యుఁడు మిక్కిలి తేజస్వి, ఆతని తేజస్సును సంజ్ఞ సహింపఁజాలక పోయెను. ఆమె గర్భమున ముగ్గురుదయించిరి. వారిలో శ్రాద్ధదేవుఁడును, యమదేవుఁడును పుత్రులు. యమున యమనది పుత్రిక. ముగ్గురు సంతానము కలిగినను సంజ్ఞ సూర్యుని

నమ్ముఖమునకు వచ్చుటకు భయభీతయగుచుండెను. అతఁడు గొప్ప తేజస్వి, మూఁడు లోకములను దపింపఁజేయువాఁడును, త్రికాల మెసంగువాఁడునై యుండెను.

ఒక దినమున సంజ్ఞ యిట్లనుకొనెను :- "నాకీ యింటిలో నిర్వాహము కాఁజాలదు. తనపతియొక్క యింత తేజమును తాను సహింపఁజాలననుకొని తన ఛాయచేఁదన వలెనే ఒక స్త్రీని సృష్టించెను. విశ్వకర్మ యొక్క కూఁతురు కావునఁదన తండ్రి యొక్క గుణములామెకు స్వాభావికముగనే వచ్చును. సంజ్ఞా ఛాయలలో నే మాత్రమును భేదము లేకుండునట్లామె యేర్పడెను. ఈ విధముగ నామె ఛాయను నింటలోనుంచి, తన సంతానమును బాగుగాఁజూడ వలయునని ఆమెకుఁజెప్పి ఒక దినమున నామె మెదలకఁదనయింటి నుండిబయలు దేరెను. భార్యభర్తయింటినుండి బయలుదేరి యెచ్చటికి బోవును. స్త్రీస్వాధీనములో నుండుట చాలా కష్టము. స్వతంత్ర ముగ నుండిన నామె ధర్మమును రక్షించుకొనుట చాలాకష్టము. అందువలన నామెయుండుటకు రెండేయిండ్లు కలవు. ఒకటి భర్త గృహము; రెండవది పుట్టినిల్లు. కావున సంజ్ఞ ముందుగాఁ దండ్రి యగు విశ్వకర్మ యింటికిఁబోయి, తనతండ్రికి నిజవృత్తాంతము నంతను జెప్పెను.

తండ్రి కసరి యిట్లనెను :- "పుత్రీ! నీసంగతి నాకు బాగుండలేదు. ఏమైనఁ గానిండు. బుద్ధిమంతురాలగు స్త్రీతనయింటి లోనే యుండవలయును. అచ్చటనేయుండవలయును. పొమ్ము. సూర్యనారాయణుఁడు వినినచో నాతఁడు నాపైఁ గోపపడఁగలఁడు."

సంజ్ఞ యెంతో ఆశతో నింటికి రాఁగాఁదండ్రి తన్ను యింటిలో నుండనీయక, లోనికే రానీయక పంపించుటను గ్రహించి, ఆమెతనపతి యింటికిని బోను, పుట్టినింటను నుండనని మనస్సులో నిశ్చయించుకొని ఆమె ఘోర వనమునకుఁ బోయెను. యువతియగు స్త్రీ యేకాంతముగ వనములలో నుండుట యుచితము కాదు. అందు వలన నామెకిష్టము వచ్చిన యాకారమును ధరించు శక్తియుండుటచే నామె గుఱ్ఱము రూపమును ధరించి యచ్చట నివసించు చుండెను. చూచువార లేదో గుఱ్ఱము మేయుచున్న దనుకొనుచుందురు. ఈవిధ ముగ నామె యేకాంతమునఁ దన దినములను వెడలఁ బుచ్చుకొను చుండెను.

ఇచ్చటఛాయ వివస్వంతున సేవను సంజ్ఞకు వలెనే చేయు చుండెను. ఆతనికి సందేహము కలుగలేదు. ఆతఁడు ఛాయను సంజ్ఞయనియే భావించుచుండెను. ఆకృతి ప్రకృతు లన్నియును సంజ్ఞకు వలెనే యుండెను. ఆమె సంజ్ఞ పిల్లలను గూడ బాగుగాఁ బాలన పోషణ మొనర్చు చుండెను. కాలాంతరమున నామె గర్భము నందియును నిద్దరు పుత్రులును, నొక కన్యకయును మొత్తము ముగ్గురు సంతానము కలిగెను. పుత్రుల పేర్లు సావర్ణి, శనైశ్చరులు కన్యక పేరు తపతి. ఈవిధముగ ముగ్గురు ఛాయకును మొత్త మాఱుగురు సంతతి కలిగిరి. పిల్లలందఱును ఛాయనే తమ తల్లిగ భావించుచుండిరి.

ఎంతగా బ్రయత్న మొనర్చినను మానవునకు స్వపరభేద మెంతకీ తీరదు. విశేషముగ స్త్రీలలో సవతి పిల్లలందు విరక్తి

పూర్వము నుండియును వచ్చుచున్నది. కొందరు తల్లులలో దీనికప వాదమును గలదు. అది నియమతము కాదు. ఛాయయును దన పుత్రులకును సంజ్ఞాపుత్రులకును భేదమెంచుచుండెను. ఆడపిల్ల లోర్చుకొందురు కాని మగపిల్లలు భేదభావము నోర్చుకొనఁ జాలరు. సంజ్ఞాపుత్రులగు శ్రాద్ధదేవుఁడును యమధర్మరాజును, వారి చెల్లె లగు యమునయును ఛాయావర్తనమును సహింపజాలక పోయిరి. మంచి మిఠాయిలు గాని, మంచివస్త్రములు వచ్చినచో మెదలకఁ దన పుత్రులకు ఛాయ యిచ్చుకొను చుండెడిది. ఆ ముగ్గు రట్లేయుండిరి. యమున ఆడుపిల్లకదా! అన్నిటికిని నోర్చుకొనుచుండిరి. శ్రాద్ధ దేవుఁడు పెద్దవాడుఁ బుద్ధిమంతుఁడుఁ ఆతడీఁ విషయములందు మనస్సు నుంచలేదుఁ యముఁడు కొంచెముగఁ గ్రోధస్వభావము కలవాఁడు. ఒకదినమున నేదో విషయమున వాదవివాదములు జరి గెను విషయము చిన్నదే; కాని మనస్సు మొదటనే చెడియున్నది. హృదయ భావము లిదివరకే దూషితములైయుండెను అవియిప్పుడు పెల్లుబికినవి ఛాయయును నాతని యశిష్టతకుఁ గసరి గద్దించెను. యమరాజు కుఱ్ఱవాఁడు నూతనరక్తము అందువలనఁ గ్రోధోద్రి క్తుఁడై ఆతఁడు తల్లినిఁదన్నుటకు బాదముల నెత్తెను.

అంత మిక్కిలి కోపమున ఛాయ యము నిట్లు శపించినది:- "ఏపాదములతో నన్నుఁజంపుటకు నీవెత్తితివో దానికిఁ బురుగులు పడుఁగాక. అవియూడిపోవుగాక!"

ఇప్పుడు యముఁడు భయపడి యేడ్చుచుఁ దన తండ్రికడకు బోయి యిట్లనెను:- "తండ్రీ! నాపాదములఁ బురుగులు పడఁగల వనియు, నవి యూడిపడుననియు నాతల్లి శపించినది."

వివస్వంతుఁ డిట్లనెను :- "నాయనా! నీవును నేదియో యనియుందువు. ఒంటిచేతితోఁ జప్పుడురాదు. తప్పక నీవు గొప్ప యనిష్టకార్యము నేదో చేసియుందువు."

ఏడ్చుచు యముఁ డిట్లనెను :- "లేదు తండ్రీ! నేనేమియు ననలేదు. ఈమె యెల్లప్పుడును మా ముగ్గురను జూచినఁ గసరుచుండును. మాయెడల విషయవ్యవహార మొనర్చుచుండును. మా కంటెను జిన్నవారగు సావర్ణి, శనైశ్చరుఁడు, తపతి వీరలను మిక్కిలిగఁ బ్రేమించుచుండును. మంచి మంచి వస్తువులను వారికిఁ బెట్టుచుండును మమ్ముల నెప్పుడు నుపేక్షించుచుండును. ఎంగిలి కూడు, పాసినకూడు పడవేయుచుండును. ఇంకెప్పుడు నిట్టి విషమ వ్యవహారమునే యొనర్చుచుండును. నేఁడు మాటలచేతనే ఆమె నాతోఁ దగవువైచుకొన్నది. నేను బాల చాపల్య వశమున నామెను దన్నుటకుఁ గాలెత్తితిని. అప్పుడామె యీదారుణశాపము నొసంగినది. తండ్రీ! పుత్రుఁడుకుపుత్రుడైనను మాత కుమాత కాఁజాలదని మేము వినుచున్నాము. ఈమె యిదంతయును గుమాత చేయు కార్యమునే యొనర్చినది. దీనినిబట్టి యీామె మాకు యథార్థమగు తల్లికాదని సందేహము వేయుచున్నది. ఈమె యింకొక యామెయై యుండనోపు."

ఇది వినఁగానే వివస్వంతునకు సందేహము కలిగెను. ఆతఁడు ధ్యానమునఁ జూడఁగా నీమె ఆమె ఛాయయని తెలిసెను. అప్పుడాతనికి మిక్కిలి కోపమువచ్చి ఆమె కడకుఁబోయి యిట్లనెను :- "దుష్టా! నీవెవతెవో నిజముగఁ జెప్పుము."

ఇది విని ఛాయ గడ గడ వణఁకుచు, సూర్యుని యపార తేజమును సహింపఁజాలక పోవుటచే నత్యంత భయభీతియై ఆ పె నిజమును వచించెను.

సూర్యనారాయణుఁ డిట్లడిగెను :- "ఇదంతయును నీవు నాకు మొదట నేలఁజెప్పలేదు ?"

ఛాయ స్ఖలిత వాక్కులతోఁ గంపించుచు నాగియాగి యిట్ల నెను :- "దేవా ! ప్రాణముల మీఁదకు వచ్చునంతవర కీ విషయ మును జెప్పఁగూడదని ఆమె ఒట్టుపెట్టుకొనినది. మీరు నన్ను భస్మ మొనర్ప నుద్యుక్తులగు నంతలో నేను మీకు సత్యవిషయమును నివేదించితిని. ఇప్పుడు మీకేది యుచితమని తోఁచిన దానినిఁ జేయుఁడు. నేను దండనార్హురాలనగుచో దండింపుము, కాని ప్రభూ! ఇందులో నా యపరాధమేమియునులేదు."

సూర్యదేవుఁ డిట్లనుకొనెను :-"అవును, ఈమె అపరాధ మేమున్నది ? నా యథార్థపు భార్యను వెదుకవలెను" అనుకొని వివస్వంతుఁడు విశ్వకర్మ లోకమునకుఁబోయెను. తన యల్లుఁడు వచ్చుటను గాంచి విశ్వకర్మ ఆతనికి స్వాగత సత్కారము లొనర్చి కుశల ప్రశ్నలనడిగెను."

విశ్వకర్మయొక్క కుశల ప్రశ్నలకు జవాబొసంగక మిక్కిలి క్రోధముతో సూర్యుఁడిట్లనెను :-"మీరెంతటి పెద్ద మనుష్యులు. మీ

పిల్లను మీ యింటనే యుంచుకొనఁదలఁచిన నామెను నాకిచ్చి యేల వివాహ మొనర్చితిరి ? ఆమె యెన్నో దినములైనది నన్ను వదలి వచ్చి. మీరు నాకు కబురైనను జేయలేదేమి ?"

విశ్వకర్మ వినయముతో నిట్లు ప్రత్యుత్తర మొసంగెను :- "నాయనా ! కోపగింపకుము. ముందుగా నా మాటను వినుము. నా పిల్లను బిలిపించుకొని తెచ్చుటకు నాకవసరమేమున్నది ? ఆమె నా దగ్గరకు వచ్చినమాట నిజమేకాని నే నామెను ద్రిప్పి పంపివైచితిని. ఆమె తిరిగి నీకడకు రాలేదా ? ఈ సంగతి నే నిప్పుడే వినుచున్నాను."

సూర్యదేవుఁడిట్లనెను :- "నా యింటఁ గొదువ యేమున్నది ? ఆమె నా యింటిని వదలి వెళ్ళుట యెందులకు ?"

అంత గంభీరుఁడై ధైర్యముతో విశ్వకర్మ యిట్లనెను :- "స్వామీ ! అన్యథా తలంపకుఁడు. స్త్రీ ధన, వస్తు, వాహన, వస్త్రాదులను గోరదు. ఆమెకు కావలసినది పతి ప్రేమ. పతి ప్రేమలేని యెడల సమస్త విశ్వములోని సంపత్తును స్త్రీకి తృణ సమానము. ప్రేమయుండినచో సాయం కాలమున నొక్క పూట గంజియున్నను నామె నమృతముతో సమానము. ఆమె నీ యీ ప్రబల తేజమును సహింపలేకున్నది. విషమతతోఁ బ్రేమయుండదు. కావున నీ తేజమును గొంచెముగఁ దగ్గించుకొనుము. నే నామెజాడను నీకుఁ జెప్పెదను. ఆమె ఫలాని అరణ్యములో గుఱ్ఱమై తపస్సు చేయుచున్నది."

ఇది వినఁగానే వివస్వంతుఁడును గుఱ్ఱమై ఆమె సమీపము నకుఁబోయెను ఆడు గుఱ్ఱమైన తన పత్నితో గుఱ్ఱమైన సూర్యుఁడు సంగమించెను. ఆమె నుండి అత్యంత సుందరులును దేవతుల్యులు నగు పురుషులిద్దరుత్పన్నమైరి, వారే అశ్వినీ కుమారులు. వీరిద్ద రునుగలిసి యుందురు దేవతలకు రాజవైద్య మొనర్చుచుందురు.

ఇద్దరును గలిసి విశ్వకర్మవద్దకు వచ్చిరి. సూర్యుఁడిట్ల నెను :-"నీవు ప్రపంచములో సర్వశ్రేష్ఠుఁడగు శిల్పివి. నా తేజ స్సును తగ్గించుము." ఇది విని విశ్వకర్మ సూర్యుని సానబెట్టి ఆతని తేజస్సును దగ్గించెను. అయినను నింకను దగ్గక పోగా నాతనిఁ బంద్రెండు భాగము లొనర్చెను. అప్పటి నుండి ద్వాదశా, దిత్యు లైరి. సానబట్టఁగా మిగిలిన తేజస్సుచే సుదర్శన చక్రమును, శివుని త్రిశూలమును, ఆతని ఆజగవమను ధనుస్సును, ఇంద్రుని వజ్ర మును జేసెను.

ఇది విని నవ్వుచు శౌనకుఁడిట్లనెను :-"సూతా! ఒక్కొ క్కప్పుడు నీవు యూహాతీతములగు విషయములను జెప్పుచుందువే సూర్యుని నిసుకతో రుద్దుటకుఁ గాని, సానమీఁదనొరిపిడి పెట్టుటకు గాని ఆయన యినుప గుండుగాదు. ఆతఁడు దేవుఁడు. జాజ్వల్య మానమగు గ్రహము."

సూతుఁడిట్లనెను :-"స్వామీ! అన్ని విషయములును నాధి భౌతిక ఆధిదైవిక, ఆధ్యాత్మిక భావములతోఁ జెప్పఁబడును. అన్నింటియందును రూపకముండును ఈ ప్రపంచమే కాలచక్రము.

దీనిమీఁదకెక్కి పరోపకార కార్యములందే తన తేజమును వ్యయ మొనర్చెదరో ఆతని తేజము సఫలమవును. దాని చేతనే సర్వాత్మ యగు ప్రభువు సంతుష్టినిఁజెందును. తాను తేజోగర్వమును జెంది, సదా పరులకపమానమెవఁడు చేయుచుండునో, నమ్రతగా నెవఁడుం డఁడో, విశ్వసృజనమొనర్చువాని సమీపముచే నమ్రుఁడై ఆత్మ సమర్పణ నెవఁడు చేయఁడో, తన తేజమును నెవఁడు విభాగిం పఁడో అట్టి వానినిఁ గాంచి యెవఁడును సంతుష్టినిఁజెందఁడు. తన వారు పరాయివాండ్రగుదురు. ఆధి దైవిక రూపమందు దేవతలెట్లు కావలయుననిన నట్లు కాఁగలరు.

శౌనకుఁడిట్లనెను :- "మంచిది, అయితే తరువాత నేమైనది? ఆతని సంతానమే మొనర్చిరి ?"

సూతుఁడిట్లనెను :- "వివస్వంతునకుఁ బెద్ద కుమారుఁడగు శ్రాద్ధ దేవుఁడీ మన్వంతరమునకు మనువయ్యెను. రెండవ పుత్రుఁ డగు యముఁడు ఘోరతపంబొనర్చి లోకపాలుఁడయ్యెను. ఆతఁడు ప్రాణులకుఁ బుణ్యపాపఫలముల నొసంగుచుండును. యమరూప మునఁ బాపులను శిక్షించు చుండును. ఈతని చెల్లెలు యమున నదీ రూపమునఁ బాపులను దరింపజేయును. ఆమె భగవానునకుఁ బట్టపు రాణి యయ్యెను. ఛాయాపుత్రుఁడగు సావర్ణి యిప్పటికిని సుమేరువు నందు తపమొనర్చుచున్నాఁడు రాఁబోవు మన్వంతర మందా తఁడును మనుపదవియందుఁ బ్రతిష్ఠితుఁడగును, ఆతని రెండవ కుమారుఁడు శనైశ్చరుఁడు గ్రహమయ్యెను. ఈతఁడు గ్రహము

లన్నిదిలో మెల్ల మెల్లగ గదలును. అందువలన శనైశ్చరుడనఁ బడెను. కొన్ని గ్రహములు రెండుంబాతిక దినములునుఁ కొన్ని నెలలుగను, కొన్నివర్షములుగను జ్యోతిశ్చక్రమునఁ బరిక్రమించును, కాని ఈతనికి రెంతున్నర సంవత్సరములు పట్టును. ఈతఁ డెవరినిఁ జూచిన వానికి సర్వనాశనమగును, ఈతని చెల్లెలగు తపతి వివాహము సంవర్ణ మహారాజుతో నయ్యెనుఁ ఈతడును దరువాత నదియై ప్రవహించెను.

ఈసోదరు లందరును శాసకులును, గర్మానుసారముగ ఫలము లొసంగు వారైరి. వీరందరలో యమున ఒక్కతెయే పాపులను గూడ తరింపఁజేయు దయావతియయ్యెను. ఈమె యమునకు సోదరి యగుటచేఁ గొంచెము సౌకర్యమేర్పరచినది.''

అంత శౌనకుఁ డిట్లడిగెను :- "వివస్వంతుని పుత్రియగు యమున తన సోదరుఁడగు యమునితోఁ బ్రాణుల కొరకేయే సౌకర్యముల నేర్పరచినదో మాకు చెప్పవలయును."

అంత సూతుఁడిట్లనెను :- ''స్వామీ! యమున మిక్కిలి దయావతి. ఆమె అన్నయగు యముఁడతి కఠోర హృదయుఁడు. ఆతఁడు నిత్యమును బ్రాణులను జంపును. పాపులకు గఠోరదండన మొనరించును. దీనినిఁగాంచఁగనే యమునకు జాలదయ కలిగెను. ఆమె తన సోదరునితోఁ జాలసార్లిట్లనెను :- "అన్నా! ప్రాణుల నిట్లు వేధించుట ఉచితముకాదు."

యమరాజిది విని యమునను గసరుచు నిట్లనెను :- "నీవు చిన్నదానవు. నీకు బుద్ధిలేదు. కర్తవ్యపాలన మొనర్చుటయే ధర్మము."

యమున మెదలకుండెను. ఆమె అనేకసార్లు యముని దన యింటికిఁ బిలిచెను. కాని యింకొకరి యింటికి వెడలుటకు యమున కవకాశమెచ్చటిది ? యమున భ్రాతృ స్నేహమున మాటి మాటికినిఁ బిలుచుచుండును,

ఒకసారి యముఁడిట్లనుకొనెను :- "చిన్న చెల్లెలు మాటి మాటికినిఁ బిలుచుచున్నది. ఈమె యింటికి వెళ్ళి రావలెను." అను కొని యముఁడామె యింటికి వెళ్ళెను. యమున తన సోదరునిఁ గాంచి ఆతనికి గొప్ప సత్కార మొనర్చెను. అనేక విధములగు చక్కని వ్యంజనముల నొనర్చెను. మిక్కిలి ప్రేమతోఁ దన చేతులతోడనే చాల వస్తువులను జేసెను. మంచి యాసనములను బరచి ఆతనికి భోజనము పెట్టెను. మాలలు వైచెను. తాంబూల మొసంగెను. ఆతని మస్తకమునఁ దిలకమును బెట్టెను. యమరాజు సోదరికి కొంచెముగ దక్షిణ నొసంగెను. అంత నత్యంత ప్రేమతో యమున యిట్లనెను :- "అన్నా ! నేనీ దక్షిణను గైకొనను. నీకే దైన నీయవలయుననిన నాకొక వరదాన మొసంగుఁడు."

యమరాజిట్లనెను :- "సరియే, అడుగుము. ఏ వరము కావలయును ?"

యమున యిట్లనెను :- "నేను కోరునదేమనఁగా నేఁటిదినమున నే సోదరి తన సోదరునకుఁ బ్రేమపూర్వకముగ భోజనమొసంగి, ఆతని నుదుటఁ దిలకమిడునో, సోదరుఁడామెకు దక్షిణాదులచే సత్కారమొనర్చునో ఆ యిద్దరకును నీకడ యమయాతనలనుభవింపవలసినపనిలేక పోవునుగాక !"

యమరాజు నవ్వి యిట్లనెను :- "సోదరీ ! నీవు నన్ను మోసగించితివి. మంచిది, అట్లే అగుగాక ! నేఁటినుండి యే సోదరి తన సోదరునకత్యంత ప్రేమతో భోజనమిడఁగా, సోదరుఁడామెకు హృదయపూర్వకముగ సత్కరించునో వారిద్దరును నాదండనమునకుఁ బాత్రులుకాకుందురుగాక !" ఇట్లు పలికి యముఁడు తన లోకమునకుఁబోయెను.

అది దీపావళి తరువాతఁ గార్తీకశుక్ల విదియ. ఆ దినము నుండి ఆ ద్వితీయకు భ్రాతృద్వితీయ యందురు. అప్పటినుండి ప్రేమమయులగు సోదరీమణులు తమ సోదరులకు ఆ దినమునఁ బ్రేమతో భోజనమిడుచుందురు. ఏదో దక్షిణను గూడ గ్రహించెదరు. యమున దయచే యమయాతననుండి విడివడెదరు. కావున నాదినమున యమునా స్నాన మవశ్యము చేయవలెను. యమునా తీరమున నున్నచో సోదరునకు భోజనమిడవలెను. యమునా తీరము దొరకకున్నను నింటిలోనైనను జేయవచ్చును."

సూతుఁడిట్లనెను :- "మునులారా ! నేను సంక్షేపముగ వివస్వంతుఁడగు సూర్యుని యొక్కయు, ఆతని సంతానము యొక్కయు కథను జెప్పితిని. మీరు రాబోవు సప్త మన్వంతరముల వృత్తాంతమునుఁ వినుఁడు."

.....

## ఆగామి సప్త మన్వంతరముల కథ

శ్లో॥ రాజంశ్చతుర్దశైతాని త్రికాలానుగతానితే ।
ప్రోక్తాన్యేభిర్మితః కల్పో యుగ సాహస్ర పర్యయః ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౩ అ. ౩౬ శ్లో॥

క. జగతీశ త్రి కాలములను
బొగడొందుమను ప్రకారములు సెప్పఁబడెం
దగఁబదునలువురు మనువులుఁ
దెగయుగములువేయి నడవ దివమజునకగుఁ.

శ్రీమదాంధ్ర భాగవతము

సాధారణముగఁ గథాప్రసంగమున శ్రోతలకు వంశావళిని గూర్చి వినవలయుననను కుతూహలముండదు. ఆతని కీతఁడు పుత్రుఁడయ్యెను. ఈతఁడు మంత్రియయ్యెను. ఈతఁడు పురోహితుఁడయ్యెనను సంగతులను వినుటవలనఁ బ్రయోజనమేమున్నది? ఏదైన విశిష్టసంఘటనమున్నచో నందు రుచి వృద్ధిపొందును. విశేష

ఘటనము లేకున్నచో దానియందుఁ బ్రవృత్తియుండదు. ఈ వంశావళిని వినుటచేతను, వీరినామములను వినుటచేతను స్వర్గముకలుగును. పుణ్యములు వృద్ధిపొందునను ఫలశ్రుతిని జెప్పుట కథయందు బ్రవృత్తినిఁ గలిగించుటకే. ఏలయనఁగా వంశావళినిఁజెప్పకున్న తరువాత కథ నడుచుటెట్లు ? బీజముండిన దానియొక్క విస్తారముం డును. కావున వంశాదిప్రకరణము నీరసమైనను దానిని ధైర్య పూర్వకముగఁ బుణ్యప్రదమని భావించి శ్రద్ధతో వినవలయును.

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా ! నేనీ కల్పమునఁ గడచిన ఆఱు మన్వంతరముల కథను జెప్పితిని. ఇప్పుడు జరుగుచున్న యేడవ మన్వంతర కథ విషయమును జెప్పితిని."

అంతఁ బరీక్షిన్మహారాజిట్లనెను :- "స్వామీ ! వర్తమాన మన్వంతరకథను నీవత్యంత సంక్షేపముగఁ జెప్పితివి. వైవస్వత మను వంశమును వర్ణించియుండలేదు. ఈ మన్వంతరావతారమగు వామన చరిత్ర విశేషములను జెప్పలేదు. ఈ అన్నివిషయములను విస్తారముగఁ జెప్పవలయును. జరిగినదేమో జరిగినది. రాఁబోవునవి ఇంకను భవిష్యగర్భమున దాగియున్నవి. మనకు వర్తమానముతోఁ బనియుండును."

శ్రీశుకుఁడిట్లనెను :- "రాజా ! నేను వైవసత్వమను వంశ వర్ణనమును విస్తారముగ నొనర్చెదను. వామనచరిత్రమును జెప్పెదను. కాని యీ కథా ప్రసంగమును బూర్తిచేయుటకై సంక్షేపముగ నీవీకల్పములోని భూత, వర్తమాన, భవిష్యన్మనువుల

వృత్తాంతమును వినవలయును. భూతవర్తమాన మనువుల విషయ మునుగూర్చి నేనిదివరకు చెప్పితిని. ఇప్పుడు రాఁబోవు నేడుగురు మనవులనుగూర్చి వినుము"

రాజిట్లనెను :- "మంచిది స్వామీ! సంక్షేపముగఁ జెప్పుడు. భవిష్యము భవిష్యమేకదా!"

అంత శ్రీశుకుఁడిట్లనెను :- "సరేవినుము. ఎనిమిదవ మనువు వివస్వంతుని పుత్రుఁడగు చాయాసుతుఁడు సావర్ణియగును. నిర్మోహ విరజస్కులనువారాతనికిఁ బుత్రులగుదురు. విరోచన పుత్రుఁడగు బలి ఆ మన్వంతరమున ఇంద్రుఁడగును. తరువాత నీతఁ డింద్ర పదవినిగూడ వదలి ముక్తుఁడగును. ఆ సమయమున గాలవ, దీప్త మంత, పరశురామ, అశ్వత్థామ, కృపాచార్య, ఋష్యశృంగ, మా తండ్రియగు వ్యాసభగవానుఁడు వీరందరును సప్తర్షులయ్యెదరు. వారిప్పుడు వారి వారి ఆశ్రమములందు సమాధులలో నున్నారు. ఈ మన్వంతరమున భగవానుఁడు సార్వభౌముఁడనుపేర నవత రించును. ఆతని తల్లిపేరు సరస్వతిఁ ఆతనికి తండ్రి దేవగుహ్య ముని కాఁగలఁడు. ఈతఁడిప్పటి యింద్రుని సింహాసనమునుండి లాగివైచి బలిని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టును.

తొమ్మిదవ మనువు వరుణుని పుత్రుఁడగు దక్షసావర్ణి కాఁగలఁడు. ఆతనికి భూతకేతువు, దీప్తికేతువు మొదలగువారు పుత్రులగుదురు. పార, మరీచగర్భాదులు దేవతాగణమయ్యెదరు. అద్భుతుఁడనువాఁడింద్రుఁడగును, ద్యుతిమంతాదులు సప్తర్షులయ్యె

దరు. ఆ మన్వంతరమందు భగవానుఁడు ఆయుష్మంతుఁడనువానికి అంబుధార యను పత్నియందు ఋషభనామమున నవతరించును. అతఁ డింద్రునకుఁ త్రైలోక్యరాజ్య ప్రదానమును గావించును.

పదవ మనువు ఉపశ్లోకుని పుత్రుఁడగు బ్రహ్మసావర్ణి యగును. ఆతనికి భూరిషేణాదులు పుత్రులగుదురు. హవిష్మంతుఁడు, సుకృతి, సత్య, జయ, మూర్త్యాదులు సప్తర్షులయ్యెదరు. సువాసన, విరుద్ధాదులు దేవగణములుగను, శంభుడనువాఁ డింద్రుఁడుగను నగును. ఈ మన్వంతరమందు భగవానుఁడు విష్వక్సేన నామమున విశ్వస్రష్టయొక్క గృహమున విషూచియను నాతని పత్ని గర్భమున నవతరించి శంభునకు సహాయమొనర్చి, శత క్రతువును సుఖిగా నొనర్చును.

పదునొకండవవాఁడు మహామనస్వియగు ధర్మసావర్ణి మనువు కాఁగలఁడు. ఆతనికి సత్య, ధర్మాదులను వారు పదుగురు పుత్రులుదయించెదరు. ఆసమయమున దేవగణముల పేరు విహంగమ, కామగమ, నిర్వాణరుచి అనువారు, ఇంద్రుని పేరు వైధృతుఁడు. ఆర్యకుని వీర్యమున వైధృతయను నామె గర్భమున నాసమయమున భగవానుఁడు ధర్మసేతువను పేర మన్వంతరావతారమెత్తును. ఆ మన్వంతర పర్యంతము ఇంద్రపాలనమా యంశావతారము ద్వారముననే జరుగును.

పండ్రెండవ మనువుపేరు రుద్రసావర్ణి. ఆతనికి దేవవానుఁడు, ఉపేక్ష, దేవశ్రేష్ఠాదులు మనుపుత్రులగుదురు. వారా

మన్వంతరము పర్యంతము పృథివీపాలనమొనర్చెదరు. ఆసమయమున ఋతధాముఁడను నింద్రుడు వచ్చును. హరితాదులు దేవతా గణమయ్యెదరు. తపోమూర్తి తపస్వి, ఆగ్నీధ్రకాదులు సప్తర్షులయ్యెదరు. సత్యసహుఁడను మునివలన సూనృతయను పత్ని గర్భమున భగవానుఁడు శ్రీహరి అంశావతారము కలుగును. ఆతఁడు సుధాముఁడను పేర నామన్వంతరమును పాలించును.

పదుమూఁడవ మనువు దేవసావర్ణియగును. చిత్రసేన విచిత్రాదులాతనికి సుపుత్రులగుదురు. ఆసమయమున సుకర్మ, సుత్రాములనువారు దేవతా గణమయ్యెదరు. ఇంద్రుని పేరు దివస్వతి, నిర్మోక, తత్వదర్శ్యాదులు సప్తర్షి పదమందు ప్రతిష్ఠితులగుదురు. ఆ సమయమున దివస్వతి నింద్రపదము నందుంచి, ఆమన్వంతర మంతయును పాలింపఁ జేయుటకై యోగేశ్వరుఁడను పేర భగవంతుఁడవతరించును. ఆతని తల్లి పేరు బృహతి. తండ్రి పేరు దేవహోత్రుఁడు కాఁగలడు.

పదునాల్గవ మనువుపేరు ఇంద్రసావర్ణి. ఉరు, గంభీర బుద్ధ్యాదులాతనికిఁ బ్రసిద్ధపుత్రులయ్యెదరు. ఆ సమయమునఁ బవిత్ర, చాక్షుషాదులు దేవగణ మయ్యెదరు. శుచి యను వాఁడింద్రుఁడగును. అగ్నిబాహు, శుచి, శుద్ధ, మాగధాదులు సప్తర్షి గణమయ్యెదరు రాజా! ఆమన్వంతరమున వితాన యను మహాభాగ్యవతియగు తల్లి గర్భమున సత్రాయణ పుత్రుఁడగు బృహద్భానుఁడను పేర భగవంతుని అంశావతారము కలుగును.

ఆతఁడా మన్వంతరమును బాలించి, ప్రపంచమునఁగర్మకాండను ప్రవర్తింపఁజేయును.

శ్రీ శుకదేవుఁడిట్లనెను:-నేని విధముగ జరిగిన నాఱు మన్వంతరములను, వర్తమాన మన్వంతరమును, రాఁబోవు నేడు మన్వంతరములను గూర్చియు వర్ణించితిని. బ్రహ్మయొక్క ఒక్క పగిలు పదునల్గురు మనువులు, పదునలుగు రింద్రులు, పదునలుగురు సప్తర్షులు పదునాలుగు దేవతాగణములు, పదునాలుగు మనుపుత్ర వంశములు, పదునాలుగు భగవంతునియొక్క మన్వంతరావతారములు కలుగును. అప్పుడు బ్రహ్మకొక్క పగలగును. దానికి కల్ప మను పేరునుగలదు. కల్పాంతమందు త్రిలోకములు నశించును. నైమిత్తిక ప్రళయము సంభవించును. అట్లే ఆదే కాలము బ్రహ్మకు రాత్రియునగును. ఇట్లు మూఁడువంద లఱువది దినములు బ్రహ్మకొక సంవత్సరము. ఆతని సంవత్సర మానమున నాతనికి నూఱేండ్రా యుస్సుండును నూఱు సంవత్సరములైన తరువాత నింకొక బ్రహ్మరాఁగలఁడు. మరల నిట్లే సృష్టిక్రమము జరుగుచుండును, మరల సృష్టియగుచుండును. మరలఁగల్పము లేర్పడుచుండును. ఈ చక్రమనాదినుండి నడచుచున్నది. అనంతకాలమువరకు జరుగుచునే యుండును. దానికంతము లేదు. ఈ కాలచక్రములో మానవుఁడు తన నూఱేండ్ల ఆయుర్దాయమును జూచుకొని విఱ్ఱవీగుచు ననేక పాపము లొనర్చుచుండును. ఈ నూరేండ్లు అనంతాగాధ సముద్రములో రెండు బిందువులంత లేదు. కావున నభిమానమును వీడి కాల రూపుఁడగు కృష్ణునిఁ జింతింపవలయును.

# మన్వంతరము లందు మన్వాదుల కార్యములు

శ్లో॥ మన్వంతరేష భగవన్ యథా మన్వాదయ స్త్విమే,
యస్మిన్ కర్మణి యేయేన నియుక్తా స్తద్వదస్వ మే॥
శ్రీభాగ. ౮ స్కం. ౧౪అ. ౧ శ్లో॥

ఆ॥ ఈ వరంబులందు నీమను ప్రముఖుల
నెవ్వరనుచు వార లేమి కతన
నధిక విభవులైరి హరి యేల జనియించె
నెఱుఁగఁబలుకు నాకు నిద్ధచరిత
శ్రీమదాంధ్ర భాగవతము

ఈ జగత్తంతయును నొకనియమమున నున్నది. అందర కార్యములు నిశ్చితములైయున్నవి. సమస్త కార్యములకును గార్య గాలములును నిశ్చితమై యున్నవి. అందరకును నాయువు సుఖ దుఃఖాదులు మొదటనే లిఖింపఁబడియున్నవి. అట్లు కాకుండినచో భవిష్యత్తును జెప్పుజ్యోతిషాది శాస్త్రములన్నియును వ్యర్థములగును అజ్ఞాతల మగుటచే భవిష్యద్విషయములు మనకుఁ దెలియుటలేదు. అందువలనఁ జీఁకటిలోఁ దిరుగాడు చున్నాము. మనకుఁ ద్రికాల జ్ఞానముండి యుండినచో నాశ్చర్యమును జెందవలసిన పనియేలేదు. ఇంద్రుని కార్యము నిశ్చితమైయున్నది. ఇదేవిధముగ నన్నియును నిదివరకే నిర్ణయింపఁబడి యున్నవి. జీవుఁడు భ్రమవశమునఁ

దిరుగుచున్నాఁడు. అజ్ఞాన వశమున దుఃఖితుఁడగుచున్నాఁడు. ఈ సృష్టి రహస్యమును బాగుగాఁ దెలిసికొని, హృదయపటలమున సంకిత మొనర్చుకొనినచోఁ జింతింపవలసిన అవసరమే యుండదు. అందువలన శాస్త్రములందు సృష్టియొక్కయు, దాని నియమముల యొక్కయు వర్ణనముచేయఁబడుచుండును. దానినిఁ దెలిసికొని జీవులు శోకమోహ, విస్మయాదుల నుండి సర్వదా ముక్తుఁడగును.

భూత భవిష్య ద్వర్తమానములలోని పదునాల్గు మన్వంతరములలో నగు మనువులు, మనుపుత్రులు, ఇంద్రుడు, దేవగణము, సప్తర్షులు, భగవంతునియొక్క మన్వంతరావతార వర్ణనమును శ్రీశుకుఁడొనర్చెను. అప్పుడంతయును విని పరీక్షిన్మహారాజిట్లడిగెను :-"ప్రభూ! మీరు వేర్వేరుమన్వంతరములలోని మన్వాదుల వర్ణనమును గావించితిరి, కాని నాకొక శంక అట్లే నిలిచియున్నది. ఈ చెప్పఁబడిన వారందరును భగవదవతార భేదములే వీరందరునే మేమికార్యము లొనర్చెదరు? మన్వంతరములోని మనువులే యే కార్యము లొనర్చుచుందురు వారికిఁ బుట్టిన పుత్రులు వారికేయేకార్యములలో సహకరించుచుందురు? ఇంద్రుఁడేమి చేయును. ఇంతమంది దేవతా గణముల సృష్టియెందులకు? సప్తర్షులందరును గలిసి యే కర్తవ్యపాలన మొనరించెదరు? ప్రతి మన్వంతర మందును భగవానుని అంశావతారము యొక్క ఆవశ్యకత యేమున్నది! భగవానుఁ డవతరించి యేయే కార్యము లొనర్చును?"

పరీక్షిన్మహారాజుయొక్క యీ వాక్యములను విని శ్రీశుకుఁడు గంభీరుఁడై యిట్లనెను :-"రాజా! ఈ ఆఱుగురును జూచు

టకు వేఱువేఱుగఁ గనఁబడుచుందురు. కాని వాస్తవమున వీరంద రొక్కటే. శ్రీహరియే సృష్టి రక్షణము కొరకు ఆఱురూపములను ధరించుచుండును. ప్రజా పాలకుఁడగు ప్రభువు తనకళాంశములచే నీయన్నిటికిని శాసకుఁడై శాసించుచుండును. మన్వంతరమును గ్రహించి మనవు ఇంద్రాదులను రక్షించుచుండును. వారిని సంకటము నుండి రక్షించును. అసురులను దండించును సంసార యాత్రా నిర్వాహమును గావించును.

మన్వంతరాధిపతియగు మనువు బ్రహ్మచే సృజింపఁబడి, శ్రీహరిచేఁబ్రచలితము కావింపఁబడిన యీ సృష్టియొక్క ప్రజా జనుల ధర్మముల నాచరింపఁ జేయుచుండెను. నాల్గు పాదముల ధర్మమును స్థాపించును. కృత, త్రేతాదిధర్మ ప్రధానయుగములందు భూమిపై నుండును. అధర్మ ప్రధానమగు గలియుగాది యుగము లందు గుప్తరూపమున నన్యా వర్షములందుననో లేక అన్యలోకము లందో ధ్యాన మగ్నులై యుందురు. మనుపుత్రులు మన్వంతర పర్యంతము పుత్ర ప్రపౌత్రాది క్రమమున నీ సమస్త భూమండల మందు భూపతులై శాసించెదరు.

ఇంద్రుఁడు స్వర్గమునకు రాజగును. అతఁడు సమస్త దేవత లకును శాసకుఁడు నధిపతియగును. భగవంతుఁ డొసంగిన త్రిభువన లక్ష్మి నుపభోగించును స్వర్గమందలి అత్యుత్కృష్ట సుఖముల నుప భోగించుచుఁ ద్రిలోకములను బాలించుచుండును. ఆతనివెంట నిత్య దేవతల యొక్క వేఱు వేఱు గణములుండెదరు. పంచమహా యజ్ఞ

కర్మలందు భోక్తలరూపమున నున్న ఋషి పితృ, భూత మనుష్య దేవాదులు యజ్ఞ భాగములను గ్రహించుచు మన్వంతర పర్యంత ముండెదరు. మనుష్య యజ్ఞము ద్వారా దేవతా భజన మొనర్చు చుందురు. దీనిచేఁ బ్రసన్నులై దేవతా గణము వారి సమస్త మనో రథములను బూర్ణము కావించెదరు. పరస్పర భావములచే భావి తులై పరమశ్రేయమున కధికారు లయ్యెదరు.

ఆ మన్వంతర మందుండు సప్తర్షిగణము వేదోద్ధారమును గావించుచుందురు. శాస్త్ర ప్రచార మొనర్చెదరు. భిన్న భిన్న రూప ములుధరించి ధర్మ సంస్థాపన మొనర్చెదరు. జ్ఞాన ప్రచార మొనర్చు టకై సనకాది సిద్ధుల రూపములను ధరించునట్లు ప్రజలకు జ్ఞానోప దేశ మొనర్చుచుందురు. కొందఱు మునులు స్మృతి కారులై కర్మ కాండ నుపదేశించెదరు. యాజ్ఞవల్క్యాది రూపములందు స్వయ ముగఁ గర్మకాండా చరణ మొనర్చెదరు. ఇతర గృహస్థులను మొదలగు వారినిఁ బ్రేరేపించెదరుఁ దత్తాత్రేయ కపిలాది యోగే శ్వరుల రూపమును ధరించి యోగమార్గ ప్రచార మొనర్చెదరు. నారదాది రూపముతో నారద పాంచరాత్రాది శాస్త్రములను బ్రచార ప్రసారము లొనర్చెదరు.

వీరందరును శ్రీహరి స్వరూపములే. ఆతఁడే స్వయముగఁ బ్రజాపతి రూపమును ధరించి అండజ, జరాయుజ, స్వేదజ, ఉద్భి జాది రూపమున సమస్త సృష్టి నుత్పన్నము కావించెదరు. సామ్రాట్టై దస్యులనుండి ప్రజలను రక్షించును. వారిని దోచుకొన

కుండునట్లు రక్షించును. ఆతఁడే వసంత, గ్రీష్మ, వర్ష, శరద్హేమంత శిశిరాదిఋతు రూపమును ధరించి శీతోష్ణముల నేర్పరచును. ప్రాణుల ఆయుస్సును నశింపఁజేసి కాల రూపమును ధరించి వారిని సంహరించును, మణిమాలలో సూత్రమట్లాతఁడీ ప్రపంచమున నోత ప్రోతమై యున్నాఁడు. సమస్త జీవులను భగవంతుని యొక్క నామ రూపాత్మక మాయచే మోహితులై కొందరు భగవంతుఁడు లేఁడని యును, గొందరు అద్వైతుఁ డనియుఁ గొందరు విశిష్టాద్వైతు డని యుఁ ద్వైతాద్వైతుఁడనియుఁ గొందఱు శివాద్వైతుఁడనియు నిట్లనే కములుగఁ జెప్పుచు నాతని నిరూపించుచుందురు. భిన్న భిన్న శాస్త్ర ముల ద్వారా భిన్న భిన్న రూపములందు నిరంతరము నిరూపణ మొనర్చినను వాస్తవిక రూపమున నెవరికినిఁ దెలియఁ బడఁడు మహారాజా! నేను నీకత్యంత సంక్షేపముగఁ బదునాల్గు మన్వంత రముల వృత్తాంతమును, మనువు యొక్కయు, మనుపుత్రుల యొక్కయు, ఇంద్ర, దేవగణ, సప్తర్షి, మన్వంతరావతారముల యొక్కయు నామములను, గార్యములను వర్ణించితిని. ఇప్పుడు నీవే మడుగఁ దలఁచుచున్నావు?"

అంత పరీక్షిన్మహారా జిట్లనెను :- "స్వామీ! మీరీవర్తమాన మన్వంతరమును వైవస్వత మన్వంతర మంటిరి. ఈ మన్వంత రావతార నామము వామనుఁడు లేక ఉపేంద్రుఁ డంటిరి. ఈ యుపేంద్రుఁ డేయే విశేషకార్యము లొనర్చినాఁడు? వామన చరిత్ర శ్రవణమొనర్చుటకు నాకు మిక్కిలి యభిలాష కలదు."

అంత శుకుఁడిట్లనెను :- "రాజా ! ఈవామనుఁడు ఛలకపట మొనర్చి బలిని మూఁడడుఁగులడిగెను. రాజగు బలి దాని నీయఁ జాలక పోఁగా బంధించెను."

ఇది వినిరాజత్యంతాశ్చర్యముతో నిట్లనెను:- "ప్రభూ!మీరొక దానికంటె నొకటి విచిత్రమును, నద్భుతమునగు విషయములను జెప్పుచున్నారు. స్వామీ! ఎవరైనను లేని వస్తువును యాచింపవల యును. భగవంతున కేవస్తువుకొదువ యున్నది? ఆతఁడడిగినను నెవరి నడుగును? ఆతఁడు సమస్త జగత్తునకు స్వామి. విశ్వ నాథుఁడు. ఒకవేళ భగవానుఁడు మర్యాదా రక్షణము కొఱకడిగినాఁడే యనుకొనుఁడు. మూఁడడుగులు లేలయడిగినాఁడు. ఇంతటి గొప్ప చక్రవర్తి మూఁడడుగుల భూమినేల నీయఁజాలక పోయినాఁడు. ఒకవేళ నేకారణముచే నైనను నీయఁజాలకున్న నాతఁడు ఋణ మును గొన లేదుకదా! భగవానుఁ డాతని బంధించు టెందులకు? ఇట్లు ఋణవిముక్తినిఁ జెందకున్నచోఁగృపణుఁడును, లోభియునగు వాఁడు వానియొక్క యిల్లు వాఁకిలి నమ్మించనైన నమ్మించును. లేదా కారాగృహమున కైనను బంపును. భగవానునికిది శోభించదే. తనకోరికను నెరవేర్చు కొనుట భగవానుఁడు విశ్వంభరుఁడు పూర్ణ కాముఁడు, నిరీహుడు, నిస్పృహుడు తన భూమికొరకై తన ధనము కొరకై యెవరినైనను యాచించు టుచితముఁగగనఁబడుట లేదు. ఈ విషయమున మాకు చాల కుతూహలమేర్పడుచున్నది. ప్రభూ! ఈ చరిత్రనంతయును జెప్పి నాసమస్త సందేహములకును సమా ధానమును జెప్పుడు. నాయుత్సుకతను దూర మొనర్పుడు."

సూతుఁడు శౌనకాది మునులతో నిట్లనెను :-ఋషులారా! అభిమన్యు సుతుఁడును, నుత్తరానందవర్ధనుఁడును నగుఁ బరీక్షన్మహారాజీ విధముగఁ బ్రశ్నింపఁగా నాతనికిఁ బ్రత్యుత్తర మొసంగుచు శుకుఁడు వామన చరిత్రమును జెప్ప నుద్యుక్తుఁడయ్యెను.

.....

## బలి సురల స్వర్గము గొఱకు యత్నించుట

శ్లో॥ పరాజితశ్రీ రసుభి-శ్చహాపితో
హీంద్రేణ రాజన్ భృగుభిః సజీవితః ।
సర్వాత్మనా తానభజద్భృగూన్ బలిః
శిష్యో మహాత్మార్థ నివేదనేన॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౫ అ. ౬౪ శ్లో॥

సీ॥ పురుహూతుచే నొచ్చి పోయి భార్గవులచే
బలియెట్ట కేలకు బ్రదికి వారి
చిత్తంబు రాఁగొల్చి శిష్యుఁడై వర్తింప
వారు నాతని భక్తివలన మెచ్చి
విశ్వజిద్యాగంబు విధితోడఁ జేయింప
భవ్యకాంచన పట్ట బద్ధ రథము
నర్కవాజులఁ బోలు హరులఁ గంఠీరవ
ధ్వజము మహాదివ్య ధనువుఁ బూర్ణ.

తే॥ హూణయు శరంబుఁగవచంబుఁ దౌలుతహోమ
పావకుండి చ్చెనమ్లాన పద్మమాలఁ
గలుష హరుఁడగు తన తాత కరుణ నొసంగె,
సోమ సంకాశ శంఖంబు శుక్రుఁడిచ్చె ॥

శ్రీ మదాంధ్ర భాగవతము

తన్నుఁదాను గురుచరణములకు సమర్పించుకొనినచో వాని కన్ని మనోరథములును సిద్ధించును. ప్రపంచములో సమస్త కార్యే ములును బురుషార్థమున జరుగును. ప్రయత్నపరుఁడు తన ప్రయ త్నమువలన నెన్ని సంకటములు కలిగినను విచలితుఁడు కాఁడు. కార్యమొనర్చుటలో విఘ్నములు కలుగును. కాని మనస్వియగు వాఁడా విఘ్నములను దుచ్ఛములుగ భావించి సర్వథా వానినవ హేళన మొనర్చుచుండును. పురుషార్థము అహంకార పూర్ణమై యుండును. దాని సిద్ధిలో సందేహము కలదు. ఏలయనఁగాఁ ప్రాణి అపూర్ణుఁడు. కాని యే పురుషార్థము శ్రద్ధాసహితముగ-గురుజన శుశ్రూషా సేవలొనర్చుచుఁ జేయఁబడునో అది యెన్నటికి సఫలము కాదు. దాని సిద్ధిలో నేవిధమగు సందేహమును లేదు. దానిలో సఫ లము కలుగుట ధ్రువము.

శుక దేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను : "రాజా ! నీవు నన్ను వామనావతారకారణము నడిగితివి. నేను దానిని నీకు జెప్పె దను. సముద్రమునఁ బుట్టిన యమృతమును మోహినీరూపుఁడగు భగవానుఁడు దేవతలకే పోయఁగా నప్పుడు ఘన ఘోరదేవాసుర

సంగ్రామము జరిగినది. భగవత్కృపచే నా యుద్ధమందసురులకుఁ బరాజయము కలిగెను. విజయశ్రీ సురలను వరించెను. అసురుల రాజగు విరోచనపుత్రుఁడు బలి యాయుద్ధమందు మృత ప్రాయుఁ డయ్యెను. ఇంక ననేకులగు నసురులు మడసిరి. మిగిలిన యసురులు వారినందఱను వస్తాచలమునకుఁ గొంపోయిరి అచ్చట శుక్రాచార్యుఁడు వారి నందఱను దన మృతసంజీవనీ విద్యచే బ్రతికించెను. శుక్రాచార్యుఁడు తాఁకఁగనే బలి బ్రతికెను. శ్రీహీనుఁడును, ప్రాణవిహీనుఁడు నగు బలికి భృగునందనుఁడగు శుక్రాచార్యుఁడు జీవన దాన మొనర్చెను.

బలిచక్రవర్తి గొప్ప ధర్మాత్ముఁడును, కృతజ్ఞుఁడునై యుండెను. అతఁడిట్లనుకొనెను. "గురుదేవుఁడు మమ్ములనెంతో అనుగ్రహించినాఁడు. చచ్చిపోయిన మమ్ము గురుదేవుఁడే జీవన దానమొసఁగి బ్రతికించినాఁడు. ఇప్పుడు మేమైన నున్నతినిఁ బొంద వలయుననిన గురుకృపచేతనే పొందవలయును. మానవాభ్యుదయమునకు ముఖ్యకారణము గురుసేవయే. సేవ చేయువాఁడు దాని ఫలమునమభవించును. గురుపూజన మొనర్చువాఁడు ప్రపంచమున సర్వత్ర పూజితుండగును. గురువునకు సర్వస్వమర్పించువాడు సర్వస్వమును బొందగలఁడు." అని యిట్లాలోచించుకొని అతఁడు తను, మన, ధనములచే సర్వవిధములను శుక్రాచార్యులను సేవించుచుండెను. అతఁడు తన సర్వమును గురుచరణముల కర్పించెను. శుక్రాచార్యుఁడేది చెప్పిన నాతఁడది చేయును. అతని సుఖము కొరకై సమస్తములైన యేర్పాటులను గావించును అతని కే వస్తువు

కావలసి యుండిన దాని నెచ్చటనైనఁ దక్షణము తెచ్చియిచ్చును. ఆతని కెంతటి సామగ్రి ఆవశ్యకమగునో దానికి రెట్టింపుగఁ దెచ్చి యిచ్చుచుండెను. ఈ విధముగ నాతఁడు తన జీవిత ధ్యేయమును సురుశుశ్రూషగనే యేర్పరచుకొనెను.

సూతుఁ డిట్లనెను :—“మునులారా! సేవ మానవునిఁ దన వశము కావించుకొనునట్టి వస్తువు. పాషాణ హృదయము మీఁద నైనను దాని ప్రభావము పడును. సహృదయుఁడగు సాధు పురుషుఁడు సేవద్వారా అనుచిత కార్యమొనర్చుటకైన వివశుఁడగును సేవా భారమున నాతఁడు కృతజ్ఞతా వశమున నాతని యభ్యుదయము కొరకు సమస్తమును జేయుటకుఁ దత్పరుఁడగును. దుర్యోధనుఁడు క్రూరస్వభావుడైనను గురువగు ద్రోణాచార్యుని, భీష్ముని, శల్యుని భక్తితో సేవించుటచే వారికి పాండవులు ప్రాణాధిక ప్రియులైనను వారికి విరుద్ధముగ నస్త్రశస్త్రములను గైకొని యుద్ధార్థమై రణాంగణ భూమికి వచ్చిరి. సహజ స్నేహమును, ప్రాణములపై మోహమును త్యజించి యుద్ధమున మడసిరి. దుర్వాసుని వంటి కోపిష్ఠియగు ముని దుర్యోధనుని సేవాశుశ్రూషలచే సంతుష్టుఁడై పాండవులను సర్వనాశమొనరింప సమకట్టెను. శివుఁడు సేవాకారణమున బాణాసురునకు బురరక్షకుఁ డయ్యెను. మనము సేవ చేయు వారి యొక్క హృదయము సర్వదా మన శ్రేయస్సుకొఱకే వ్యగ్రమైయుండును. సతి యగు స్త్రీ తన సేవమూలముననే సత్పతిని వశపఱచుకొనెను. ఒకరి సంగతి యెందులకు? స్వయముగ భగ

వానుఁడును సేవకధీనుఁ డగును. భక్తుఁడగు నంబరీషునిపై దుర్వా సుఁడు కృత్యను బ్రయోగింపఁగా సుదర్శనము దానిని నశింపఁజేసి దుర్వాసుని వెంటఁబడెను. ఆతనికి సమస్త లోకములు తిరిగినను శరణము లభింపక పోఁగా భగవంతుని సమీపమునకు బోయెను. అప్పుడు భగవంతుఁడు స్పష్టముగ నిట్లనెను : నేను భక్తపరాధీనుఁ డను. భక్తుఁడు నన్నెట్లాడించిన నట్లాడెదను. ఏమి చేయించిన దానినిఁ జేసెదను. నేను స్వతంత్రుఁడను గాను. భక్తాభీష్టము ననుసరించి యాడెదను. కావున వశమొనర్చుకొనుటకు సేవ తప్ప వేరొక యుపాయము లేదు.

శ్రీశుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను :-"రాజా బలిచక్రవర్తి యీ విధముగ శుక్రాచార్యుని, నితర బ్రాహ్మణులను సేవింప మొదలిడెను. అప్పుడు శుక్రాచార్యుఁడు బ్రాహ్మణులందరను బిలిచి వారితో నాలోచించి యిట్లనెను:-"బ్రాహ్మణులారా! ఈవిరోచన నందనుఁడగు బలి తన సర్వస్వమును సమర్పించి యెట్లు బ్రాహ్మణు లను సేవించుచున్నాఁడో చూచుచున్నారుకదా! కావున మన మీత నికిఁ గల్యాణాభ్యుదయములు కలుగు కార్యముల నొనర్పవల యును. ఈతనిని మరల రాజ్యశ్రీ వరింప వలయును. ఈతఁడు మరలఁ ద్రిలోకాధిపతి కావలయును."

బ్రాహ్మణులిట్లనిరి :-"ప్రభూ ! మేము బలిచక్రవర్తి సేవ లచే మిక్కిలి సంతుష్టులమైతిమి. మీరేది యాజ్ఞాపించిన దానిని మేము ప్రాణపణముగ నొనర్ప నుద్యుక్తులమైనాము."

అంత శుక్రాచార్యుఁడిట్లనెను :- "నాశిష్యునిచే విధ్యుక్తముగ విశ్వజిద్యాగమును జేయింపవలయునని నా హృదయపూర్వకమగు గోరికయై యున్నది. ఆ యజ్ఞము విధిపూర్వకముగ నెరవేరినచో, ఈతనికి నిశ్చయముగ మరలఁ ద్రిలోక రాజ్యాధిపత్యమును నైశ్వర్యమును బ్రాప్తింపఁగలదు."

బ్రాహ్మణులుత్సాహముతో నిట్లనిరి :- "స్వామీ! మేమేమైనఁ జేయుటకుఁ దత్పరులమై యున్నాము. మీరవశ్య మసురేంద్రుని విశ్వజిద్యాగమునకై అభిషిక్తు నొనర్పుడు."

బ్రాహ్మణుల యనుమతినిఁబొంది శుక్రాచార్యుఁడు విధి విధాన పూర్వకముగ బలిని భృగువంశ బ్రాహ్మణ సహితముగ స్వర్గ కామనచే నైంద్ర మహాభిషేకముచే నభిషిక్తుఁగావించెను. అనంతరము వైదిక విధిచే విశ్వజిన్మహా యాగానుష్ఠానము నొనరింపజేసెను. దేవతలు మంత్రాధీనులు. శుద్ధ, పవిత్ర, నాయోపార్జితమైన హవనీయ సామగ్రుల ద్వారా బలిచేఁ బూజితుఁడై అగ్నిహోత్రుఁడు ప్రసన్నుఁడయ్యెను. యజ్ఞకుండమునుండి మూర్తిమంతుఁడగు నగ్ని యుత్పన్నుఁడై బలిచక్రవర్తికి దర్శన మొసంగెను. వాయువేగ మనోవేగములతోఁ బోఁగలిగిన హరిత వర్ణము గల హయములు పూన్చబడి, సింహచిహ్న చిహ్నితమగుదృఢ ధ్వజము విరాజిల్లుచుండు సువర్ణ మండితమగు రథమును నగ్నిహోత్రుఁడు ప్రసన్నుడై బలిచక్రవర్తి కొసంగెను. దీనికితోడుగా సువర్ణఖచితమగు దివ్యధనుస్సును, నెన్నటికినిఁ దరిగిపోని రెండ

షయ తూణీరములను, నెన్నటికిని భగ్నముకాని కవచమును నిట్టి యుద్ధోపయోగకరములును, విజయప్రదాన మొనర్చునట్టియు వస్త్రువుల నొసంగెను.

బలిచక్రవర్తికిఁ బితామహుఁడగు ప్రహ్లాదుఁడు పౌత్రునకు మంగళకామనకొరకెన్నఁడును వాడని దివ్యపుష్పమాల నొసంగెను. తాతగారొసంగిన మాలను ధరింపఁగనే బలియొక్క శోభ యద్భుతమయ్యెను. ఆతఁడు మూర్తీభవించిన వీరరసమువలె శోభించెను. ప్రయోగింపఁగనే ఆశబ్దమునకే శత్రువుల ధైర్యము సడలిపోవునట్టి దివ్యమును నద్భుతమును నగు శంఖమును శుక్రాచార్యుఁడు ప్రసన్నుఁడై శిష్యునకొసంగెను. దానిశబ్దమును వినఁగానే వారు రణాంగణమును వీడి పారిపోవలసినదే. ఈవిధముగ నందఱి వలన విజయాను రూపములును, యుద్ధోపయోగములునగు సామగ్రులను బొంది బలి మిక్కిలి సంతసించెను. ఇప్పుడు మరల నాతఁడు స్వర్గమును జయింప సంకల్పించెను. ప్రసన్నులైన భృగువంశ బ్రాహ్మణులు స్వస్తివాచన మొనరించి విజయసంబంధములగు మంత్రములను బఠించిరి. ఈవిధముగ సమస్త సామగ్రులచే సన్నద్ధుడై, బ్రాహ్మణుల యాశీర్వాదములను బొంది బలి తన చతురంగ సేనలను చేసికొని యుద్ధమునకు సిద్ధమయ్యెను. ఆతఁడు బ్రాహ్మణులకుఁ బ్రదక్షిణ మొనరించి అందరకును బ్రణామమును గావించెను. అంతఁదన పితామహుఁడగుఁ బ్రహ్లాదుని సమీపమునకువచ్చి, ఆతని చరణములకెరగి యిట్లనెను :- "పితామహా! మాకు విజ

యము కల్గునట్లాశీర్వదింపుఁడు." అప్పుడు ప్రహ్లాదుఁ డాశీర్వదించుచు నిట్లనెను :- "నీమార్గము నిష్కంటకమగుఁగాక ! నీవు నీశత్రువులపై విజయమును బొందుము."

బ్రాహ్మణులయొక్కయు, వృద్ధులయొక్కయు నాశీర్వచనానుమతులను బొంది బలిచక్రవర్తి అగ్నిదత్తమైన సువర్ణమండిత రథముపైఁ గూర్చుండెను. ఆతఁడు దివ్యకవచమును ధరించెను. ధనుస్సును ధరించి పృష్ఠభాగమందు అక్షయ తూణీరములను వ్రేలాడవైచుకొనెను. యుద్ధోపయోగకరములగు ఖడ్గమును, గదాదులను నస్త్రశస్త్రములనుధరించి, విశ్వవిజయుఁడగు నావీరుఁడని యిప్పుడే తోఁచుచుండెను ఆతని బాహువులకు సువర్ణముఁతో జేయఁబడిన బాజుబందులు శోభించుచుండెను. కర్ణములందుగల మకర కుండలములయొక్క రత్నకాంతులచేఁ గపోలముల యొక్క శ్రీవృద్ధి చెందుచుండెను. ఆతఁడు వస్త్రభూషణములనుధరించి, సుసజ్జితుఁడై దివ్యరథమందుఁ గూర్చుండఁగానే భూమిపైన పర సూర్యుఁడుదయించినట్లుండెను. హవనకుండములో మూర్తిమంతుఁడగు నగ్ని ప్రజ్వలించుచున్నట్లుండెను."

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా ! ఈవిధముగ బలిచక్రవర్తి సుసజ్జితుఁడై స్వర్గమునకు మరల విజయమును బొందుటకై సేనాసహితముగ బయలుదేరెను."

••••

# క్షయిష్ణువగు స్వర్గముపై బలి దండెత్తుట

శ్లో॥ తాం దేవధానీం స వరూథినీ పతిః
బహిః సమన్తాద్రురుధే పృతన్యయా ।
ఆచార్యదత్తం జలజం మహాస్వనమ్
దధ్మౌ ప్రయుంజ న్భయమింద్రయోషితామ్ ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౫ అ. ౨౩ శ్లో॥

జీవుని ప్రయత్నములన్నియును సుఖము కొఱకే. సుఖము కొరకే సామగ్రులను ప్రోవుచేయును. యుద్ధమొనర్చి సుఖదవస్తువులను బరులనుండిలాగుకొని తనకడనుంచుకొనును, కాని యనిత్యక్షయిష్ణు నశ్వర వస్తువులందు సుఖమెక్కడిది ? సంతోషమెక్కడిది ? మాటిమాటికిని వానినిఁబొంది సుఖస్థానమున దుఃఖమును బొందును. అయినను నాతఁడు లోభమును విడువఁజాలఁడు; దీనినే భగవానుని మాయాయందురు. మాయమోహితుఁడగు జీవుఁడీయనిత్య భోగముల కొరకు హింస నొనర్చుచుండును. ఈర్ష్యను వహించు చుండును. అయినను నివి సదా వెంటనుండవు. అవి నిమిషములోఁ గుమిలి పోవును తన్ను వీడిపోవును. నిశావసానమున నాయికా కంఠముననున్న మాల కుమిలిపోవునట్లు శరీరమునుండి వేరగును. కావుననే జ్ఞానులు యీ లౌకిక పారలౌకిక భోగములందు స్పృహ యుంపరు వారు వీని నుపభోగించుచుండియును వీనియెడల నుదాసీన ములగ నుందురు.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! బలిచక్రవర్తి తనగొప్ప చతురంగ అసురసేనను వెంటగైకొని భూమ్యాకాశమండలములను గంపింపఁజేయుచు స్వర్గముపైకెక్కెను. సేనలోని సైనికులందరును దమ లంబజిహ్వలతో మాటిమాటికినిఁ బెదవులను నాకుచుండిరి. వారు తమరక్త నేత్రముల నురుముచు నాకలోకమును జూచుచు దశ దిశలను దగ్ధమొనర్చుటకు దురాగ్రహ మొనర్చుచున్నట్లుండెను. వారందరును సతులైశ్వర్యావేగమునఁ దమద్వితీయుల మనుకొను చుండిరి. అందరును దాము బలివలె బలవంతులమనుకొనుచుండిరి. అసుర సామ్రాజ్య విభూతి మదమున మదోన్మత్తులైన దైత్య యూధపతులు తమయొక్క అమిత ప్రభావముచేఁ దమకుఁ దా మజే యుల మనుకొనుచుండిరి. వారింద్రునిఁ, నింద్రునిఁ యమరావతి పురినిఁ దిరస్కరించుచు దానిపైకెక్కి, నలువైపులను దానిని ముట్ట డించిరి. క్రోధముచేఁ గన్నులెఱ్ఱగఁజేయుచు నసురులచే ముట్టడింపఁ బడిన నా దివ్య స్వర్గపురి కమలకోశములచేఁ బట్టుకొనఁబడిన కర్ణికవలెఁ దోచుచుండెను. దానికి నలువైపులను నందనాది దివ్య కాననములుకలవు. దానిలోఁ గల్పవృక్షము తన శోభను వెదఁజల్లు చుండెను. యోజనముల కొలఁది సుగంధమును వెదజల్లు పుష్పము లందుండెను. వానిమీఁద మధులోలుపులగు మత్తమధుపము లెగు రుచు మధుమకరందమును బానమొనర్చుచుఁ బంకములందు పరాగ మంటుటచే బచ్చగ నుండెను. కలరవ మొనర్చుచు విహంగ బృంద మటు నిటు వృక్షముల నిమిత్తమై శాఖలందు దుముకుచుండెను తమ ప్రియులతోఁ గిలకిలారావము లొనర్చుచుండెను. కొన్ని వృక్షము

పైన చక్కని వివిధ వర్ణముల పచ్చివి పండువగు ఫలములు గుండ్ర గుండ్రగ శోభించుచుండెను. లేలేత చిగురుటాకులందు ఫలములు మఖమల్లుపరుపునందు బరుండినట్లుండెను. కొన్నిటి యందు చిన్నవి, పెద్దవి పుష్పగుచ్ఛములు శోభించుచుండెను. యౌవనము వృక్షములనుండి బయలు వెడలు చున్నట్లుండెను. వాయువేగమున నవి కదలుచున్నప్పుడు వానిని గదిలించు వాయువు నకుం దమ సుగంధము నొసంగుచుండెను. ఇంతటి సుగంధమును గొనిపోవుటకు వాయువసమర్థమై యుండెను. అది పరువిడుచు న్నా సౌరభమును మార్గమున వెదజల్లుచుం బోవుచుండెను. దాతకు నలు వైపులను యాచకులు మూగినటుల భ్రమరము లా పుష్పముల చుట్టును మూగుచుండెను.

ఉత్తమ శోభాయుక్తములగు నా స్వర్గోపవనము లందు స్వచ్ఛసలిలముగల సరోవరములుండెను. ఆ జలము పద్మపరా గమున సుగంధితమయ్యెను. కమల నాళములు పత్రములచే నా జలము కప్పబడియుండెను. వాని తీరములందు హంస, సారస, చక్రవాక, చక్రవాకి, కారండవ, జలకుక్కుట, బకాది జలజంతువు లటునుండి యిటు ముక్కులను ద్రిప్పుకొనుచుం దిరుగుచుండెను. పెద్ద పెద్ద సరస్సులలో సురసుందరులు తమ చెలికత్తెలతోం గమ నీయ క్రీడలొనర్చుచుండిరి. వారి శరీరమున కంటుకొనియున్న దివ్యాంగరాగ గంధముచే సువాసిత జలమింకను నధికముగ సుగం ధితమయ్యెను.

ఇంద్రుని అమరావతి కోటగోడలు జాంబూనద సువర్ణముచేఁ గట్టఁబడియుండెను. ఆకాశగంగ దానికి నాల్గువైపులను జుట్టుకొని యుండెను. అది యాకోట కగడ్తగ నుండెను. ఆ కోటకు పిక్కిలి యెత్తునఁ జివరగోపురాట్టాలికముల మీఁద పతాక లెగురుచుండెను. అవి యసురుల నింద్రాసనమున కాహ్వానించుచున్నట్లుండెను. ఆ దేవపురీ ద్వారములు స్ఫటికమణిమయములై శోభాయమానములుగ నుండెను. వానికి పెద్ద పెద్ద సువర్ణమండిత గడియలు వేయఁబడి యుండెను. పురినుండి బయటకు వెడలు ద్వారములకెదురుగా విశాలములగు రాజపథము లుండెను. అటునిటు నాటఁబడిన వృక్షములు కలిసికొనియుండెను. ఆ కారణమున మార్గమంతయును సదా శీతలముగ నుండెను. పెద్ద పెద్ద రహదారులనుండి చిన్న చిన్న రహదారులనుబోవుచుండెను అవియును సుందరములుగను రమ్యములుగనుండెను. రెండు రహదారులు కలిసినచోటఁ జిన్న చిన్న యుద్యానవనములు వేయఁబడి యుండెను. దగ్గఱలో సభాభవనములును నమోద ప్రమోద గృములును గలవు.

ఇంద్రపురియం దసంఖ్యాకములగు విమానములు తిరుగుచుండెను. కొన్ని క్రింద నిలిచి యుండెను. కొన్ని ఆకాశమున నెగురుచుండెను. వానినుండి నిరంతరము గాన, వాద్య, నృత్యములయొక్క సుమధుర ధ్వనులు వెలువడు చుండెను. వనములందును, ఉపవనములందును, విమానములందును, సరస్సులందును, గృహములందును, భవనములందును సర్వత్ర నశింపని యెన్నలేని సౌందర్యయుక్తులును, నవయౌవన మదమత్తలగు వత్యాప్స

సుందర రమణులు సుందర స్వచ్ఛ వస్త్రాలంకారములతో భూషి తలై స్వచ్ఛంద విహార మొనర్చుచుండిరి. వారు దేదీప్యమానమగు నగ్ని శిఖలవలెను, సాకార శోభవలెను, సజీవ సుందరలతవలెను, అమ్లాన చంపాకళికవలెను, యౌవనకాంతవలెను దోఁచుచుండెను.

అచ్చటి వాయువును రసికశేఖరుడేఁ సురసమ్మానిత సురాంగనల పైటలను దొలిగించి, వారికేశపాశములందు తుఱుము కొనిన సుగంధపుష్పముల నవీనమాలల మనోహర మోదమును దొంగలించుచు మార్గమందున్న వారితోఁ బరిహాసమాడుచుఁ బోవు చుండెను. ఆతని యీ యశిష్టతకు టీకాటిప్పణీ చేయువారెవరును లేరు. సురసుందరులందరును నాతని నుపేక్షించుచుండెను. క్రీడా భావమును బ్రదర్శించుచు మరలఁ దమయొక్క పూవులు తురుము బడిన కేశపాశములను దాచుకొనుచుండెను.

ఆ పురిని సౌగంధిక పురి యనిన నది యత్యుక్తి కాదు. ఏలయనఁగా నచ్చటి వస్తువులన్నియును సుగంధములు, పారిజాత పుష్పములు యోజనముల కొలఁది గంధము వ్యాపించి యుండెను. సుర లలనల ముఖముల నుండియు, అంగముల నుండియు, కేశ పాశముల నుండియు, వారి వస్త్రభూషణముల నుండియు నిరంత రము సుగంధము వెలువడుచుండెను. రాజపథములందు సుగంధ జలములు కలయంపి చల్లఁబడుచుండెను. భవనములనుండి వెలువడు సుగంధ ధూపము ఆకాశమందెగురుచు స్వర్గీయ పారావతములుగఁ దోఁచుచుండెను. విమాన వితానములన్నియును ముక్తాదామ మండి

తములై శుభ్రములుగను స్వచ్ఛములుగను నుండెను. వాని కేర్పఱుపఁబడిన ధ్వజములు సువర్ణజడితములై మఱి ముక్తామండితములై యుండెను. అనేక రంగుల చిత్రవిచిత్ర ధ్వజములతో నాపురి నవ వివాహిత వధువువలె నలంకరింపఁబడి నట్లుండెను.

ఆ యమపురీ భవనములందును, విమానవితానములందును గూర్చుండిన మయూర, కపోతాది పక్షులు కలరవ మొనర్చుచుండెను. స్థానస్థానములందు వికసించిన కుసుమముల మీఁద భ్రమర గణము గీతములు గానము చేయుచుండెను. అప్సరసల నూపురకర కంకణధ్వనులచేతను, ఛిద్రఘంటికల శబ్దములచేతను వారి కలకంఠ కూజితములచేతను దుందుభి స్వనమునచేతను నాపురి మాటలాడుచున్నట్లుండెను. తన ప్రజలు దర్శకులను స్వతః తనవైపున కాకర్షించుకొనుచుండెను. దేనిలోఁ బాపులెప్పుడును బ్రవేశింపఁజాలరో అధర్ములును, భూతద్రోహులును, దంభాహంకారులును, కాముకులును, లోభులును దేనిలోనికిఁ బ్రవేశించుట అసంభవమో అట్టి స్వర్గపురి నసురులు గురుకృపచే ముట్టడించిరి.

బలి గుర్వానుగ్రహముచే దైవీసంపత్తినిఁ బొందెను. ఇంద్రపురిని ముట్టడించి యాతఁడు శుక్రమత్తమగు శంఖమును బలము కొలఁది యూదఁగా దేవత లదరిపోయిరి. అప్సరసలు మూర్ఛితలై క్రిందఁబడిరి. ఇంద్రుఁడు మిక్కిలి భయభీతుఁడయ్యెను. క్షణము క్రిందట నేపురిలో నామోదప్రమోదములు సర్వత్ర జరుగుచుండెనో, యిప్పుడచ్చట సర్వత్ర హాహాకారములు వ్యాపించెను. అందఱును నసురుల ప్రయత్నమును గాంచి భయభీతులైరి.

శ్రీ శుకదేవుఁడిట్లనెను :- "రాజా! ఈ క్షయిష్ణువులును ననిత్యములునగు స్వర్గసుఖములందు శాంతియును లేదు. సుఖమును లేదు. త్రిలోకేశుఁడగు నింద్రుఁడు బలియొక్క శంఖధ్వనిని విని మిక్కిలి భయపడి, దేవతలను వెంటఁబెట్టుకొని తన కులగురువగు బృహస్పతి సమీపమునకుఁబోయెను.

....

## దేవగురుని సమ్మతితో సురలు స్వర్గమును త్యజించుట

శ్లో॥ ఏవం సుమంత్రితార్థాస్తే గురుణార్థానుదర్శినా।
హిత్వా త్రివిష్టపం జగ్ముర్గీర్వాణాః కామరూపిణః ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౫ అ. ౩౨ శ్లో

"రాజా! స్వార్థమర్మము నెఱింగిన దేవగురువగు బృహస్పతి వారికి సమ్మతి నొసంగఁగా దానినిమన్నించి దేవతా గణము దివమును వీడి వెడలిరి వారందఱును గామరూపములను ధరించువారై యుండిరి."

శ్రీమదాంధ్ర భాగవతము

ఉన్నతికి వెంట నవనతియు, జయము వెంటఁ బరాజయమును, జన్మవెంట మృత్యువునుఁ ఉత్థానమువెంటఁ బతనమును వచ్చుచునే యుండును. అజ్ఞానులీ దుఃఖములకు సంతప్తులై దుఃఖితులగుచుందురు, జ్ఞానులు రెంటియందును సమముగనుందురు. వారు భగవత్సేవాభావముతోఁ గర్తవ్య బుద్ధితోఁ గార్యముల నొనర్చుచుందురు. జయపరాజయముల రెంటియందును హరి యిచ్ఛను భావింతురు. వాస్తవమున నీక్షణభంగురములును, నాశవంత పదార్థములందును జయమేమి పరాజయమేమున్నది? గంగా ద్వారమున గంగా గర్భమందుండిన నసంఖ్యాకములగు చిన్నవి పెద్దవి గుండ్రాళ్ళతో, నున్నని రంగుల రంగుల రాళ్ళతోఁ బిల్లలాడుకొనుచుందురు. గంగా ప్రవాహమునఁ గొట్టుకొని వచ్చినఁ పాషాణ ఖండములను గొందఱు పిల్లలు తమవనుకొనుచు, వీనికొఱకు కొందఱు పోరాడుకొనుచుందురు, ఏడ్చుచుందురు. దుఃఖించుచుందురు, దెబ్బలాడుకొనుచుందురు, వాచ్య కువాచ్యములను బలుకుదురు కాని ఆట పూర్తికాఁగానే పిల్లలు వట్టిచేతులతోఁ దమ తమ గృహములకుఁబోవుదురు. పాషాణఖండము లచ్చటనే పడియుండును. మరల మఱునాఁడు బాలకులచ్చటనే మరల నాడుకొందురు. మరల నచ్చటనేను నాది నీవు నీది యను పోట్లాటయే. వర్షాకాలము రాఁగానే అన్నియును గంగాజలమందు మునిఁగిపోవును. బాలురిప్పుడు గంగా గర్భమునకుబోక యింటిలోనే ఆడుకొందురు. వర్షాకాలముపోయి మరల శరదృతువు రాఁగానే నీరు తగ్గిపోఁగా మరల రాళ్ళుమెఱయుటఁ బ్రారంభించును. అప్పుడు మరల నాట ప్రారంభమగును

తండ్రి ఆడియాడి పెద్దవాఁడు కాఁగానే పిల్లవాఁడాతును. ఆ పాషాణ ఖండములకును నంతములేదు, ఆ యాటకును నంతము లేదు. ఈ ప్రవాహ మనాదినుండి వచ్చుచున్నది. అత్యంతకాలము వఱకును నడచుచుండును. పెద్దవారైనవారు దీనినుండి విరమించెదరు. చిన్నవారు దానియందే యుందురు. దీనినే భగవన్మాయ యందురు. ఆ భగవానుఁడు కాలరూపమున వ్యాపించియున్నాఁడు. ఎవని కెప్పుడెట్టి కాలము వచ్చునో వాని కప్పుడట్టి అనుభవమగు చుండును. దీనిలో నెవరి బలపౌరుషములును బనిచేయఁజాలవు. అన్నియును ప్రభుని యిచ్ఛానుసారముగనే జరుగుచుండును.

శ్రీ శుకదేవుఁడు పరీక్షిన్మహారాజున కిట్లనెను :- "రాజా! అసురులు నలువైపులను నింద్రుని యమరావతీ పురిని ముట్టడించి మహాకోలాహలమును గావించిరి. అప్పుడు వారియొక్క ఉత్సాహ వర్ధక శబ్దములను వినఁగానే యింద్రునకు మిక్కిలి భయము కలిగెను. ఆతఁడు తన ముఖ్యముఖ్య దేవతలను వెంటఁబెట్టుకొని దేవగురువగు బృహస్పతి సమీపమునకుఁ బోయెను. అచ్చటికిఁబోయి అందరును విధ్యుక్తముగ గురుచరణములకు బ్రణామము కావించి వారియాజ్ఞచే నాసనముల మీఁదఁ గూర్చుండిరి. అప్పుడు దేవగురువగు బృహస్పతి యిట్లడిగెను :- "దేవరాజా! నేఁడు మీ ముఖము మలినముగ నున్నదేల? ఏ యధిక చింతచేఁ జింతితులై యున్నారు ?"

ఇదివిని వినీత భావముతోఁ నింద్రుఁ డిట్లనెను :- "ప్రభూ! మీరు వినలేదా? పురమునకు నలువైపులను జతురంగసేనా సహిత

ముగ రణరంగ దుర్మదులగు నసురులు కోలాహల మొనర్చు చున్నారు. వారి స్వరములో నుత్సాహము కన(బడుచున్నది. జయ ఘోషయందు విజయము నిశ్చయమై యున్నది.''

బృహస్పతి యిట్లనెను:-''అవును నేను వినుచునేయున్నాను. మీ పూర్వశత్రువగు బలి మరల మీమీ(ద దండెత్తినాఁడు."

ఇంద్రుఁ డిట్లనెను :- "దండెత్తుట యనునది క్రొత్త విష యము కాదు. తన పూర్వశత్రువును సదా పరాజితు నొనర్చుటకు ప్రయత్నించుటయే శత్రువు యొక్క కార్యము; కాని యీసారి యీ యసురుల కింతటి యుత్సాహమెట్లు వచ్చినదో యెఱుఁగఁ దలచుచున్నాను. వీరికిట్టి సహింపరాని తేజ మేకారణముచే వచ్చినది. ఎట్టి సిద్ధిని(బొంది యింతటి బలవంతులును ప్రతాపులు నైనారు ? బలితో మనమిదివఱకే పోరాడుచుంటిమికదా. ఈ మధ్యనే అమృత మును బంచునపుడు నేను నావజ్రముచే బలినిఁ గొట్టితిని; కాని శుక్రాచార్యులకృపచే నాతఁడు మరల జీవించినాఁడు. నేనింతవఱకు వీరి కింతటి యుత్సాహమును యుద్ధోత్సాహమును నేను జూడనే లేదు. నేడీ(ది ప్రజ్వలితాగ్నివలెను, సంవర్తక మేఘములవలెను, రుద్రుని మూఁడవ కన్నువలె సమస్త ప్రపంచమును సంహరింప నున్నట్లు వచ్చినారు.

దీపము మీఁద(బడిన కాగితమును నదియెట్లు తగుల(బెట్టునో అట్లే యిది జగత్తును బీల్చివేయు చున్నట్లు తన జిహ్వను జప్ప రించుచున్నట్లుండెను. నేను దూరమున నుండి కోపముచే నురుమ

బడి యెట్టిగానున్న బలియొక్క నేత్రములను జూచితిని. ఆతనిలోని దుస్సహదుర్ధర్ష తేజము దశదిశలను దగ్ధము చేసి యనమయమునఁ బ్రళయ మొనర్పఁబోవుచున్నట్లుండెను. ప్రభూ! బలికింతటి తేజమెట్లు ప్రాప్తించినది. ఆతఁడింతటి నిర్భయుఁడెట్లయ్యెను? వాని కే సాధనముచే నిట్టి ఓజోబల సాహసములు ప్రాప్తించినవి. నేఁడీతని యుద్యమమందు శక్త్యుత్సాహములున్నవి. కార్యమందు సజీవతకలదు. రోమరోమమునను విజయప్రాప్తికి దృఢత్వము కలదు.

బృహస్పతి యింద్రుని వచనములను విని గంభీరుఁడయ్యెను కొంచెము సేపు మౌనముగ నుండెను. అంతఁ గొంత ఆలోచించి మెల్లమెల్లఁగా నిట్లనెను :- "శచీపతీ! బలి యున్నతినిఁ జెందుటకు కారణము నాకు తెలిసినది. నీ వీతని నోడింపఁజాలవు."

ఇంద్రుఁ డాశ్చర్యమును నిరాశను జెందిన స్వరముతో నుత్సుకతాపూర్వకముగ నిట్లడిగెను :- "ఏల యేల ? నే నీతని నేల నోడింపఁజాలను. ఆతఁడు తప్పక విజయమును జెందుటకుఁ గారణమేమి ?"

దేవగురువదే గంభీరతతో నిట్లనెను :- "ఈ సమయమున నీతఁడు బ్రహ్మతేజ సమృద్ధుఁడై యున్నాఁడు. పరమ పరాక్రమవంతుడై నాఁడు. ఈతని శుక్రాచార్యుఁడు తన సజాతీయ బ్రాహ్మణులతోఁ గూడి ఈతనికి మహాతేజమును బ్రసాదించినారు. శిష్య

వత్సలుఁడగు భార్గవుఁడు తన సంపూర్ణమనోబలముతో వాని విజయము కొరకు విశ్వజిద్యాగము నొనర్చెను. ఈ కారణముచే నీతఁడిప్పు డపరాజితుఁడైనాఁడు."

ఇంద్రుఁడిట్లడిగెను :- "అయితే భగవాన్ ! ఈతని నిప్పుడెవరును జయింపజాలరా ?"

బృహస్పతి యిట్లనెను :- ......అవును. ఈ సమయమునకంతే. భగవానుఁడు సర్వజ్ఞుఁడు, సర్వసమర్థుఁడు. ఆతఁడేది కావలయుననిన దానినిఁ జేయఁగలఁడు. ఆతని కసంభవమనునది లేదు. ఆ హరి తప్ప యిప్పుడాతనిఁ గొట్టువాఁడెవఁడును లేఁడు. కాలమును దప్పించుకొనఁ గలవాడెవఁడును లేడు కదా !"

అంత నింద్రుఁడిట్లనెను :- "అయితే స్వామీ ! మనమేమి చేయవలయును ? శక్తికొలఁది యుద్ధము నొనర్చుఁడు. బృహస్పతి యిట్లనెను. "నాయనా ! నా యభిప్రాయమేమనఁగా నీ సమయమునఁదెలిసి తెలిసి కాలముఖమున దుముకుట ఉచితముకాదు. ఇప్పుడీతనితో యుద్ధమొనర్చుటవ్యర్థము. ఇప్పుడు మీరు స్వర్గమును వదలిపోవుటయే మంచిదని నా యభిప్రాయము. సమయానుసారముగ క్షేత్రమునువీడి పారిపోవుట అనుచితముకాదు. నేఁడీతనికి వృద్ధికిఁగాలము. ప్రపంచములో మానవులు బలవంతులుకారు. కాలమే బలవంతమైనది. ఇప్పుడీతనిని సుఖములను భోగింపనిండు మీరు

మీ యభ్యుదయ కాలము కొరకు ప్రతీక్షించుచుఁ బృథివిపై నేదో విధముగ దినములు గడుపు కొనుఁడు."

ఇంద్రుఁడిట్లనెను :- "అయితే స్వామీ! మేము శాశ్వతముగ స్వర్గసుఖములకు వంచితులము కావలసినదేనా ?"

తన మాటను సమర్థించుకొనుచు బృహస్పతి యిట్లనెను :- "ప్రపంచములో దేనికి నొకేస్థితి యుండదు. చక్రములోని యాకు లెట్లు పైకినిఁ గ్రిందకును దిరుగుచుండునో ఉన్నతియు నవనతియు దిరుగుచుండును. నేఁడాతని కభ్యుదయ సమయము ఎప్పుడో మీకును నట్టి సమయము రాఁగలదు."

ఇంద్రుఁడిట్లనెను :- "వీని కథఃపతన మెప్పుడు జరుగును స్వామీ!" బృహస్పతి యిట్లనెను. "వీరైశ్వర్యమదమత్తులై వీరి గురువు నెప్పుడవమానించెదరో ఆతనినిఁ దుచ్ఛునిగా భావించుచుఁ దామే కర్తలుగను, భర్తలు గను భావించెదరో వీరుపరివార సమేతముగఁ గుటుంబసమేతముగ మరల బాలాళ వివరములోనికిఁ బోయెదరు. ఈ సమయమున వీరితోఁ బోరాటము పనికిరాదు.

శ్రీ శుక దేవుఁడిట్లనెను :- "రాజా! ఇంద్రుఁడు చాల తెలివైనవాఁడు. ఆతఁడు తన గురుని సమ్మతినంగీకరించెను. గురువు తమకు హితమైన దానినే చెప్పుననియు, బలియగు శత్రువుతో వెంటనే యుద్ధమునకు దిగుట యుచితము కాదనియు, నీతితోఁబనిని

సాధింపవలయుననియుదలఁచి యాతఁడు దేవతలకు యుద్ధ మొనర్చు టకు సమ్మతింపలేదు. మీరందరును రోజులు మారి అభ్యుదయ కాలము వచ్చువరకును ప్రతీక్షించుచుండుఁడని చెప్పెను.

తన శిష్యులయొక్క యీ యభ్యుదయమును గాంచి శుక్రాచార్యుఁడు సంతసించెను. ఇంద్రాసనమున బలికూర్చుండుటను గాంచిన నాతని రోమములు నిక్కబొడిచెను. ఆతఁడు సంతోషమును ప్రకటించుచు బలితో నిట్లనెను :-"వత్సా! నేఁడు నీవు త్రైలోక్యాధిపతి పదవియందుఁ బ్రదష్ఠితుఁడగుటను గాంచి మిక్కిలి సంతసించుచున్నాను. నాహర్షమునకు మేరలేదు. నేను నిన్నభినందించుచున్నాను."

బలిచక్రవర్తి యిట్లనెను :-"గురుదేవా! ఇదంతయును మీ చరణముల ప్రతాపమే."

శుక్రాచార్యుఁడిట్లనెను :-"వత్సా! ఈ యింద్ర పదవి నీకు శాశ్వతమగునట్లు కోరుకొనుచున్నాను."

బలియిట్లనెను:-"గురుదేవుని యనుగ్రహమున్నచో ప్రపంచమున నసంభవ మేమియును లేదు. మీరన్నిటినిఁ జేయుటకును సమర్థులరు"

శుక్రాచార్యుఁడిట్లనెను :- "ఇదియే నేను గోరుచున్నాను. ఇంద్రుఁడెపుడునుఁ శాశ్వతుఁడు కాఁడు. ఎవరు నూరు యజ్ఞములు నొనర్చెదరో ఆతఁడే యింద్రుఁడగును, నీవింద్రాసనమును ని

బలపౌరుషముచేఁ బొందితివి, కాని యిది అస్థాయియైనదేఁ ఇది స్థాయియైనది కావలయునని మా కోరిక, నీవు మన్వంతరము పరకును నింద్రాసనమున నిదేవిధముగ నవస్థితుఁడవు కమ్ము."

బలియిట్లనెను :-"మీరు యాజ్ఞనొసంగిన దానినిఁ జేసెదను."

శుక్రాచార్యుఁడిట్లనెను :-"నా కోరిక నీ చేత నూరశ్వమేధ యాగములను జేయింపవలయుననియె, నేఁడే నీవు నూరశ్వమేధ యాగము లొనర్చుటకు దీక్షను బూనుము."

శ్రీ శుకదేవుఁడిట్లనెను :-"రాజా! తన గురువగు శుక్రాచార్యుని యీ యాజ్ఞను విని బలి అత్యంత ప్రసన్నుఁడయ్యెను. అతఁడు శుక్రాచార్యుని యాజ్ఞచే నూరశ్వమేధ యజ్ఞము లొనర్చుటకు దీక్షను బూనెను. శిష్యవత్సలుఁడగు శుక్రాచార్యుఁడు తనకు పరివారమగు బ్రాహ్మణులతోడుగాఁ గొని బలిచక్రవర్తిచే యజ్ఞములు చేయించెను. బలియును మిక్కిలి యుదారముగను, దాతగ నుండెను. అతఁడును నిష్టమువచ్చినట్లు ద్రవ్యమును వెచ్చించి, చాల వైభవముగ యజ్ఞము నొనర్చుచుండెను. నల్దిశలను నాతని యజ్ఞమును గూర్చిన ఖ్యాతి వ్యాపించెను. ఇచ్ఛానుసారముగ దానమును బొంది బ్రాహ్మణులును భిక్షుకులును నాతని కనేకాశీర్వచనము లొసంగిరి. త్రిలోకములందును నాతఁడు చంద్రుఁడు వెలిఁగినట్లు వెలిఁగెను. దశదిశలను నాతనికీర్తి వ్యాపించెను. త్రైలోక్యైశ్వర్యమును బొంది ఆతఁడు తాను గృతకృత్యుఁడ ననుకొనుచుండెను.

..........

# పుత్రపరాభవముచే నదితి దుఃఖము

శ్లో॥ ఏవం పుత్రేషు నష్టేషు దేవమాతా దితి స్తదా।
హృతే త్రివిష్టపే దైత్యైః పర్యతప్య దనాథవత్ ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౩ అ. ౧ శ్లో॥

సీ॥ తన తనూజులఁ బోలు దనుజులు గొనుటయు
వేల్పు లెల్లను డాఁగ వడలుటయును
భావించి సురమాత పరితాపమునఁ బొంది
వగ న నాథా కృతి వనరుచుండ.

శ్రీమదాంధ్ర భాగవతము

ఈ కుతూహల పూర్ణమగు ప్రపంచమున భగవానుడెన్నో యద్భుతాద్భుత వస్తువుల నొనర్చినాఁడు. ఈ ప్రాణి నాటకమును, తన యొక్కయు, నితరుల యొక్కయు ఖేలనములను జూచుట కుత్సహించుచుండును, కాని ధ్యాన పూర్వకముగఁ జూచినచోఁ ప్రపంచములోని సమస్త వస్తువులును, సమస్త సంఘటనలును నొక మహాకుతూహలమునకు సంబంధించిన వస్తువులు, అతి సూక్ష్మమైన వట బీజమునుండి యెంతో మహావృక్షము వచ్చును. ఆ యావ గింజంత బీజములో నింతటి గొప్పవృక్షమెచ్చట నిమిడియున్నది ? దానిని బగులఁగొట్టి చూచిన దానిలో వృక్షము కనఁబడనే కనఁ బడదు. కాని సత్యమేమనఁగా దానిలో వృక్షమిమిడియున్నది. రణో

వీర్యముల రూపముననున్న రెండు జలబిందువులనుండి యింతటి గొప్పబలముగల దేహమెట్లయినది ? ఇవన్నియును గల్పనాతీత విష యములు. వీని నన్నిటిని మానవుఁడాలోచించి చూచినచో వానికి బాహ్యనాటకమును జూడవలసిన ఆవశ్యకముండదు. ఇంకొక చోటునకుఁ బోవలసిన పనియునులేదు. ఆతఁడెచ్చటఁ గూర్చుండిన నచ్చట వానికొకదానికంటె నొకటి అద్భుత వస్తువులు గోచరించు చుండును.

ప్రపంచములో నసంఖ్యాకములగు నద్భుతవస్తువులందొక పరమాద్భుత వస్తువు మాతృహృదయము. బ్రహ్మ మాతృ హృద యము నే ధాతువుల సమ్మిశ్రణమున నొనర్చినాఁడో దాని నింత వరకెవఁడును నెఱుఁగజాలకుండిరి. ముందు ముందెఱుఁగుటకును సంభవముకాదు, దానిలో రక్తమాంసాదులుకాక నేదో విచిత్ర వస్తువు కూడ కలదు. తన సంతానము కొరకు తల్లియేమిచేయునో, ఆమెకు తన సంతానము నెడల నెంతటి మమత్వము కలదో దాని యను భవమును దల్లి తప్ప యింకెవరును నెఱుఁగఁజాలరు. ఆమె తన సంతానము యొక్క మంగళకామన కొరకు ఉచితానుచితములగు సమస్త కార్యములు నొనర్చుటకుద్యుక్తురాలగును. సంతానమున కన్నము పెట్టుటలో నున్న సంతోషము తాను తినుటలోఁ దల్లి కుండదు. తన సంతానము సుఖిగా నుండవలయుననియే సదా ఆమె రోమరోమములనుండి భావము వెలువడుచుండును. కామవాసనా పూర్తియే జీవితమున కేకైక లక్ష్యము కలదియును, కామ తృప్తి కొరకు విభిధోపాయములచే గర్భాశయమును దీసివైచుకొను వారును,

లేక వికృత మొనర్చుకొనువారును, కామజన్య సంతానమును హత్య చేయుటలో వెనుకాడనివారును, నగు రాక్షస స్త్రీల సంగతిని వదలి వేయుఁడు, కానున్నఁ దల్లులు సంతానము కొరకెంతగాఁ బరితపించుదురో, వారిని సాకుటకై యెంతటి క్లేశముల ననుభవించెదరో, వారికి యస్వస్థత కలిగినప్పుడెన్ని భూత, ప్రేత, పిశాచములను పూజించెదరో, యంత్రమంత్ర, తంత్రాదులను గట్టించెదరో, ఇంతెందులకు దేవదేవతల కొరకు వారి సమ్ముఖమునఁ బశువులను గూడ బలి నిచ్చుచుందురు. ఏ ప్రాణములను బలితీసి తమ సంతానమును రక్షించుకొనఁదలఁచుచున్నారో అవి యన్నియు నింకొక తల్లికి సంతానములను సంగతిని మరచిపోయెదరు. వీనికిని దల్లికలదు. ఇవి చచ్చిన మనకువలెనే వీని తల్లులును దుఃఖమును జెందెదరను జ్ఞానమేఁ యుండదు. కాని వారికి తమ సంతానమును గూర్చియే చింత. ఒక కథకలదు. ఒకానొక పాఠశాలలోఁ జాలమంది పిల్లలు పఠించుచుండిరి. దానిలో గొప్ప గొప్ప ధనికులు, గులీనులు విద్వాంసులు, శ్రేష్ఠులు సాహుకారులకు సంబంధించిన పిల్లలుకలరు వారిలో నొక వృద్ధ విధవయొక్క పిల్లవాడును జదువుచుండెను. ఆతఁడు బీదవాఁడగుటచే నాతని వస్త్రములు సదా మలినములై కన్నులలోను, ముక్కులలోను, శరీరమందును మురికి చేరియుండుటచే నీగలు కూడ ముసురుచుండును. ఆతని శరీర ఛాయయును బాగుండదు. ముఖమున స్ఫోటకపు మచ్చలు, స్ఫోటకముచే నొక కన్ను కాయకాచినది. ఒక దినము నధ్యాపకుఁడు నాల్గు లడ్డుల నాతని తల్లికి నొసంగెను. ఆ ముసలిది ఆ లడ్డును దన కుమారున కొసంగి యిట్లనెను :- " నాకు వీనిని మించిన సుందరుఁడును .

ప్రియమైనవాఁడును నీ పిల్లలలో నింకొకఁడు కనఁబడుటలేదు.” ఈ మమకారమే మాతృహృదయమునఁ గల విశేషము ఇద్దెవరి సంతాన మైనను సరియే తన సంతానము సుఖముగ నుండవలయు నను కొనుచ తల్లికి హృదయ పూర్వకమగు నిచ్ఛయిదియేయుండును తాను దుఃఖపడియైనను తల్లి తన సంతానమును సుఖపెట్టఁజూచు చుండును. ఒక ప్రాచీనమగు కథ కలదు ఒక పుత్రుని విషయములో నిద్దరు స్త్రీలకు తగాదా వచ్చెను. వాస్తవముగ నా పిల్లవాని తల్లి అనాథ. రెండవ స్త్రీ ఆమెను హీనముగఁ జూచుచుండెను. ఆమెను బుత్రహీనముగఁ జేయజూచుచుండెను. ఆమె రాజు కడ పుత్రుఁడు తనవాఁడని అభియోగమును వైచెను. న్యాయాధీశుఁడిద్దరినిఁ బిలి పించి యిద్దరినడిగెను. రెండు వైపులను సాక్ష్యముకలదు. కొంద రీమె పుత్రుఁడనిరి. కొందఱామె పుత్రుఁడనిరి. న్యాయాధీశుఁడందర సమ్ముఖమున నాస్త్రీలతో నిట్లనెను :-“ఈ పిల్లవాఁడెవరివాఁడో మీ మాటలవలన నిర్ణయింపఁ జాలకున్నాను. ఇద్దరకును నధికారము కలదని తోఁచుచున్నది. చివరకు నేనీతీర్పునకు వచ్చినాను. ఈ పిల్ల వానిని రెండు భాగములుచేసి యిద్దరకును జెరియొక భాగము నిప్పిం చెదను. ఇది వినఁగానే యథార్థమగు తల్లి యిట్లు మొత్తుకొనెను :- “నా పిల్లవాఁడుకాఁడు వీఁడు. వీనిని జీల్చకుఁడు ఆమెకే యొసం గుఁడు. నేనుసత్యవంతురాలను. “న్యాయాధీశుఁడు చీల్చఁదలచలేదు. ఆతఁడు మాతృ హృదయమ్మును గుర్తింపఁ దలఁచెను. పిల్లవాఁని నసలు తల్లికే యిప్పించి రెండవయామెను శిక్షించెను. ఇంతకు చెప్ప వలసిన దేమనఁగా బుత్రుని మంగళ కామనకై తల్లి యేమైనను జేయును.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! బృహస్పతి ఆజ్ఞచే దేవతలు స్వర్గమును వదలిపారిపోఁగా నసురేంద్రుఁడగు బలి త్రిలోకేశుఁడయ్యెను. అప్పుడు దేవతలు పృథివిపై వివిధ వేషములను ధరించి దుఃఖముతో దినములను గడుపుకొనుచుండిరి. ఒకానొకప్పుడు దేవతలు స్వర్గసుఖముల ననుభవించి యిప్పుడు కాలము విపరీతమగుటచే సాధారణప్రాణులవలె నటునిటుఁ దిరుగుచుండిరి. దీనివలన దేవతలకు దుఃఖముకలుగుటయేకాక దేవతలకు తల్లియగు నదితికి అత్యంతదుఃఖము కలిగెను. ఆమెకాకలిఁ నిద్రలు లేకుండెను. సదా తనపుత్రుల పరాభవమునకు దుఃఖితయై కన్నులనీరు గార్చుచుండెడిది. సంతానముయొక్క పరాజయమునకు ఆమెదుఃఖమునకు మేలలేకుండెను. "అయ్యో నాబిడ్డలు సదా సుఖోపభోగములొనర్చినవారు పృథివిమీఁద నెచ్చట మారువేషమునఁ దిరుగుచున్నారో? వారికిప్పుడు యజ్ఞభాగములు లభించియుండవు. కులీనవంశములోనివారు మరెవరినీ వెంటనే అడుగఁజాలరు. చిన్నపనియుఁ బెద్దపనియుఁ బదప్రతిష్ఠకు వ్యతిరేకముగ నడుగుకొనఁజాలరు. నేనెచ్చటికిఁ బోవుదును. ఎట్లుచేయుదును? ఏయుపాయముచే నాపిల్లలు సుఖపడెదరు? ఏ జప, తప, తంత్ర, మంత్ర, యజ్ఞానుష్ఠానములొనర్చుటచే నాపిల్లలకు శ్రీవృద్ధికలుగఁగలదు?" అని దేవతల మాతయగు నదితి రాత్రింబవళ్ళిదే యాలోచించుచుండును.

ఆమె సుమేరువునందు సుందరోపత్యక యందొంటరిగ నివసించుచుండెను. ఆమె పతియగు గశ్యప ప్రజాపతి తపంబొనర్చుటకై యేకాంతముగ వనమునకుఁబోయెను అతఁడు చాలకాలము

సమాధిస్థుడై యాసర్వాత్మయగు ప్రభువు నారాధించుచుండెను. అప్పుడప్పుడాతనికి సమాధి భంగమైనపు డాతఁ డదితి సమీపమునకు వచ్చి, ఆమెకుశలమునడిగి, ఆవశ్యకవస్తువులను సేకరించి పెట్టి మరలఁ దపస్సునకు వెళ్ళుచుండెడివాఁడు.

ఇప్పుడు సమాధి భంగము కాఁగానేకశ్యపుఁ డదితి ఆశ్రమునకువచ్చి చూడఁగా నాయాశ్రమమునకు నలువైపులను నొక విషాదపూర్ణమగు వాతావరణము వ్యాపించియుండెను. ఆయాశ్రమము నిరుత్సవముగను, నిరానందముగను దోఁచుచుండెను. అచ్చటివృక్షములు వాడినట్లుండెను. స్వచ్ఛతనామమాత్రమైనలేదు. అదితి మలిన ముఖియై, విచారముతో నుత్సాహహీనముగ నెట్లోదినములు గడుపుచుండెను.

తనపతిదేవుఁడగు గశ్యపభగవానుఁడు వచ్చుటను గాంచి అదితి మోకరించి, చేతులు జోడించుకొని మిక్కిలి కష్టముతో విషాదామభవమును జెందుచు లేచి, కృత్రిమ నవ్వును నవ్వి ఆమె పతికి స్వాగత మొనంగెను. పాద్యార్ఘ్యాసనాదుల నొసంగి ఆమె సత్కారపూర్వకముగ బతినిఁ గూర్చుండఁబెట్టి, ప్రణామమొనరించి దీనవదనయై, దుఃఖితయై అదితి అతని సమీపమునఁ దలవంచుకొని కూర్చుండెను.

ఆమెయొక్క యీస్థితిని, నవశతనుగాంచి కశ్యపుఁడు తన ప్రాణప్రియయగు పత్నితోఁ ప్రేమపూర్వకముగ స్నేహభరిత వాక్కులతో నిట్లనెను :- "ప్రియా! అందఱును గుశలముగ నున్నారా? చెప్పుము."

"స్వామీ! కుశలమే" అని విషాదస్వరమున నదితియనెను. మమకారమును బ్రదర్శించుచుఁగశ్యపుఁడిట్లనెను :- "నీవేల నిట్లు. న్నావు ? నీదుఃఖకారణమును నాకు జెప్పుము, నీవులోకమాతవు లోకమందేమైనను దుర్ఘటనము జరిగినదా ? బ్రాహ్మణులు సుఖముగ నున్నారా ? మర్త్యధర్మముగల నీభూలోకమునగల బ్రాణులంద రకును మంగళప్రదముగ నున్నదా ?"

అదితి విషణ్ణవదనయై యిట్లనెను :- "స్వామీ ! అంతయును బాగుగనే యున్నది. ప్రపంచములో నంతటను శాంతిగనే యున్నది.''

కశ్యపుఁడిట్లనెను :- "నీగృహస్థ ధర్మములో నేవిధమగు వ్యాఘాతమునులేదు కదా ! నీయొక్క ధర్మార్థకామ సంబంధము లందే లోపమును లేవుకదా ?"

అదితి తలవంచుకొని యిట్లనెను :- "అదియును నన్నియును మీకృపవలన జక్కఁగ జరుగుచున్నవి."

కశ్యపుఁడు తనమాట మీఁద బలమునొనంగుచునిట్లనెను :- "అయితే నీదుఃఖమునకుఁ గారణమును జెప్పుము. ఒక్క విషయ మిదియును గలదు. గృహస్థునియింటికి భోజన సమయమున నాశతో నెవఁడైన నతిథి వచ్చినచో, వానికి వివిధములగు స్వాగత సత్కారములు జరుగకున్నచో నాగృహస్థునకు తపస్తేజములు నశించును. పొరపాటునసైనను నిట్టి యపరాధము నీవలన జరుగ

లేదు కదా! ఎప్పుడైనను నీవు గృహస్థుకార్యములందు మగ్నురాలవై యున్నపుడు, ఏగృహస్థుఁడైనను వచ్చిన నతనికి ప్రత్యుత్థానాదులు చేయక, పాద్యార్ఘ్యాదు లొనర్చి ఆతనినిఁ బూజింపకుండిన నాతఁడు నిరాశుఁడై నీవద్దకు వచ్చిన దాని మూలముననీవు దుఃఖితవై యుంటివా? అది యిట్లు జరిగియుండినచో నది అత్యంత చింతా కలితమైనవిషయమే గృహస్థాశ్రమమందు నిత్యమును నూతన పాపములు జరుగుచుండును. గృహస్థాశ్రమము చింతాగృహము. దీనిలో సర్వశ్రేష్ఠమైన దొక్కటియే కలదు. అది వచ్చిన అతిథులకు స్వాగత సత్కార మొనర్చుట. అతిథులు నిరాశులై వెడలిన గృహము గబ్బిలములకొంపయే. కాకులగూడె. నీవలన నిట్టిది జరిగి యుండదు."

అదితి యులికిపడి ఆగి యాగి చెప్పుటకారంభించెను :- "లేదు స్వామీ! త్రిలోకములచేఁ బూజింపఁబడు మీవంటి సర్వజ్ఞుఁడగు ప్రజాపతి భార్యవిషయములో నిట్టి యపరాధము జరిగి యుండదు."

అంత గశ్యపమహాముని యిట్లనెను :- తేజోహీనమునకుఁ గారణ మిదియునై యుండవచ్చును. మనమగ్నిహోత్రము లొనర్చు గృహస్థులము. నిత్యనియమమున నగ్నిపూజ మొనర్చుట మనకు ధర్మము. పతి లేని సమయమునఁ బత్నియే అగ్నిలో హోమ మొనర్చును. నేను లేకున్నసమయమున నెప్పుడైన నీవు ఉద్విగ్నమానసవై హోమమును జేయకుంటివేమో? ఏలయనఁగా బ్రాహ్మణుడు, వహ్నియు విష్ణుముఖములుగఁ జెప్పుదురు."

అదితి యిట్లనెను :- "లేదు స్వామీ! నేను మీరు లేని సమయమందు రెండువేళలందును హోమకాల మందగ్నిలో హవన మొనర్చు చుంటిని."

కశ్యపుఁడిట్లనెను :- "అట్లైనచో నీవు దుఃఖితవగుటకు నాకు కారణ మగుపడుటలేదు. నీవు చెప్పవేమి? నీపుత్రు లేకాద కాదిత్యులందరును గుశలముగ నున్నారా?"

ఇది విని అదితి యేమియును జెప్పక, మెదలక తలవంచు కొని కూర్చుండి కన్నులు నీరు నించుచు నాంతరంగిక వేదనను వ్యక్త మొనర్చుచుండెను. ఆమె తన నఖములతో నేలనుగీరుచుండెను. చింతాసాగరములో మునిఁగియుండెను. పతియొక్క యీ ప్రశ్నను వినఁగానే ఆమె హృదయములోని దుఃఖము నీరునీరై కన్నులద్వారా వెలువడు చుండెను.

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- రాజా! కశ్యపుఁడు మాటి మాటి కిని దన పత్నిని దుఃఖకారణము నడుగగాఁ నామె ధైర్యమును వహించి తన ప్రాణనాథునితోఁ దన దుఃఖకారణమును జెప్పుటకుఁ బ్రారంభించెను.

......

# అదితికి కశ్యపుని యుపదేశము

శ్లో॥ ఉపతిష్ఠస్వ పురుషం భగవంతం జనార్దనమ్
సర్వభూత గుహావాశం వాసుదేవం జగద్గురమ్ ।
సవిధాస్యతితే కామాన్హరిర్దీ నాను కంపిం
అమోఘా భగవద్భక్తిర్నేతరేతి మతిర్మమ ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౬ అ. ౨౦, ౨౩ శ్లో॥

మ॥ భగవంతుం బరముం జనార్దనుఁ గృపాపారీణు సర్వాత్మకున్
జగదీశున్ హరి సేవ సేయు మతఁడున్ సాంగత్యముం
బొంది నీ
కగు నిష్టార్థములెల్ల నిచ్చు నిఖిలార్థావాప్తి సేకూరెడిన్
భగవత్సేవలఁబొందరాదె బహుసౌభాగ్యంబులం బ్రేయసీ ॥

శ్రీమదాంధ్రభాగవతము

భగవంతుని యొక్క మోహినీ మాయ చాలఅసాధ్యమైనది. గొప్పగొప్ప జ్ఞానులును, ధ్యానులునుదీనిలోఁబడి తమ కర్తవ్యమును మరచిపోవుచుందురు. ప్రపంచమునెడల వైరాగ్యమునుజెంది, శ్రీహరినేచూడవలయును, మనస్సులోనేవిధమగు సాంసారిక కోరిక లుద్భవింప రాదను కొనుట సర్వోత్తమ విషయము. అట్లుకాక యేదైన దుఃఖము కానిండు, ధనము విషయమునఁగష్టము కానిండు,

ఇం కేవిధమగు జిజ్ఞాసయైనను గానిండు దానిని వృత్తికొరకు సాధారణ జనముల నాశ్రయింపక భగవంతుని శరణు వేఁడినచో, ప్రభువు వలననే తన దుఃఖములను నివారించుకొనుటకు ప్రయత్నించినచో వారును కృతిపురుషులే. సాధారణులకంటె వారుచ్చకోటిలోనివారే. ఏలయనఁగా భగవద్భక్తి అమోఘమైనది.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! కశ్యపప్రజాపతి తన పత్నియగు నదితిని దన విపత్తు విషయమై యడుఁగగా నామె మెల్ల మెల్లగా వేదనాస్వరమున దన పతితో నిట్లనెను :- స్వామీ! నాకు లోకములం దెచ్చటను నకల్యాణముకనబడుటలేదు. నేను యథాశక్తిగ ధర్మపాలన మొనర్చుచున్నాను. అతిథులను, అగ్నిని, దేవతలను, పూజ్యులను యథాశక్తిగ సేవించుచున్నాను. మీవంటి ప్రజాపతి పతులు నాకు సర్వదా ధర్మోపదేశమొనర్చుచుండ నా మనోరథము పూర్తిగాక యెట్లుండఁ గలదు ? నాకు వేరుగ నేకారణము వలనను గ్లేశము లేదు నాకు నాసంతానమును గూర్చియే దుఃఖము. నేను నాపుత్రుల పరాభవము కారణమున వ్యథితనై యున్నాను.

శ్రీ కశ్యపుఁడిట్లనెను :- "నీ పుత్రుల కే సంకటము వచ్చి పడినది ?"

అదితి యిట్లనెను :- "మీరు సమాధిలోనుంటిరి. మీకు ప్రపంచస్పృహయే లేదు. అంత నాకు పుత్రులగు నింద్రాదులను నాసవతియగు దితి పుత్రులు స్వర్గమునుండి నెడల నడిపిరి. ఇప్పు డసురగణ మమరపురి సుఖముల ననుభవించుచున్నారు. నాపుత్రులగు దేవతలు పృథివిపై మారు వేసములఁ దిరుగు చున్నారు."

కశ్యపుఁడు సరళతాస్వరమున నిట్లనెను :- ''ఏమియును ఫరవాలేదు. స్వర్గమున నుండిన నేమి ? పృథివిపైనుండిన నేమి ? ఇందులో భేద మే ము న్న ది. సర్వ త్ర సుఖదుఃఖములుండియే యుండును. పైఁగాదైత్యులును నాకు పుత్రులే. అన్నదమ్ములలో నెవరు సర్వసుఖములను భోగించిననేమి ? ఇందు దుఃఖింపవలసిన అవసరమేమున్నది ?"

అదితి దీనతాస్వరమున నిట్లనెను :- "స్వామీ ! మీకేమి దుఃఖము లేదు. సత్త్వ, రజ, స్తమోగుణాత్మకమగు నీసృష్టియంత యును మీవలన నుత్పన్నమైనదే. మీకెవరును బరాయివారులేరు. అందఱును మీకు సంతానమే. కాని నేను స్త్రీని. నాకట్టి విశాలబుద్ధి యెట్లు రాగలదు ? నాకు స్వపరభేదము కలదు. వీరు నాపుత్రులను భేదము కలదు. వీరు నాపుత్రులు, వీరు నాసవతి పుత్రులను భేద బుద్ధి నా మనస్సులోఁ బ్రవేశించి యున్నది. మీరు సమభావమును వహించుట యుచితమే కాని ప్రభూ ! నేనట్లొనర్చుట కసమర్థు రాలను. పుత్రునియెడల మీరు పక్షపాతమును వహింపకున్నను నా యెడల మాత్రము పక్షపాతము వహింపవలసి యుండును."

నవ్వి కశ్యపుఁ డిట్లనెను :- "నీయెడల నేల పక్షపాతము వహింపవలయును ?"

తనమాట మీద నిలువఁబడుచుఁ నదితి యిట్లనెను :- "ఏల యనఁగా నేను మీకు భక్తురాలను, మీయందనురక్తను మీకుదాసిని. చరణసేవకురాలను కల్పవృక్షము సమదర్శియైనను, దాసికి

భేదభావము లేకున్నను, నది దానినాశ్రయించినవారి, దాని ఛాయను గూర్చుండినవారి మనోరథములను బూర్తికావించును. నేను మీ చరణముల నాశ్రయించితిని. ఆశ్రితుల కోరికలను మహేశ్వరుఁడు నెఱవేర్చును."

కశ్యపుఁడు ప్రేమతో నిట్లనెను :- "నావలన నీవు కోరిన దేమియో నాకు ముందు చెప్పుము."

అదితి యిట్లనెను:- "నేను మీకృపను గాంక్షించుచున్నాను. మీరు నన్ననుగ్రహింపవలయును. శత్రువుల వలన శ్రీహీనులైన నాసుతులను రక్షింపుఁడు. వారి నేదో విధమున స్వర్గమునఁ బ్రతిష్ఠింపుఁడు. ప్రబల పరాక్రమవంతులగు నసురులు నా పుత్రుల యైశ్వర్యమును, ధనమును, యశమును, పదవిని నపహరించిరి. వారి నసురుల నుండి లాగుకొని మరల నా పుత్రుల కిప్పింపుడు. శోక సాగరమున నిమగ్నమైయున్న నబలనగు నన్నుఁ గరావలంబన మొనర్చి యుద్ధరింపుఁడు. దుఃఖితయు, దీనయు, నిరాశ్రితయు నగు నా కాశ్రయప్రదాన మొనర్పుఁడు. మా సంపత్తిని దైత్యులనుండి తీసికొని మరల మాకిప్పింపుఁడు. కృపాళూ! అశరణశరణా! భక్తవత్సలా! భగవాన్! నా మనోరథము పూర్తియగు వ్యర్థము కాని యత్నము చొనర్పుఁడు. నే నీ దుఃఖము నుండి బయటపడి సుఖిని కావలయును."

శ్రీ శుకుఁ డిట్లనెను :- "రాజా ! ఈ విధముగఁ బలికి అదితి మెదలకుండెను. మిక్కిలి ఆశాభరితదృష్టులతోఁ దన పతివైపు చూడసాగెను. ఆ సమయమునఁ గశ్యపుఁడు గంభీరుఁడయ్యెను. ఆతని సమ్ముఖమున సాంసారిక మహామోహినీ మాయ మూర్తీభ వించి నిలుచున్నట్లుండెను. ఆతఁడిట్లను కొనెను :- "భగవానుని మాయ యెంతటి విచిత్రమైనది ! క్షణకాల సాంగత్యమున నీతఁడు నా పుత్రుఁడు. ఈతఁడు నా సోదరుఁడు, ఈమె నాపత్ని, ఈతఁడు నా స్నేహితుఁడు, ఈతఁడు సంబంధి, ఈతఁడు శత్రువు, ఈతఁడు మిత్రుఁడనుచు ననుకొనుచుందురు. వాస్తవమున మిత్రుఁడెవఁడు శత్రుఁ డెవఁడు ? పాంథులు సత్రములోఁ జేరినట్లే అందరును జేరుదురు. ఎండలోఁ బ్రయాణ మొనర్చుచు వృక్షచ్ఛాయను గూర్చుండినప్పుడు, పరిచయమైనట్లు, మంచి, చెడ్డమాటలు వచ్చి నట్లుండును. క్షణములో నెండ తగ్గిపోగానే యెవరిత్రోవ వారిదే. అనంత జన్మలలో మనకెందఱు తల్లులు, భార్యలు, తోబుట్టువులు, పుత్రులు, తండ్రులు, సోదరులైరో తెలియదు. ఈ ప్రవాహమనాది అయినను జీవి మమత్వమును వహించును. అందఱు నేదో సంబం ధమున బంధింపబడియున్నారు. నానారూపములలోఁ గనఁబడుచున్న సర్వాత్మయగు ప్రభువునకీ పదార్థములతో సంబంధమెక్కడిది!"

కశ్యపుఁ డిట్లనుకొనునంతలో మరల నదితి దీన వాక్కులతో నిట్లనెను :- "ప్రభూ ! అయితే నేనేమి యాశింతును? నా పుత్రులిట్లు తిరుగుచుండవలసినదేనా ?"

కశ్యపుఁడిట్లనెను :-"ప్రియా ! నీవింతటి విదుషీమణివయ్యు నిట్టి పొరపాటు మాటలు పలుకుచుంటివేల ? ప్రపంచములో నెవ రెవరికి పుత్రులు, ఎవరెవరికి పతి ? ఇదంతయును మోహజనిత సంబంధము. భగవత్పూజన మొనర్పుము. దీనానుకంపియగు భగవంతుఁడు సమస్తమును మేలుచేయఁగలఁడు."

అదితి దుఃఖితమనస్కయై యిట్లనెను:-"స్వామీ! ఈ సమయమున నాకేమియును దోఁచుటలేదు. హృదయమునఁ గోరికయుండుటచే కింకర్తవ్య విమూఢనైతిని."

కశ్యపుఁ డిట్లనెను :-"శ్రీహరి వాంఛాకల్పతరువు. ఆతఁడు సమస్తకోరికలను నెఱవేర్చువాఁడు. ఆతని చరణఛాయ యందుండిన సమస్త కోరికలు నెఱవేరితీరును. ఇంకొకరికి భక్తి యొనర్చినచో దాని ఫలము విపరీతము కావచ్చును. కాని భగవానుని భక్తి అమోఘము, అది యెన్నటికిని వ్యర్థముకాదు. నీవు కోరికతోనైనను సరియే సర్వాత్ముఁడగు శ్రీహరి నుపాసింపుము. ఆతని శరణు జొచ్చినచో నిశ్చయముగ నీ మనోరథము నెరవేరగలదు."

అదితి యిట్లనెను :-"అయితే స్వామీ ! భగవదారాధనమెట్లు చేయవలయునో నాకుఁ జెప్పుఁడు. నియత సమయము వరకు జేయుటచే నభీష్టసిద్ధికలుగు నేదైన వ్రత, నియ మనుష్ఠానమును జెప్పుడు. మనోభిలాష పూర్తి కావలయును."

అంతఁ గశ్యపుఁ డిట్లనెను :-"భగవద్భక్తి యెట్లొనర్చినను మంగళ ప్రదమైనదే, కాని యేదైన కోరికతో భక్తియొనర్చినచో,

నియమపూర్వకముగ, విధివిధానముగఁ జేయవలయును. నీవు పయోవ్రతము నొనర్చుచో నీ కోరిక అవశ్యము నెరవేరును. ప్రభువు న్వయముగఁ బ్రకటమై నిన్నాశీర్వదించును.''

ఉత్సాహముతో నదితి యిట్లనెను :-''స్వామీ! ఆ పయోవ్రతమును జేయుటెట్లు? నాకా యుపాసనమును విధ్యుక్తముగ విస్తారముగ నుపదేశింప వలయును. ఈ సమయమున నేను నా పుత్రుల కొరకత్యంత దుఃఖితనై యున్నాను. నేనీ దుఃఖసాగరమునుండి శీఘ్రముగఁ బయట బడు నుపాయమును జెప్పుఁడు.''

అంత గశ్యపుఁ డిట్లనెను:-''ప్రియా! హృదయమున గోరిక లుత్పన్నము కాకుండుటయే సర్వశ్రేష్ఠము. ఒకవేళ యుత్పన్నమైనచో భగవత్ప్రార్థన మొనర్పవలయును. పూర్వకాలమున నా మనస్సు నందును ప్రజాపతి కావలయునను కోరిక కలిగినది అప్పుడీ వ్రతమొనర్చుఁగా నది నెరవేరినది.''

ఇప్పుడదితి ముఖమున నాశారేఖలు కనఁబడెను. ఆమె మిక్కిలి యుత్సాహముతో నిట్లనెను :- స్వామీ! ఇది మీయనుభూత వ్రతమన్నమాట. మీరే కోరికతో నీవ్రతము నొనర్చితిరి? మీకీ వ్రతము నెవరు చెప్పిరి?

అంత గశ్యపుఁ డిట్లనెను :-''సృష్ట్యారంభమున భగవత్ప్రేరణముచేఁ బ్రజా కామన నామనస్సులో నుత్పన్నమైనది. ఆ సమయమున లోక పితామహుఁడగు బ్రహ్మ నాకీ వ్రతము నుపదేశించి నాఁడు. దీని నొనర్చుటచే నా కోరిక నెరవేరినది.''

అదితి పిల్లలవలె నత్యంతోత్సుకతో నిట్లనెను :- "అయితే స్వామీ! ఆ వ్రతమును నాకవశ్య ముపదేశింపుఁడు ఇప్పుడే యుపదేశింపుఁడు."

శ్రీ శుకదేవుఁ డిట్లనెను :-"రాజా! అదితి యుత్సాహమును గాంచి కశ్యపుఁ డావ్రతము నుపదేశించెను."

.....

## పయోవ్రత విధి

శ్లో॥ ఫాల్గునస్యామలే పక్షే ద్వాదశాహ పయోవ్రతః!
అర్చయే దరవిందాక్షం భక్త్యా పరమయాన్వితః।
శ్రీభాగ. ౮ స్కం. ౧౬ అ. ౨౫ శ్లో॥

వ. అనిసఁ గశ్యపప్రజాపతి సతికిఁ బయోభక్షణంబను వ్రతంబుపదేశించి తత్కాలంబును తన్మంత్రంబును దద్విధానంబును దదుపవాసదానభోజన ప్రకారంబులును నెఱింగించిన నదితియును ఫాల్గుణమాసంబున శుక్లపక్షంబునఁ బ్రథమదివసంబుననే దొరఁకొని పండ్రెండు దినంబులు హరిసమర్పణంబుగా వ్రతంబు సేసెను.

—శ్రీమదాంధ్ర భాగవతము

విధివిధానమునఁ జేయఁబడిన వ్రతము కోరిన కోర్కెలను బ్రాప్తింపఁజేయును. విధిహీనముగ నేపనినైనఁ జేసినచో దానికి సిద్ధి

లేదు. అదివిపరీతఫలము నొసంగునది యగును. గోధుమపిండి, చక్కెర, నేయియుండిన, వానిని విధ్యుక్తముగఁ దగినపాళ్ళతో యథోచిత రీతిని వస్తువులు నొనర్చుచో, వానితో హలువా, జిలేబి, మాల్పువా మొదలగు రుచిగల వస్తువులు తయారగును. వానిఁ దినుట చేఁజిత్తము ప్రసన్నమగును. మనస్సు తుష్టినిఁజెందును శరీరము పుష్టినిఁ జెందును. ఆఁకలి తీరును. ఈ వస్తువులను విధిప్రకారము చేయకున్నను, పిండిపచ్చిగానున్నను చేయునపుడు మాడినను, నీరుకలుపుటలో నెక్కువ తక్కువలైనను, ఇంక నితర లోపములు జరిగినను వస్తువులు చెడిపోవును. కాని వాని యందంతటి మంచిరుచిపుట్టదు. చిత్తముప్రసన్నము కాదు. పొట్టలోనికిఁ బోయి వికారమును గలిగించును. దానివలన నానారోగములు పుట్టవచ్చును.

శ్రీశుకదేవుఁ డిట్లనెను :-"రాజా! దేవమాతయగు నదితి తన సర్వసమర్థుఁడగు పతి కశ్యపుని ప్రయోవ్రత విధిని గూర్చి యడుగఁగా వాతఁడిట్లనెను :-''ప్రియా! నేను నీకు పయోవ్రత విధిని గూర్చి చెప్పెదను. దానిని నీవు శ్రద్ధగా వినవలయును. విధి విధానమందు గడబిడ నొనర్పకుము. ఈ వ్రతము పంద్రెండు దినములు జరుగవలెను. ఫాల్గుణ శుద్ధపాడ్యమినాఁడు దీని నారంభించెదరు. ముందు రోజున నసఁగా మాఘ బహుళ అమావాస్యనాఁడు పవిత్రవై వ్రతదీక్షను గ్రహింపవలయును. దీనిలోఁ బంద్రెండు దినములు కేవలము పాలనే పుచ్చుకొనవలయునుఁ పాలను దప్ప యింకొకటి గ్రహింపరాదు. విధివిధానము ననుసరించి భగవదారాధనము జరుగవలెను.

అదితి యిట్లడిగెను :-"అయితే స్వామీ ! అమావాస్యనాఁడు చేయవలసినదేమో చెప్పుఁడు."

కశ్యపుఁ డిట్లనెను :-"ఆ దినమునఁ బ్రాతఃకాలమున లేచి దొరికినచో నరణ్యమునుండి అడవి పంది త్రవ్విన మట్టిని తేవల యును. అది దొరకక పోయినచో గోశాలలోనిదికాని, గంగలోనిది కాని, తీర్థమందలిదికాని, తులసిలోనిదికాని, గురు బ్రాహ్మణుల పాద ముల క్రిందదిగాని మృత్తికను గ్రహింప వలయును. కాకున్న నదికిఁ గాని, చెఱువునకుఁగాని బావికి గాని పోయి స్నానమొనర్చుచు శరీర మంతను మృత్తికతో నలఁదవలయును. అప్పుడీ మంత్రమును బఠింపవలయును-

శ్లో॥ త్వం దేవ్యా వరాహేణ రసాయాః స్నానమిచ్ఛతా
ఉద్ధృతాసి నమస్తుభ్యం పాప్మానం మే ప్రణాశయః॥

ఓ దేవీ ! ప్రాణులందఱును నివసించుటకై ఆదివరాహమూర్తి నిన్ను రసాతలమునుండి యుద్ధరించినాఁడు నీవు నా పాపములను నాశన మొనర్పుము. నీకు నమస్కారము.

మృత్తిక నలఁదుకొని విధి పూర్వకముగ స్నానమొనర్ప వలయును. స్నానమొనర్చి, తన నిత్యకార్యములను నెరవేర్చుకొని, భగవత్పూజన మొనర్పవలయును.

అదితి యిట్లనెను :- "భగవానుని పూజనము దేనిమీఁదఁ జేయవలయును. భగవంతుఁడు సర్వవ్యాపకుఁడు కదా !"

కశ్యపుఁ డిట్లనెను :- "ఇది నీ యిచ్ఛ ననుసరించియుండును. భావనముపైన నాధారపడియున్నది. ఎవనికెచ్చట శ్రద్ధకలదో దాని యందు భగవద్బుద్ధితో భగవత్పూజన మొనర్పవలయును. భగవంతుని అర్చావిగ్రహము కలదు. ఆతని మూర్తిత్వము కలదు. దానియందు పూజింపవచ్చును. కానున్న నొక్కవేది నొనర్చి దాని యందు బూజింపవచ్చును. సూర్యుని యందీశ్వర బుద్ధినుంచి చేయవచ్చును. జలమందుగాని, అగ్నియందుగాని తన గురుదేవునకుఁగాని షోడశోపచారములతోఁ బూజింపవలయును. ముందుగాఁబౌరాణిక మంత్రములనుబఠించి భగవానునాహ్వానించి పాద్యార్ఘ్యాచమనము లొసంగవలయును. దుగ్ధముతో భగవంతునకు స్నానమొనర్పవలయును. తరువాత శుద్ధజలముతో స్నానమొనరింపఁ జేసి వస్త్ర యజ్ఞోపవీతముల ధరింపఁ జేయవలయును. తరువాత గంధ, ధూప, దీప, పుష్ప, తులసీ, మాలా, దుర్వా, బిల్వాదుల నర్పింపవలయును. ప్రతి వస్తువును నర్పించునపుడు ద్వాదశాక్షర మంత్రమును బఠింపవలయును. పూజనంతను నీమూలమంత్రము తోడనే చేయవలయును. పాలలో వరిబియ్యమును వైచి క్షీరాన్నమును దయారుచేసికొని, దానిలో నేయి, చక్కెరలను వేయవలయును. చక్కెరలేకున్న బెల్లమును వేయవలయును. దానిని ద్వాదశాక్షర మంత్రముతో నగ్నిలో హోమమొనర్పవలయును. మిగిలిన క్షీరాన్నమును యథాశక్తిగ బ్రాహ్మణులకు భోజనమిడవలెను. హోమమునకుఁ బూర్వమా క్షీరాన్నము చేతనే భగవంతునకు నివేదన మొనర్పవలయును. నివేదనము కావించి, ఆగమనమొనర్చి ఫలార్పణ మొనర్పవలయును. మరల ఆచమన మొనర్చి తాంబూల పూగీ

ఫల దక్షిణలను సమర్పింపవలయును. ద్వాదశాక్షర మంత్రమును గంట సేపు జపింపవలయును. మంచి మంచి స్తోత్రముల ద్వారా భగవంతుని స్తుతింపవలయును భూమి మీదఁ బడి సాష్టాంగ ప్రణామము కావింపవలయును. స్త్రీలు పంచాంగ సమస్కారమునే చేయవలెను. భగవానుని చందన ప్రసాదములు మస్తకమున ధరింపవలయును. చరణామృత తీర్థమును గైకొనవలయును. పుష్పమాలను శిరస్సున ధరింపవలయును. తదనంతరము విధిపూర్వకముగ విసర్జన మొనర్పవలయును.

బ్రాహ్మణభోజనమిడి, వారికి విధ్యుక్తముగ సత్కారము కావించి వ్రతసమాప్తిని గావించి, మిగిలిన నైవేద్యమును స్వయముగ గ్రహింపవలెను. భగవంతుని స్మరించుచు రాత్రియందు నిద్రింపవలెను. ఈవ్రతమునకు పూర్వదినమునవచ్చు నమావాస్య కృత్యము ముగిసినది.

మఱునాఁడు ప్రాతఃకాలమున లేవవలయును, అంత నిత్య నియమము ననుసరించి కాలకృత్యములను బూర్తిగావించుకొని, విధ్యుక్తముగ భగవానునిబూజింప వలయును; హవన మొనరింప వలయును; బ్రాహ్మణులకు భోజనమిడవలయును. భగవంతునకు నివేదన మిడి కేవలము పాలనేత్రాగి యుండవలెను. ఈ విధముగఁ బండ్రెండు దినముల వరకు నిత్యము కేవలము పాలనే త్రాగుచు, హోమ, పూజన, బ్రాహ్మణభోజన మొనర్పవలయును. పాడ్యమి మొదలు త్రయోదశివరకు నియమముతో నుండవలయును. బ్రహ్మ

చర్య వ్రతమును సావధానముగ( భావింపవలయును. అంతట విధ్యుక్తముగ వ్రతోద్యాపనము గావింపవలయును. ఉద్యాపన సమయమున విత్తశాఠ్య మొనర్పరాదు. తనశక్తి ననుసరించి వైభవముగ మహోత్సాహ పూర్వకముగ మహోత్సవ మొనర్పవలయును. ప్రతిదినమును గానవాద్యము లుండవలయును, నృత్య మొనర్పవలయును. కథా కీర్తనాదులుండవలెను. వచ్చిన అతిథులకు భక్తి పూర్వకముగ నీశ్వర బుద్ధితో స్వాగత సత్కారము లొనర్పవలయును.

కశ్యపు(డదితితోనిట్లనెను:- "దేవీ ! ఈవ్రతమునకే పయోవ్రతమని పేరు. నాకీ యుపదేశమును పితామహు(డగు బ్రహ్మ చేసినా(డు. నీవీవ్రతమును మిక్కిలి శ్రద్ధాభక్తులతో విధివిధాన పూర్వకముగ శ్రీహరినొక్కనినే చింతించుచో నవశ్యము నీయిష్టవస్తువును బ్రాప్తింప(గలవు. నీవు భగవంతుని(గాంక్షించినను నీవాతని( బొందగలవు. ఈవ్రతము వలన భగవంతు(డు శీఘ్రముగ సంతుష్టు(డు కాగ(లడు. దీనికి సర్వవ్రతమను బేరును గలదు. కొందరు దీనిని సర్వయజ్ఞమనియు నందురు. ఇది తపస్సులకు సారము. విష్ణుభగవానుని వశపరచుకొనుటకు సర్వోత్తమ, మందర, సరళ సర్వశ్రేష్ఠమగు సాధనము. ఇట్లు వ్రతములనేకములు కలవు. కాయమునకు( గ్లేశమును గలిగించు కఠినాతి కఠినవ్రతములు కలవు; కాని నిజముగ విచారించిచూచినచో దీనిని జేయుటచే వాసుదేవ భగవాను(డు ప్రసన్ను(డగునో అదియే నిజమగు వ్రతము. భగవత్ప్రీత్యర్థము జేయబడిన దానమే నిజమగు దానము. ప్రభుప్రస

న్నత కొరకు చేయబడిన నియమము యథార్థనియమము. దేనిచేఁ దపోమూర్తియగు ప్రభువు ప్రసన్నుఁడగునో అదియే వాస్తవిక తపము. నీవు శ్రద్ధా, సంయమ సదాచార సరళతా పూర్వకముగ నీ వ్రతాచరణము నొనర్పుము. ని కోరిక నెరవేరును. భగవానుఁడు నీమీఁద బ్రసన్నుఁడగును. నీకేది కావలయునో దానినడుగుము. భగవానుఁడు సర్వసమర్థుఁడు. ఆతనికడనాశ్రితుల కీయరానిదేది యును లేదు."

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా! తనపతి యొసంగిన శిక్షణమును విని అదితి మిక్కిలి శ్రద్ధతో నీవ్రతము నొనర్చుట కుద్యుక్తురాలయ్యెను.

.....

## పయోవ్రతముచేఁ బ్రసన్నుఁడై ప్రభువు ప్రత్యక్షమగుట

శ్లో॥ తస్యాః ప్రాదుర భూత్తాత భగవానాది పూరుషః।
పీతవాసాశ్చతుర్బాహుః శంఖచక్రగదాధరః॥
తం నేత్ర గోచరం వీక్ష్య సహసోత్థాయసాదరమ్।
ననామ భువి కాయేన దండవత్ప్రీతి విహ్వలా॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౭ అ. ౪౫ శ్లో॥

చతుర్బాహుండును, పీతవాసుండును, శంఖచక్రగదా ధరుండునునై నేత్రంబుల కగోచరుండై ననారాయణ దేవుండు ప్రత్యక్షంబై నంగనుంగాని

క॥ కన్నుల సంతోషాశ్రులు
చన్నులపై బఱవఁబులక జాలము లెసఁగన్
సన్నతులును సన్నుతులును
నున్నతరుచిఁజేసి నిటల యుక్తాంజలియై ॥

శ్రీమదాంధ్ర భాగవతము

ప్రేమపాశమతి ప్రబలమైనది. ప్రభువు దానికి కట్టుబడి వశబడిపోవును. అపరాజితుఁడగు ప్రభువును తనభక్తిచే భక్తుఁడే పరాజితు నొనర్పగలడు. సర్వతంత్రస్వతంత్రుఁడగు సర్వేశ్వరుని భగవద్భక్తుఁడేవశ మొనర్చుకొనఁగలఁడు. ప్రభువు ప్రేమచేతనే జయింపఁబడఁగలఁడు. ఆతడు భక్తకల్పద్రుమమాఁశాలత కాఘనశ్యాముఁడే అమృతవృష్టి నొనర్చు సజల శ్యామఘనము. ప్రేమతోఁ బిలువఁబడిన పిలుపెన్నటికిని వ్యర్థముకాఁజాలదు. స్నేహముతో నొనర్పఁబడిన నాహ్వానము సదా సఫలమగును. కావున నాశ్రీకృష్ణుని చరణకమలములకు కోరికతోనైనను నాశ్రయింపవలయును.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! దేవమాతయగు నదితి తనపతియగు గశ్యపమహాముని ముఖమునఁ బయోవ్రత ప్రశంసను విని పరమ ప్రసన్నుఁడయ్యెను. మాఘబహుళ అమావాస్య రాగానే ఆమె సర్వవ్రతస్వరూపమును సర్వయజ్ఞసారమునగు నీ మహా

వ్రతము నారంభము కావించెను. ఇదివైష్ణవ వ్రతము. నిత్యమును విధివిధానముతో విష్ణువు నారాధించుటయే దీని ముఖ్యోద్దేశము. శ్రద్ధానహితముగ బూజింపఁబడిన ప్రభువు సమస్త మనోరథములను బూరికావించును. ఈ భావముతో నామె యీ వ్రత దీక్షను గొనినది. ఆమె మిక్కిలి జాగ్రత్తగా వ్రతమునకు సంబంధించిన సమస్త నియమములను బాలించుచుండెను.

వ్రతసమాప్తి కాఁగానే ఆమె ఒక దినమునఁ దన సమ్ముఖమునఁ బీతాంబర ధారియును, వనమాలియునగు భగవానుడు ప్రత్యక్షముగ నిలిచి మందహాస మొనర్చుటకాంచెను. ఆతనికి సుందరములును, విశాలములునగు నాలుగు భుజములుండెను. వానిలో శంఖచక్రగదా పద్మములు విరాజిల్లుచుండెను. భక్తానుగ్రహదీక్షా పరతంత్రుఁడును నాదిపురుషుఁడును, నచ్యుతుఁడునగు భగవంతుఁడకస్మాత్తుగ నదితి సమ్ముఖమున నావిర్భవింపగా నామె వెంటనే యులికిపడెను. ఆనందాతిరేక కారణమున నామె కింకర్తవ్య విమూఢ యయ్యెను. ఏదో యంత్రమామెను లేవఁదీసినట్లు యేసంకల్పము లేకయే శీఘ్రముగ లేచి, ప్రేమ విహ్వలయై తదేక దృష్టితో నా త్రైలోక్యవందిత అనవద్య సౌందర్యసుధను తెప్పలార్పక పాన మొనర్చుచుండెను. అత్యంత పిపాసతో నంతను బాన మొనర్పదలఁచినదా యనునట్లాతని రూపమును జూచుచుండెను, ఇంతలోనామెకు స్మరణము కలిగెను "నేను నా ఇష్టదైవమును మనన మొనర్పలేదు. నా ప్రభువు పాదపద్మములకు ముందుగా ప్రణామ మొనర్పవలయును" అను విచారము రాఁగానే ప్రేమ విహ్వలయై పృథివిపై

దండమువలెఁబడెను. ప్రేమ భరిత హృదయముతో నామె ప్రభు పాదపద్మముల సమీపమున లంబాయమానమై యుండెను. స్త్రీలకు సాష్టాంగ ప్రణామమొనర్చుట నిషేధమను విషయము నామె మరచెను. ఆమె పయోధరములు భూమికి తాఁకుట నిషేధింపఁబడినది. ప్రేమలో నియమమెక్కడిది? ఆవేశములో స్మృతి యుండదు ఆత్మ విస్మృతి విహ్వలతకు చిహ్నము.

కొంతకాలము నేలమీఁదఁబడిన మీఁదటఁ దన జీవన సర్వస్వమును, ప్రాణధనమును నిలుచున్నాఁడనియును, దాను బడి యుండెననియు, నాతఁడు విచ్చేసినప్పుడు స్తుతియొనర్ప వలయుననియు, జ్ఞాపకమునకు వచ్చెను. వినయ వచనములు పలికి ఆతనికి స్వాగతమిడవలయును. ఈ విచారము రాఁగానే ఆమె రెండు చేతుల తోడను నంజలిని బంధించెను. కన్నులనుండి నిరంతర మశ్రుప్రవాహము ప్రవహించుచుండెను. అత్యంతోల్లాసమున హృదయ ముత్సహించుచుండెను, శరీరమంతయును రోమాంచ పరిపూర్ణమగుచుండెను, కాని వాక్కు రుద్ధమయ్యెను. స్తుతియొనర్ప జూచుచుండెను, కాని వాక్కు వచ్చుటలేదు. కంఠము రుద్ధమయ్యెను. తన ప్రయాస మనఫలమగుట వలన నామెకు సిగ్గువైచెను. ఆమె తలవంచుకొని ప్రభు సమ్ముఖమున మూగదానివలెఁ బలుకక, కదలక మెదలక అట్లే నిలుచుండెను. మరల తాను సంబాళించుకొని, ధైర్యమునాశ్రయించి, కన్నులను దెరచెను. నేత్రముల శ్యామసుందర సౌందర్యమునందు లీనమయ్యెను. చైతన్యమునుండి జడమువలె నయ్యెను. ఆమె నిమేషోన్మేష వ్యాపార రహిత యయ్యెను. చిరకాలమునుండియును

దృషితములైన నయనములతో నాతని సౌందర్యపానము నొనర్చు చున్నట్లుండెను. ఉత్కంఠయొక్క పరాకాష్ఠను జెందినట్లుండెను. అయినను మెల్లమెల్లఁగాఁ జిత్తమును స్థిర మొనర్చుకొని మంద మంద స్వరమున నామె విశ్వంభరుని వినతిచేయ నారంభించెను. అదితి యిట్లనెను :-"యజ్ఞేశ్వరా! అచ్యుత! యజ్ఞస్వరూపా! పవిత్ర పాదా! పవిత్రకీర్తిశాలీ! శ్రవణ మంగళనామా! శరణాగత దుఃఖ భంజనా! ఆర్తత్రాణ పరాయణా! ఆదిపురుషా! దీననాథా! సర్వ సమర్థా! పరాత్పరప్రభూ! విశ్వోత్పత్తి స్థితిలయ కారణా! పర మాత్మా స్వేచ్ఛచే నానాశక్తులను స్వీకరించు భూమా! అనంతా! అచ్చుతా! అజ్ఞానంధకారమునకు సూర్య స్వరూపా! నీ యొక్క పరమపావన పూజనీయ పాదపద్మములకు పునః పునఃప్రణా మములు. నీవు మాకు కల్యాణ మొనర్చుము. మేము కోరినవరముల నొసంగుము. మా మనోరథమును బూర్తి కావింపుము.

నీవు ప్రసన్నుఁడవైనచో నాతని కేవస్తువు దుర్లభమైన దుండును. నిన్ను దీర్ఘాయువును గోరినచో బ్రహ్మాయువువరకును వారికాయుస్సు నొసంగెదవు. వారుసుందర శరీరమును గోరుచోఁ గామదేవునివంటి సుందర దేహము నొసంగెదవు. వారైశ్వర్యమును గోరుచోఁ బ్రపంచమందలి సమస్తైశ్వర్యమును బొందగలరు. వారాధి పత్యమును గోరుకొనినచో బృథివి, పాతాళము, స్వర్గాది భువన సామ్రాజ్యము నీయఁగలవు. సిద్ధులు కావలయునను నభిలాష యున్నచో నీయనుగ్రహముండిన నసంఖ్యాకములగు మూర్తిమంత ములగు సిద్ధులు చేతులు జోడించుకొని సమ్ముఖమున నిలుచుండఁ

గలవు. వారికి త్రివర్గేచ్ఛ యున్నచో ధర్మార్థకామములను మీరు ప్రసాదింపఁగలరు. మోక్షేచ్ఛ యున్నచో వారికి సాధన స్వరూపమగు జ్ఞానమును నీవు వారి హృదయప్రదేశము లందుద్భవింపఁజేయుదువు. ఆశ్రితులకు మీరన్నిటినిఁ బ్రసాదించుచున్నప్పుడు నా కోరిక అతితుచ్ఛమైనది. చెప్పుటకుగూడ నాకు సిగ్గగుచున్నది. ఇది చక్రవర్తినిఁ బ్రసన్ననిఁ గావించుకొని, గుప్పెడుగడ్డినడిగినట్లున్నది. నేను గేవలము నాశత్రువుపైన విజయమును బొందఁగోరుచున్నాను. స్వర్గభ్రష్టులైన నాసుతులు మరల స్వర్గమునందు ప్రతిష్ఠింపఁబడవలయును. కాని చేయునది యేమున్నది? కోరిక హృదయమున నుదయించినప్పుడు మానవునకదితప్ప వేరొకటి అక్కర యుండదు. ఆఁకలి కొన్నవానికి మంచిచందనమునలఁదుము. అత్యుత్తమమగు పుష్పమాలను మెడలోవేయుము మెత్తమెత్తనిపరుపులందుఁ బరుండబెట్టుము. సురసుందరుల కోకిల కూజిత కమనీయకంఠములతో సుందరసుఖద సంగీతమును వినిపింపఁజేయుము. ఈ సుఖప్రదవస్తువులన్నియును నాతనికా సమయమున సుఖప్రదముగ నుండవుసరిగదా దుఃఖదములుగనుండును. ఆసమయమున వానికి భోజనము కావలయును. పిపాసితునకు పేయము కావలయును. అదేవిధముగ నేఁడు నేను మోక్షమును గోరను. సర్వజ్ఞుఁడవును సర్వాత్ముఁడవునగు నిన్నుఁ బ్రసన్నునిఁ గావించుకొనియు నేఁడు నేను గేవలము అసురుల పరాభవమును నా కన్నులతోఁ జూడఁగోరుచున్నాను. ఇదియే నాకత్యంతోత్కటమగు నభిలాష."

అదితి యొక్క యిట్టి వినమ్ర వచనములను విని సర్వాంతర్యామియును, సర్వజ్ఞుఁడును, సచ్చిదానందుఁడునగు భగవాను డిట్ల-

నెను :- "దేవమాతా! నేను నీమనోగత భావముల నిదివరకే యెఱుగుదును. నీవు అసురుల పదచ్యుతిని, శ్రీహీనమును గాంచఁ గోరు విషయము నాకు తెలియక పోలేదు. అసురులను స్వర్గమునుండి పాఱఁద్రోలి సురలను నందు మరలఁ బ్రతిష్ఠితులఁగావింప సముత్సుకతను వహించుచున్నావని నాకుఁదెలియును. నీచిత్తము నేఁడు పరహింసాగ్నిచే మండిపోవుచున్నది."

ఇదివిని అదితి కొంచెముగ లజ్జితయై క్రిందఁజూచుచుండెను. అంతభగవానుఁడు మేఘగంభీర స్వరమున నిట్లనెను :- "దేవీ! నేఁడు నీకొడుకులు పతివిహీనలై శృంగార మొనర్చుకొనక, జడ వైచుకొనక యెట్లేడ్చు చుండిరో నీ శత్రువుల భార్యలు నట్లే యుండుటను గాంచఁ గోరుచున్నావు. యుద్ధములో మరణించిన నసుర స్త్రీలు వైధవ్య దుఃఖమున దుఃఖించుటను గాంచవలయునని యువ్విళ్లూరు చున్నావు. నీవుకోల్పోయిన యశస్సును, నైశ్వర్యమును, పదప్రతిష్ఠను, మరల సంపాదింపఁ జేసి నీపుత్రులను సుఖసమృద్ధిశాలురుగఁజేయఁ జూచుచున్నావు. ఆయానందమును సంతోషముతోఁ గాంచఁ దలఁచుచున్నావు. కాని నేనేమి చేయగలను! రెండువైపులను సంకటముకలదు. బ్రాహ్మణ భక్తిని నేనేయిచ్చితిని. వారును నాస్వరూపులే. నీశత్రువులు నారెండవ స్వరూపమగు గురురూపము నారాధించుచున్నారు, నీవును నన్నారాధించుచున్నావు. కావున వారి పరాభవమును గతినమే. నీమనోరథమును పూర్ణ

మొనర్పక పోవుటయును ననుచితమే. అయినను నాయుపాసనము వ్యర్థము కాఁగూడదు. కావున నేనన్యమగు నుపాయము నాలో చింతును. నేనుమధ్యలోఁ బడిపోయి యున్నాను.

అదితి దీనతతో నిట్లనెను :- "కాదు, స్వామీ ! నాకోరికను నీవు తీర్చితీరవలసియుండును, నాకేకైకాశ్రయము నీవే, నీవేగతి."

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా ! అదితియొక్క యీ వచనములను విని శ్రీహరి యింకొక యుపాయమును గూర్చి ఆలోచించుచుండెను.

.....

## అచ్యుతుఁడదితికి పుత్రుఁడగునట్లు వరమొసంగుట

శ్లో॥ త్వయార్చితశ్చాహమపత్య గుప్తయే
పయోవ్రతే నానుగుణం సమీడితః॥
స్వాంశేన పుత్రత్వముపేత్య తే సురాన్,
గోప్తాస్మి మారీచతపస్య ధిష్ఠితః॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౭ అ. ౧౮ శ్లో॥

శా॥ నీకోడంద్రును నీకుమారవరులున్ నీనాథుఁడున్ నీవు సం
శ్లోకింపన్ సతులుం బతుల్ మిగుల నమ్మోదింప
రాత్రించరుల్
శోకింపన్ భవదీయ గర్భమునఁ దేజోమూర్తి జన్మించెదన్
నాకున్ వేడుక పుట్టు నీసుతుఁడనై నర్తించి వర్తింపగాన్

శ్రీమదాంధ్ర భాగవతము

ఇద్దరు భక్తులొకే వస్తువును గావలయునని కోరుకొనినయెడల స్వామి స్థితిశోచనీయముగ నుండును. ఇద్దరును దనకు కావలసిన వారే ఇద్దరిలో నెవరినిఁ ద్యాగము చేయ జాలడు ఇద్దరకును నా వస్తువు కావలయుననియే పట్టుదల ఇట్టిస్థితిలో స్వామి చిన్నవాఁడు కావలసి వచ్చును. ఆతఁడు దీనతతో సబల పక్షమునఁ జెప్పును. వారిని వదలుఁడు. నేను నిన్ను భిక్షమడుగుచున్నాను. నాకు నీ వొసంగుము.'' శత్రువున కొసంగుటలో నవమానము కలదు. లఘుత్వము కలదు. కాని స్వామియే యాచించి నపుడు వానికిచ్చుటలో గౌరవము కలదు. ప్రతిష్ఠకలదు. పెద్దలు పెద్దవారే. ఆతఁ డాజ్ఞాపించుచు వదలుకొనుమని చెప్పవచ్చును, లేక నమ్రమతతో యాచింపవచ్చును. ఇట్టి స్థితిలో స్వామి రెండు పక్షములను సంతుష్టి పరచవలయును. క్రమముగ నిద్దరకును నా వస్తువు ననుభవించుట కవకాశ మొసంగును.

శ్రీశుక దేవుఁడిట్లనెను :-"రాజా ! అదితి మాటిమాటికిని భగ వంతుని తన పుత్రులకు స్వర్గము నిప్పింపుఁడని ప్రార్థనమొనర్పఁగా

భగవంతుఁడిట్లనెను :-"దేవీ ! దుష్టుఁడై యన్యాయమువలను జేయు చుండినచో నేను దండింపఁగలను. పదభ్రష్టునొనర్పఁగలను. బలి చక్రవర్తి నా భక్తుఁడు. గురుసేవాపరాయణుఁడు యజ్ఞముల ద్వారా నన్నుఁబూజించుచున్నాఁడు. ఆతనితో నేను యుద్ధమునుఁ జేయఁ జాలను. చంపఁజాలను. బలవంతముగ స్వర్గమునుండి వెడల నడుపఁ జాలను. నేనాతని కడ చిన్నవాఁడనుగావలయును. తగ్గనిది, పని జరుగదు."

అదితి యిట్లనెను :-"ప్రభూ ! నీవు చిన్నవాఁడవుకమ్ము, పెద్దవాఁడవుకమ్ము. నీవు నాకోరిక నెట్లైనను నెరవేర్పవలయును. నీవు చిన్నవాఁడవైనను బెద్దవాఁడవుగనే యుందువు. నీపెద్దతనమున కేవిధమగు త్రుటియును రాఁజాలదు."

భగవానుఁడిట్లనెను – 'దేవీ ! నాకీ ధర్మసంకటము పట్టు కొనినది. నీవును నా భక్తురాలవు. బలియును నాయందనురక్తుడు, కావున నేను దేవతల కంటెను జిన్నవాఁడను గావలసి వచ్చినది. దైత్యుల కంటెను జిన్నవాఁడను గావలసి వచ్చును. అతడందఱు గుడ్డలుదకవలయును. అందువలన నేను దేవతలకు తమ్ముఁడను గావలసియున్నది. ఇప్పటికి నీకు పదునొకండుగురు పుత్రులు కలరు. పండ్రెండవ వాఁడనగు నేనును నీకుఁబుత్రుఁడ నయ్యెదను. నేను నాయంశచే నీపతి యగు గశ్యప ప్రజాపతి వీర్యమందుండి నీగర్భమునఁ బుట్టెదను. ఈ విధముగా నాయన్నలకు సేవచేయుట నా కర్తవ్యము కాఁగలదు. వేరొక వంక నేను దైత్యులకంటెఁ దగిన

వాడను గావలయును. ప్రపంచములో నందఱకును దేలిక భిక్షుకుఁడు, అందరును దృణము తేలికని పలుకుచుందురు. కాని దృణము కంటెను తేలికైనవాఁడు భిక్షుకుడు. వీఁడు తన్నుగూడ అడుగునని వాయువును వీవదు. తనవైపును జేయి చాచకుండ జూచుకొనును. దేవీ! చేయి చాచినవాఁడు జీవితుఁడనుకొనుము, మృతతుల్యుఁడే. అందరికంటెను హీనుడు. కావున దైత్యులకడ నేను భిక్షుకుఁడనై పనిని నెఱవేర్చుకొందును. ఈ విధముగ నీ విషమ గ్రంధి నూడఁవేసెదను."

అదితి ఆశ్చర్య చకితయై యిట్లనెను :- స్వామీ! నీవు త్రిలోక్య నాథుడవు. నా గర్భములోనికెట్లు రాగలవు? నీవు భాగ్యవంతులగు మహిళలపైఁ గృపనుజూపి భక్తవత్సలతచే నప్పుడప్పుడు లీలతో నజన్ముఁడవయ్యు వారి గర్భమున నవతరించెద వని వినియున్నాను. నేనెంతటి యోగ్యురాలను గాను: కాని నీవు నాపైఁ గృపఁ జూపదలచుచున్నావు. నేనేమి చేయవలయునో నాకాజ్ఞాపింపుము."

భగవానుఁడిట్లనెను:- "దేవీ! నీవు సర్వసమర్థుఁడగు నీవతియందిట్లు విరాజమానుఁడనై యున్నానని తెలిసికొనుము. ఆతని నీశ్వరబుద్ధితో నారాధించుము. భగవద్భావముతో నాతని బూజింపుము. ఆతని రూపమందు నిరంతరము నన్నే చింతింపుము. నీకు మేలు కలుగఁ గలదు. కాని ఒక్క విషయము మనసునందుంచుకొన వలయును."

అదితి యిట్లనెను:- "అదియేమి స్వామీ;"

భగవానుఁడిట్లనెను:- "నేను నీకు దర్శనమొసంగి, యీవిధమగు వర మొసంగితిని. ఈ విషయమును పొరపాటున నైన నెవరికినిఁ జెప్పరాదు."

అదితి సతర్కయై యిట్లనెను:- "స్వామీ! నన్నెవరైన నడిగిననో ?"

భగవానుఁ డిట్లనెను:- "ఎవరైన నడిగినను జెప్పరాదు. అది యిది చెప్పి తప్పించుకొనవలయును."

అదితి యిట్లనెను:- "ఏల స్వామీ! ఇందులో దోషమే మున్నది? నిజము చెప్పిన నేమి హాని యుండును?"

భగవానుఁ డిట్లనెను :- "హాని యేమియును లేదు. సాంసారిక విషయములను జెప్పిన బాధలేదు. కాని యీ భగవద్దర్శన విషయముల నెంతగా దాచిన నంత యుత్తమము. దేవతలను బరోక్ష ప్రియులుందురు. కావున దేవతా కార్యముల నన్నిటిని గోపనీయముగ నుంచుట చేతనే బాగుగా సిద్ధించును."

అంత శౌనకుఁడిట్లడిగెను:- "సూతా! భగవానుఁడు అదితి నేల వలదనినాఁడు, మనకు భగవద్దర్శనమైనదని పదుగురతో జెప్పిన వారికిని నుత్సాహము కలిగి, ప్రచారమైన నుత్తమమే కదా! దాఁచిన నేమి లాభము?"

అంత గంభీరుఁడై సూతుఁ డిట్లనెను ;- "మునివరులారా! మీరు కస్తూరి నెంతగా దాఁచినను దాఁగదు. అదే విధముగఁ బాప పుణ్యముల నెంతగా దాఁచినను నేదో యొక దినమున నవశ్యము ప్రకటమై తీరును. అయినను దనకుదాను బుణ్యమును బ్రకటించుట చేతను, నితరులకు చెప్పుటచేతను, క్షయించును. మన పాపముల నితరులకుఁ జెప్పినచో నితరులు మనలను నిందించెదరు. మన పాపమా నిందకులకుఁ బోవును. కావునఁ బాపము చేసిన దానినిఁ జెప్పవలయును. ఇదే విధముగ మనము చేసినపుణ్యము నితరులకుఁ జెప్పినచో నదియంతయును బ్రశంసించువారలకుఁ బోవును. కావునఁ బుణ్యకార్యము నెంతగాఁదాచిన నంతటి వృద్ధిగలుగును.

ఒక మహారాజు స్వర్గమునకుఁ బోగానే యింద్రుఁడాతని పుణ్య ప్రభావముచేఁ బ్రభావితుడై ఆతని కర్ధాసన మొసంగెను. ఇంద్రుడు గొప్ప కూట నీతిజ్ఞుఁడు ఆతఁడు రాజు నిట్లడిగెను:- "రాజా! నీవు గొప్ప ధర్మాత్ముఁడవు. నీవు భూమిమీఁద నుండి యేయే పుణ్యకార్యములొనర్చితివి ?"

రాజహంకారపూరితుఁడై ఆతనితో నిట్లనెను:- "దేవేంద్రా! నేను నా పుణ్యము నేమని వర్ణింపగలను ? నేనది చేసితిని, ఇది చేసితిని, వాని కింతయిచ్చితిని, ఇట్టి యజ్ఞము లొనర్చితిని, ఇన్ని గొప్పగొప్ప దానములొనర్చితిని. సారాంశమేమనఁగా నేను జేసినన్ని పుణ్యము లెవరును జేయనేలేదు."

ఇది విని యింద్రుఁడు నవ్వి యిట్లనెను:- "రాజా! నీపుణ్య మంతయును నాశనమైనది. ఇప్పుడు నిను దలక్రిందులుగ భూలోకమునకు బడవేయుదుము."

ఇది విని రాజు మిక్కిలి భయపడి యిట్లనెను :- "మంచిది, నేను బతనమైన బతన మగుదును గాక, నేను నిన్నొక వరమడుగు చున్నాను. నేను సాధుపురుషుల మధ్యలోఁ బడవలయును."

ఇంద్రుఁడిట్లనెను:- "అట్లే జరుగగలదు" ఆతఁడాక్షణముననే పుణ్యము క్షీణించినవాఁడై తలక్రిందులుగ భూమిపైఁబడెను. తన వారు యజ్ఞము చేయుచున్న చోటున బడుటచే వారి పుణ్య ప్రవాహముచే మరల స్వర్గమునకుఁ బోయెను.

సూతుఁడిట్లనెను :- "కావున మునులారా! తననోటఁ బుణ్య కార్యములను జెప్పుకొనరాదు. తన కర్మముల ప్రశంసను దానుగాఁ జేసిగొనరాదు. తన్నుఁ దాను బొగడుకొను వాఁడు బ్రదికి యుండియును జచ్చినవాఁడే. నాగాండీవమును నిందించిన వానినిఁ జంపెదనని అర్జునుఁడు ప్రతిజ్ఞచేసినాఁడు."

కర్ణుని బాణములచే వ్యథితుఁడైన ధర్మరాజు అర్జునుని ఆతని గాండీవమును నిందించెను. అప్పుడర్జునుఁడు ఖడ్గమును గైకొని ఆతనిఁజంపనురికెను. అప్పుడు భగవానుఁడు మధ్యలో నాపి యిట్లనెను :- "నీవు చేయుచున్నదేమి ?"

అర్జునుఁడిట్లనెను :- "గాండీవమును నిందించిన వానినిఁ జంపుదునని నాప్రతిజ్ఞ. ధర్మరాజు గాండీవమును నిందించినాఁడు

ఆతనిఁ జంపి ప్రతిజ్ఞాపాలన మొనర్చుట నాకుధర్మము. నేను నా ప్రతిజ్ఞను వదలి భ్రాతృమోహమున నసత్యవాదినై ప్రతిజ్ఞను వీడుదునా ?

భగవానుఁడు సరసతతో నిట్లనెను :- ప్రతిజ్ఞను విడువవల సిన పనిలేదు. నీవు ధర్మరాజు నవశ్యము చంపుము. కాని అశస్త్రుఁ డవై వధింపుము."

అర్జునుఁడిట్లనెను :- అశస్త్రముచే వధ యెట్లు జరుగఁ గలదు ?

భగవానుఁడిట్లనెను :- "సేవకుఁడు రాజాజ్ఞను మన్నింపకున్నచో నదిరాజును వధించుటే. పత్నిని పక్కలోనికి రానీయకున్న నామెను వధించుటయే. తనకంటెఁబెద్దలను వారియెదుటనే నిందించుటయును, వారిని నీవు నీవని పిలుచుటయును వారిని శస్త్రముతో వధించుటయే. నీవు ధర్మరాజును నీవు నీవనుచు నిందింపుము. ఆతని వధకాఁగలదు."

భగవదాజ్ఞననుసరించి అర్జునుఁడట్లే యొనర్చెను. ధర్మరాజును నాతని ముఖమున నిందించి తన ప్రతిజ్ఞను బూర్తికావించెను.

అంత ఖడ్గమును గైకొని తన శిరస్సును స్వయముగ ఖండింపఁ బూనుకొనెను. అంత మరల భగవానుఁడాతని నడ్డగించి యిట్లడిగెను :- "ఇప్పుడు నీవేమి చేయుచున్నావు?"

అర్జునుఁడిట్లనెను :- "ప్రభూ ! పెద్దల కవమాన మొనర్చి నచో దానికిఁ బ్రాయశ్చిత్తము తన చేతులతోఁ దానాత్మ హత్యఁ నొనర్చుకొనుటయే. కావున నేనిప్పుడు జీవింపను."

భగవానుఁడిట్లనెను :- "మంచిదే. నీవు చావఁదలఁచిన యెడల ఖడ్గమెందుకు ? నీవు చేసిన పనులను నీనోటనే ఆత్మస్తుతి నొనర్చు కొనుము. తన నోట దన్నుఁ బ్రశంసించుకొనుట మృత్యు సమానమే."

సవ్యసాచియగు నర్జునుఁడట్లే కావించెను. తన్నెంతో గొప్పగాఁ బ్రశంసించుకొనెను.

సూతుఁ డిట్లనెను :- "మునులారా ! సారాంశ మేమనఁగా మీరెవరితోడను మీ గొప్పతనమును గూర్చి చెప్పుకొనఁకుడు పండ్రెండు దినములలో భగవంతునియొక్క దర్శనమగుటయు దాను పుత్రుఁడగునట్లు వరమొనంగుటయును నదితికి మిక్కిలి గౌరవకరమగు విషయము. దానినామె అందరకుఁ జెప్పుచుండినచో దానివలన నామె సుకృత మంతయును నశించును. ఇట్టి దృష్టాంతము లెన్నియో కలవు. మొదట నెన్నియో సిద్ధులను బొంది వాని నందర ముందు బ్రకటపరుపఁగా నవి యన్నియును లుప్తమై పోయినవి అపూర్ణులైనవారే తమ విషయములందు కొంచెమును గొప్పగాఁ జెప్పుకొనుటకుఁ బ్రయత్నించుచుందురు. మాకు భగవద్దర్శనమైనది. భగవంతుఁడు మా చేతిలోని అన్నమును దిని పోయినాఁడు. అట్లే మాకు దర్శన మొసంగినాఁడని కొందరెక్కువగఁ జెప్పుకొను

చుందురు. వీనిలోఁ గొన్ని నిజముండవచ్చును. కొందరు కల్ల కపట మెరుఁగక చెప్పియుండవచ్చును. కాని యెక్కువమంది జనులను మోస మొనర్చుటకును, అట్లు మాయచేసి యశః ప్రతిష్ఠలను, ధన మును బొందుటకును జేయుచుందురు. కావున మునులారా! ఒక వేళ భగవంతుఁడెవరిమీఁదనో ననుగ్రహముంచి దర్శనమిచ్చియుండ వచ్చును. అట్లిచ్చినను సాధ్యమైనంతవరకు బయట పెట్టకుండుట ముఖ్యము. అందువలన భగవానుఁడు వెడలినపు డదితికీ విషయ మును విశేషముగఁ జెప్పెను.

శ్రీ శుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను :-"రాజా! ఈ విధముగ నదితికి వరమును నుపదేశమును నొసంగి భగవంతుఁ డచ్చటనే తక్షణమే అంతర్ధానమయ్యెను. ఇచట భగవంతుని వలన వరమును బొంది అదితియును దాను కృతకృత్య ననుకొని పరమ భక్తి భావపూర్వకముగఁ దనపతియగు గశ్యపుని భగవద్బుద్ధిచే. బూజించెను. ఇది వినగానే ఆతని హర్షమునకు మేరలేకుండెను. పరాత్పరుఁడగు ప్రభువు తన గర్భమున నవతరించు నని తెలిసి కొని భగవంతుని జన్మకొరకై ఉత్సాహముతోఁ బ్రతీక్షించుచుండెను.

# వామనమూర్తి ప్రాదుర్భావము

శ్లో॥ ఇత్థం విరరం చ స్తుత కర్మవీర్యః
ప్రాదుర్బ భూవామృత భూరదిత్యామ్ ।
చతుర్భుజః శంఖ గదాబ్జ చక్రః
పిశంగ వాసా నలినాయతేక్షణః ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౮ అ. ౧ శ్లో॥

ఇట్లు కమల సంభవుడు వినుతి సేయు నయ్యవసరంబున

మ॥ రవిమధ్యాహ్నముఁ జెందఁ గ్రహతారా చంద్ర భద్ర స్థితిన్
శ్రవణ ద్వాదశినాఁడు శ్రోణ నభిజిత్సం జ్ఞాతలగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామన గతిం బుణ్య వ్రతో పేతకున్
దివిజాధీశ్వరు మాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్ ॥

వ. మఱియు నద్దేవుండు శంఖచక్ర గదా కమలకలిత చతుర్భుజుండును బిశంగవర్ణ వస్త్రుండును, మకర కుండల మండిత గండ భాగుండును, శ్రీవత్స వక్షుండును నలిన చక్షుండును నై......యవతరించిన సమయంబున.

శ్రీమదాంధ్ర భాగవతము

భగవంతుని పండ్రెండు దినముల వ్రతము చేతను, మాసోప వాసము చేతను, లక్ష సంవత్సరముల తపస్సు చేతను, ననేక

విధములగు నియమముల చేతను నాతనిఁ బ్రీతునిఁగా నొనర్చు కొనఁదలచిన నాతఁడట్లు కాఁజాలఁడు. భగవానుఁడు భక్తవశ్యుఁడు. అతఁడు తనకుఁ దానే యెవరి మీఁదనైన బ్రసన్నుఁడగుచో స్త్రీ, పుత్ర, సేవకుఁడు కాఁగలఁడు. భగవానుఁడు ఫలాని వ్రతము చేతను, ఫలాని అనుష్ఠానము చేతను బ్రసన్నుఁడైనాఁడనిన నిది యొక నిమిత్తమాత్రమే. ఆతఁడేదైన లీలఁ జేయఁ దలచినచో దాని కేదైన నిమిత్తముగ నొనర్చుకొని లీలనొనర్చును. ఆతఁడు నియమములకుఁ బరుఁడు. ఆతని కార్యములచే నియమము లేర్పడును. భాషావ్యవహారము చేతనే వ్యాకరణ రచనము కలుగుచున్నది కదా !

శ్రీశుకదేవుఁ డిట్లనెను :– "రాజా ! అదితికి వరమునొసంగి భగవానుఁడంతర్ధాన మయ్యెను. అదితి తనపతియగు కశ్యపుని సేవ చేయుచు భగవంతుని జన్మకొరకు ప్రతీక్షించు చుండెను. ఒకదినమున భగవంతుని తేజమాతని శరీరమునఁ బ్రవేశించినట్లు కశ్యపుఁడు తెలిసికొనెను. సమాధి ద్వారా తేజము ననుభవించి విధివిధాన పూర్వకముగ శుభముహూర్తమునఁ దన తేజమును నదితి యుదరమందు స్థాపించెను. అదితి గర్భమందా తేజము శుక్లపక్ష చంద్రుని వలె వృద్ధి పొందఁ జొచ్చెను. యజ్ఞములం దరణిని మథించిన నగ్ని యుత్పన్నమగును. అగ్నియెచటనో బయటనుండిరాదు. ఆకట్టెలలో నాయగ్ని యిదివరకే వ్యాపించియున్నది. కాని మంథనముచే ఘనీభూతమై ప్రాదుర్భావ మగును. అదే విధముగ నదితి కశ్యప సంయోగముచే సర్వవ్యాపకుఁ డగు ప్రభువు ఘనీభూతుఁడైన అగ్నివలెఁ బ్రజ్వల్యమానుఁడై ప్రకటము కావలసి యుండెను.

అగ్ని ప్రకటము కాకపూర్వము యరణుల నుండి రవ్వలురేగును. అదేవిధముగా దేవియగు నదితి అంగములందొక విధమగు విచిత్ర జ్యోతివలె విదితమయ్యెను, ఆమె వర్ణము గర్భకారణమున బాండు వర్ణముగ నున్నను, తెల్లగ నుండు మల్లె తన శోభచే సమస్తోప వనమును శోభితమును, సుగంధితము నైనట్లు ఆమె శోభయును నద్భుతముగ నుండెను. ఆమె యిప్పుడు మంథరగతిచే నడుచు చుండెను. కశ్యపుఁడు తన ప్రియతమయగు పత్ని నానంద పరచు టకై ఆమెతో నిట్లనెను :- "ప్రియా ! నీకేమి కోరిక కలదు ? గర్భవతి యగు స్త్రీని సమస్త విధముల సంతోషపరుచుటయే పతికి ముఖ్య కర్తవ్యము. నాకేవస్తువును గొదువ లేదు. నీవేదికోరిన దానినిఁ దెచ్చెదను.

ఇదివిని అదితి లజ్జా సంకోచములతో నిట్లనెను :- "ప్రాణ నాథా ! నాకేవస్తువు నవసరములేదు. మీకృప కావలయును. మీరింత ప్రేమించు చున్నారు. ఇదియే నాకు సర్వమును." ఈ విధముగఁ దన పతితో నేమియును నడుగదు కాని తన చెలికత్తెల నడుగును. ఒకర్తుకతో నిట్లనును :- "నేడు మీరేమి చేసికొన్నారు. నాకును గొంచెముగఁ బెట్టుడు. కశ్యపున కిది తెలియఁగానే ఆతఁడిట్లు గ్రహించెను :- గర్భస్థ శిశువు భిక్షకుఁడు కాఁగలఁడు. అతఁ డితరులనుండి భిక్షమెత్తుకొనఁ గలఁడు."

అదితి దగ్గఱ నేదైన సఖి యే వస్తువునైన నప్పు తీసికొనిన దామె యిచ్చును, కాని తీసికొను నప్పుడు పాత్రతో నిచ్చినదో దానితోఁ దీసికొనక పెద్దదానితోఁ దీసికొనును. సఖి యేమైన

నన్నచో నేను దీనితోడనే తెసికొందుననును. కశ్యపున కీ విషయము తెలియఁగానే ఆతఁడిట్లనుకొనెను :- "ఈ పిల్లవాఁడు లోభికూడ కాఁగలఁడు. అదితి గర్భవతిగా నున్నపుడామె బాలకులవలె నడుచును పిల్లలను మిక్కిలి ప్రేమించును. అప్పుడు కశ్యపు డిట్లనుకొనెను :- ఈమె కడుపునఁ జిన్నపిల్లవాఁడు పుట్టఁగలఁడు. కాని తప్పకపోకిరి కాఁగలఁడు. అదితి చాటుమాటుగా నప్పుడప్పుడు మట్టినిఁదినును. ఒక దినమునఁ గశ్యపుఁడు దానినిఁ గాంచి యిట్లనెను :- "ఛీ ! ఛీ !! నీవింతటి ప్రజాపతి పత్నివయ్యును మట్టినిఁ దినుచున్నావు. నావద్ద కంద, మూల, ఫలములును, మిఠాయిలును గలవు. ఇంక నితర పదార్థములకు కొదువలేదు. కావలయుననిన వీనినిఁ దినవచ్చును. మట్టినేలఁ దిందువు."

ఆత్యంత లజ్జించుచు నదితి యిట్లనెను :- 'ప్రాణనాథా ! ఏమి చెప్పుదును. నేను గర్భవతి నైనది మొదలు నాకెందులకో మట్టిమీఁద మనస్సు పోయినది. మట్టిబెడ్డలు రుచిగానున్నవి. పచ్చి మట్టి మఱియును రుచి, అప్పుడు కశ్యపు డిట్లనుకొనెను :- 'ఈ పిల్లవాఁడు భూలోభము కలవాఁడు. ఈతఁడు వశ్యము మోసమొనర్చి పృథివి నపహరణ మొనర్పగలఁడు.'

ఈ విషయములన్నియును లోలోనఁ గశ్యపుఁడీ విషయముల ననుకొనుచుండెను, కాని అదితికిఁ జెప్పుటలేదు. ఈ విషయము లామెకుఁ జెప్పినచోఁ గ్లేశముకలుగునేమోనని ఆతఁడనుకొనెను. ఈ విధముగ నదితి గర్భము దినదిన ప్రవర్థమానమగుచుండెను.

ఉదయాచల గర్భమునుండి మేఘములను జీంచుకొని సూర్య నారాయణుఁడుదయించి జగత్తును ప్రకాశించునట్లు భగవానుఁడు ప్రకటమగు సమయము నన్నికటమయ్యెను.

భాద్రపద శుక్ల ద్వాదశి పరమపావన దినము. ఆ ద్వాదశిని శ్రవణ ద్వాదశియనియు, విజయ ద్వాదశియనియును బిలిచెదరు. ఆదిన మభిజిన్ముహూర్తము. మధ్యాహ్న సమయమున సమస్త గ్రహనక్షత్ర యోగ కరణాదులు మంగళమయములుగ నుండెను. శుభగ్రహము లుచ్ఛస్థానములలో నుండెను. ఆ సమయమున భగ వానుఁడు ప్రాదుర్భావమయ్యెను. ఆ సమయమున నాతని శోభ పరమ దర్శనీయముగ నుండెను. ఆతఁడు ప్రథమమున సాక్షా చతుర్భుజుఁడగు విష్ణురూపమున నవనియందవతరించెను.

గర్భమున భగవంతుఁడుండగా నియమానుసారముగ బ్రహ్మ గర్భగతుఁడగు విష్ణువును స్తుతింపవచ్చెను. స్తుతియొనర్చి బ్రహ్మ వెడలిపోఁగానే అదితిరూపమగు ప్రాచీదిశయందు సూర్యరూపుఁడగు శ్యామసుందరుఁ డుదయించెను. ఆ సమయమున నాతని నాలుగు చేతులలో శంఖ, చక్ర, గదా, పద్మములు శోభించుచుండెను. అత్యంత సుందర సువర్ణమయమగు పీతాంబరమును ధరించి యుండెను. కర్ణములలోని కనక కుండలముల కాంతిచేఁ గపోలము కుందకళికవలె నుల్లసితమై యుండెను. ముఖ కమలమునందలి మక రందమయ మనోహరకాంతి నలువైపులను వెల్లివిరియుచుండెను. వక్షస్థలమందు శ్రీవత్సము, వనమాల, కరముల కంకణములు,

కంఠమందు కేయూరము, కేశములందు కమనీయ కిరీటము, కర్ణము లందు గుండలములు, కటియందు గింకిణీయుతమగు బిళ్ళల మొల త్రాడును, పాదములందు నూపురములును శోభాయమానములుగ నుండెను. కంఠమందలి దివ్యవనమాలయందలి మకరందమును బానమొనర్చుటకై మత్తమధుపములు వానిపై గుంజారవమొన ర్చుచుఁ బ్రభు ప్రాకట్యమునకు మంగళగానమొనర్చు చున్నట్లుండెను. అగస్త్యుడు సమస్త సముద్రసలిలములను బానమొనర్చినట్లు భగవం తుని వక్షఃస్థలముననున్న కౌస్తుభమణి కాంతులచే నంధకారమును బోఁగొట్టుచున్నట్లుండెను. మంగళమయుని మంగళజన్మ సమయ మున లీవిషాదపూర్ణ జగత్తునందు సర్వత్ర మంగళమే దృష్టిగోచర మగుచుండెను. వాయువు శీతల, మంద, సుగంధిత, సుఖద స్పర్శ యుక్తమై వీచు చుండెను. ఆకాశము నిర్మలముగ నుండెను. జలా శయములోని బురదనీరు స్వచ్ఛమయ్యెను. ప్రాణులందఱ హృద యము లందొక యవ్యక్తమగు నుల్లాసము కనఁబడు చుండెను. సమస్త ఋతువులును మూర్తివంతములై భగవంతునకు స్వాగత మిచ్చుట కుద్యమించెను. స్వర్గముయొక్క అధిష్ఠాతృ దేవుఁడు స్వయముగఁ బ్రసన్నుఁడయ్యెను. పృథివి గోరూపమును ధరించి నృత్యము చేయసాగెను. దేవతలయొక్క హృదయ కమలము తనకుఁదానే వికసించెను. సిద్ధగణ మంతరిక్ష మందానందింపసాగిరి. పర్వతములు పచ్చబడెను. వానిపైన నున్న వృక్షములు ఋతు వులు లేకయే ఫలించి, పుష్పింప సాగెను. గోరూపియగు పృథివి

నృత్యమొనర్పఁగా నన్యకామధేనువు మొదలగు గోవులు స్వయముగ దాని శ్రుతితోఁ గలిపెను గంధర్వులు గానము చేయసాగిరి. దేవతలు దుందుభులను వాయించిరి. అప్సరసలును పృథివీలాకమునఁ దాళమును గలిపి నృత్యమును జేయసాగిరి, శంఖ, దుందుభి, మృదంగ, పణవాది వాద్యములు తమకుఁ దామే వాయింపకయే మ్రోగసాగెను. మునులును, దేవతలును, మనువులును, సిద్ధగణమును, పితృగణమును, మరుద్గణమును, అగ్నిదేవుడును, ఇతర దేవతలును భగవంతుని స్తుతింపసాగిరి. ఆకాశచారులగు దేవగణము కల్పవృక్ష పుష్పములను దమతమ విమానములలోనుండి అదితి భవనముమీద వృష్టిగఁ గురిపించిరి. సిద్ధ, విద్యాధర, కింపురుష, కిన్నర, చారణ, ప్రేత, భూత, పిశాచ, పక్షి, యక్ష, రాక్షసాదు లందఱును నానందోల్లాసమున గాన మొనర్చుచు నాట్యము చేయ సాగిరి.

అదితి తనయెదుట చతుర్భుజుఁడగు భగవానునిఁ జూడఁగానే నిర్ఘాంతపోయెను. ఆశ్చర్యచకితయై, ఆనందాతిరేకమున మాత కింకర్తవ్యవిమూఢయై కూర్చుండెను. ఆమె తన కర్తవ్యమును స్థిర పరచుకొనఁజాలకపోయెను. ప్రజాపతియగు గశ్యపుఁడును నా పరాత్పర ప్రభువును దర్శించెను. భగవానునకు జయమగుఁగాక యని పలుకుచు జయ జయ శబ్దము లొనర్చెను. ఇచ్చట నింకొక లీల జరుగుచున్నదని భగవానుడు గ్రహించెను. తను జన్మించిన సంగతిని మఱచినాఁడు. ఈతఁడు నన్నుఁ బుత్రునిఁగాఁ దలచుట

లేదు, అని యాలోచించుకొని వెంటనే తన సమస్త అస్త్రశస్త్రము లను, ఆయుధములను, భూషణములను, వస్త్రములను మాయ మొనర్చి పసిపిల్లవాడయ్యెను.

శ్రీ శుకదేవుఁడిట్లనెను;- "రాజా! ఆ పసిబిడ్డను గాంచి తల్లిదండ్రులు చెందిన ఆనందమునకు మేఱలేకుండెను. ఆతనికి జాతకర్మాది సంస్కారము లొనర్చెను.

..........

## వటువామనుని ఉపనయనము

శ్లో॥ తం వటుం వామనం దృష్ట్వా మోదమానా మహర్షయః।
కర్మాణి కారయామాసుః పురస్కృత్య ప్రజాపతిమ్॥

శ్రీభాగ. ౭స్కం. ౧౮ అ. ౨౩ శ్లో॥

వ. అంతనబ్బాలునకు నంతసంబున మహర్షులు గశ్యప ప్రజాపతిం బురస్కరించుకొని సముచితోపనయన కర్మకలాపంబులు చేయించిరి,

శ్రీమదాంధ్ర భాగవతము

ఎవరిజీవితము మానవసేవకొరకై యున్నదో, సార్వజనిక సుఖదుఃఖములను దృష్టికోణమున నుంచుకొని జీవన యాపన మొన

రొనర్చుచున్నారో, లోక హితార్థకార్యము లెవరొనర్చుచున్నారో, వారికి సాహాయ్య మొనర్చుటయును, వారికి సుఖ సౌకర్యములను గలుగఁజేయుట అందరకును గర్తవ్యమై యున్నది ప్రాచీనాచార మొకటి కలదు. భిక్షుక బ్రాహ్మణుఁడు కానిండు, చక్రవర్తి సామ్రాట్టు కానిండు, ఇద్దరును దమపుత్రులను గురు గృహమున వదలివచ్చెడివారు. అచ్చట వారిద్దరొకే విధముగనుందురు. ఇద్దరును నింటింటికి భిక్షము నడుగుకొనుటకుఁబోవుచుందురు. ఇద్దరును భిక్ష దెచ్చి గురువున కర్పించెదరు. గురువొనంగిన దానితో వారు జీవించెదరు. ఇంటివద్దవారెంతటి స్వాదిష్ట భోజనమును దినినప్పటి కిని, ఇచ్చట భిక్షలో బ్రాప్తించిన అన్నము మీఁదనే జీవించెదరు. అందర గృహములను దమ గృహములుగ నెంచుకొందురు. తల్లు లందఱకును వారిపై సమానాధికారము కలదు. వారి పుత్రులును నిదే విధముగ గురుకులమున నుండి భిక్షనడుగుకొనుచుండ వచ్చును. ఈ విధముగ వ్యష్టిజీవనము సమిష్టిజీవనమగుటయే ఆర్యధర్మముయొక్క తత్త్వము. దానిని బూర్తిచేయుటకే వర్ణాశ్రమ ధర్మమును, షోడశ సంస్కారములును. ఈ సంస్కారములన్నిటిలో సర్వశ్రేష్ఠమగు సంస్కారము ఉపనయన సంస్కారము. ద్విజాతి బాలకుల కిది రెండవ జన్మగా భావింపఁబడుచున్నది. అందువలన బ్రాహ్మణ క్షత్రియ, వైశ్యులను నీముగ్గురకును ద్విజులనుసంజ్ఞ కలదు. ఉపనయనము కానివాఁడును, గురు సమీపమునకు పోయి వేదమాతయగు గాయత్రీ దీక్షను బొందని వాఁడును ద్విజు డని పిలువఁబడఁజాలఁడు బాలకుని గురువు కడకు జేర్చుటకే ఉపనయన మందురు.

శ్రీశుక దేవుఁడిట్లనెను :-"రాజా! ఇప్పుడు వామనుడు కొంచెముగఁ బెద్దవాఁడయ్యెను. శరీరమునఁ బెద్దవాఁడు కాలేదు. చిన్నవాఁడుగనే యుండుటకు సంకల్ప మొనర్చినప్పుడు పెద్ద వాడెట్లు కాఁగలడు, కాని వయస్సు పెరిగినది తెలివి యెంత పెరుగ వలయునో అంత పెరిగినది. ఇప్పుడు కశ్యపుఁడాతనికి యజ్ఞో పవీత సంస్కారమును జేయదలచెను. ఐదు సంవత్సరములవాఁడు కాఁగానే కశ్యపుఁడు సమస్త స్నేహితులను, సంబంధులను,కుటుంబ పరివారమును బిలుచుకొనెను. వామనుని ప్రభావమును నందఱును వినియుండిరి. ఇంద్ర, వరుణ, కుబేరాది సమస్తదేవతలును వామ నుని యజ్ఞోపవీత సంస్కారమునకు వచ్చిరి. మన కందర కంటెను జిన్నవాఁడగు నీతని యుపనయన సంస్కారమును జూడవలయు నని అందరకును మిక్కిలి హర్షముగ నుండెను. దేవగురువగు బృహస్పతి తనపంచాంగమును జేతఁబుచ్చుకొని ఆచార్య కార్యమును నిర్వహించుటకై వచ్చెను. సంస్కారము కొరకు చక్కని మండపము నిర్మింపఁబడెను. ముందు దినమున దేవగురుఁడగు బృహస్పతి కశ్యపునిచే మాతృకాపూజనము నాందీముఖ శ్రాద్ధాది మంగళ కృత్యములొనరింపఁ జేసెను. మఱునాఁడు దేవతల యొక్కయు ఋషుల యొక్కయు సమాజము సమావేశమయ్యెను. వేదాధ్యయన మొనర్చు చాలమంది బ్రహ్మచారులును వచ్చిరి. వారు తమ యాచార్యులతోఁ జంద్రుని ప్రక్కన నక్షత్రములవలెఁ బ్రకాశించు చుండిరి. అచ్చటి దేవతలు, ఋషులు, మునులు, ఉపదేవతలు యొక్క అద్భుత సమావేశము జరిగెను.

ముందుగా వటువగు వామనుని బ్రాహ్మణ బ్రహ్మచారులతో భోజనమొనరింపఁ జేసిరి తరువాతఁ గావలసిన కర్మచేయఁబడెను. అనంతరము స్నానమును జేయించి ఆతనిని మండపమునకుఁ గొని వచ్చిరి. ఇప్పుడాతఁడు బ్రహ్మచారి కావలసియున్నది. ఇంతవరకును బాలత్వమున ధరించిన వస్త్రములను బరిత్యాగము చేయించవలసి వచ్చును. ఇప్పుడాతఁడు బ్రహ్మచారివలె వేషమును వేసికొనవలసి యున్నది. నియమముగ నుండవలయును. అందువలన నదితి ఆతని కొక కౌపీనమును, గప్పుకొనుటకొక బొంతను నొసంగెను. వామనుడందరకును గావలసినవాఁడు. అందఱాతని కేదో యొకటి యీయవలసియున్నది. అందర యాశీర్వాదముల తేజస్సు చేతనే ఆతఁడు సుర కార్యమును నిర్వహింప సమర్థుఁడగును. విభియఁ బడిన తనతేజము నేకము గావించి దేవతలకు విజయప్రదానమును గావింపఁవలసియున్నది. తల్లి యొసంగిన కౌపీనము వటువగు వామనునిచే ధరింపఁ జేయఁబడెను. కశ్యపుఁడొక సుందరమగు మేఖలను దయారుచేసి యిచ్చెను. అది వామనుని నడుమునకుఁ గట్టఁబడినది. సాక్షాత్తుగఁ బృథివీదేవి కృష్ణమృగచర్మము నొసంగెను. చంద్రుఁడు సుందరమగు పాలాశ దండమును వామనున కొసంగెను. బ్రహ్మనీటి నుంచుకొనుట కొక సుందర కమండలువు నొసంగెను. సప్తర్షులు కుశలతోఁ జేయఁబడిన బ్రహ్మదండమును, ధరించుటకుఁ బవిత్రము నొసంగిరి. సరస్వతీదేవి ఒక సుందర రుద్రాక్షమాలను దెచ్చి యాచిన్నవాని మెడలో వైచెను. ఈ విధముగ బ్రహ్మచారికి యోగ్యములగు సమస్త వస్తువులను బొంది,

వానిని ధరించి వామనుఁడు బ్రహ్మచారి వేషమునఁ జాల సుంద
రముగనుండెను. బృహస్పతి స్వయముగ యజ్ఞోపవీతమును వడకి
తెచ్చెను. అక్షతపూర్ణములగు నెనిమిది పాత్రములం దెనిమిది యజ్ఞో
పవీతములను, దక్షిణలను బెట్టి బ్రాహ్మణులకు దాన మొసంగ
బడెను. మరల సప్తర్షుల సాహాయ్యముచే బృహస్పతి వటువగు
వామనుని కంఠమున యజ్ఞోపవీతమునుధరింపఁ జేసెను. అప్పు
డాతఁడు కౌపీనమును ధరించి, చేతియందు దండకమండలువులను
ధరించి, చంకయందు మృగ చర్మమును బెట్టుకొని, భుజము మీఁద
బొంతను వైచుకొని బ్రహ్మచారులవలె నటించుచు నందరను దన
బాలచాపల్యముచే నానంద పరచుచు యజ్ఞకుండము సమీపమునకు
వచ్చెను. ఉపనయన సంస్కారము కొరకుస్థాపింపఁబడిన ప్రజ్వలి
తాగ్నిని బరిసమూహన పరిస్తరణ, పూజనములను గావించి దానిలో
సమిధలతో హవనము కావించెను. ఆవు పిడకలనాహుతిలో వైచెను.
అప్పుడాతని యన్నయగుసాక్షాత్తుగ సవితృ దేవత ఆతనికిగాయత్రీ
మంత్రము నుపదేశించెను. బృహస్పతి బ్రహ్మచారి నియమములను
జెప్పెను. ఇప్పుడు వామన భగవానుఁడు సాక్షాత్తుగ వటు బ్రహ్మ
చారి యయ్యెను. సంస్కారమంతయును బూర్తికాఁగానే భిక్షాసమ
యము వచ్చెను. యక్షపతి యగుఁ గుబేరు డాతనికొక భిక్షాపాత్రము
నొసంగెను. దానినిఁ గైకొని వామనవటువు భిక్షమునకుఁబోయెను.
చిన్నవటువగు వామనునకు వస్తువులు చాలయేర్పడెను. ఒక్కొక్క
ప్పుడు మృగ చర్మము జారిపోవుచుండెను. ఒక్కొక్కప్పుడు
భుజముమీఁద నున్న బొంతపడిపోవుచుండెను. ఒక్కొక్కప్పుడు

కమండలము నందలి నీరుచిలికిపోయెడిది. ఒక్కొక్కప్పుడు పవిత్ర మును, గొడుగును జారిపోయెడివి. ఒకప్పుడు భిక్షాపాత్ర వరిగిపోవు చుండును. దానినిఁజేతిలోని బ్రహ్మదండముతో సంబాళించుకొనును. అచ్చటికి జేరిన స్త్రీ పురుషులందరును బాలకుని యీ విషయములను గాంచి సవ్వుచుందురు. వటువగు వామనుఁడు వీని నన్నిటినిఁ దీసికొని ధరించి సంబాళించుకొనుచుఁబోవుచుండెను. ఇప్పుడాతఁడు భిక్షమెత్తుకొనుటను నేర్చుకొనుచుండెను. శిక్షణమును గడువులోనే పొందెను. ఇప్పుడభ్యసించు చుండెను. మునుముందుగా నాతఁడు సతీశిరోమణియును, సాక్షాజ్జగదంబికయునగు ఉమాదేవి సమీపము నకు భిక్షకొరకై పోయెను. అన్నపూర్ణాదేవి ఆతనికిఁ పూర్ణపాత్రను బూర్ణము కావించెను. కాని యీతఁడు పుట్టులోభి. ఆతనికి తృప్తి యెక్కడిది? అందరకడను నాతఁడు భిక్షనడిగెను. అందరును దమతమ సామర్థ్యానుసారముగ భిక్షనొసంగిరి. కాని లోభికెన్న డును తృప్తికలుగదు. ఆతనికి లోభముచే నధికాధిక లోభము పెరుగుచుండును. అందరకడ భిక్షనుగైకొని వామనుఁడు దేవ గురువగు బృహస్పతి కొసంగెను.

బృహస్పతి చిరునవ్వు నవ్వి యిట్లనెను:- "వామనా! ఈ భిక్షచే దేవతలకుగాని, నాకుగాని యేమిలాభము? మాకందరకును గొన్నాళ్ళు సరిపోవు నట్టింకఁ గొంత భిక్షను దెచ్చియిమ్ము."

ఇది వినఁగానే వామనుఁడు దండక మండువులను గైకొని శీఘ్రముగ నిట్లనెను:- "నేను గాశికి పోయెదను, కాశ్మీరమునకు బోయెదను"

నవ్వి దేవగురు విట్లనెను:- కాశీ, కాశ్మీరములలోనేమున్నది. అచ్చట నున్న విద్యను మేము నీకుఁ జెప్పెదము నీకు వానితోఁ బ్రయోజన మే మున్నది? కొంచెముగ భిక్షమును దెమ్ము."

వామన వటు విట్లనెను:- "ఇప్పుడీ దరిద్ర దేవతలను ఋషులను నేమి యడుగుదును, యాచించిన నేదైన లభింపగల నుదారుఁడగు మహాదాత యొక్క పేరును జెప్పుడు."

అంత దేవగురువగు బృహస్పతి యిట్లనెను :- ఈ సమయమునఁ ద్రిలోకములందును బలిచక్రవర్తికి మించిన దాతయును, మనస్వియును లేఁడు. అతని కడకు బోయిన యాచకుఁడు విముఖుఁడై, నిరాశుఁడై రాఁడు." 294.592

వామన వటువు తెలియని వానివలె నిట్లనెను :- "స్వామీ! బలి యిప్పుడెచ్చట నున్నాఁడు? అతఁడెచ్చట నివసించును?"

PRA
ACC NO. 2339

బృహస్పతి యిట్లనెను :- "ఆతడు త్రిలోకాధీశ్వరుఁడు, స్వర్గమున నాతనికి ప్రధానస్థానము కలదు: కాని యీ సమయమున నాతఁడు యజ్ఞ మొనర్చుచున్నాడు." Rs. 5.00

బృహస్పతి యిట్లనెను :- "ఆతఁడు నర్మదానదికి ఉత్తర తటమున భృగువృషయను క్షేత్రమందు సమస్త యజ్ఞములందు శ్రేష్ఠమగు నశ్వమేధ యజ్ఞమొనర్చుచున్నాఁడు. ఆతని పురోహితులగు భృగువంశ బ్రాహ్మణులాతని నింద్రపదమందు శాశ్వతముగ స్థాపించుటకై నూఱశ్వమేధ యజ్ఞములకు దీక్షనిప్పించినారు.

ఇప్పటికి తొంబది తొమ్మిది యజ్ఞములైనవి. ఇది నూఱవ అశ్వమేథయజ్ఞము. ఇది పూర్తియయ్యెనా అతడు శాశ్వతమగు నింద్ర పదవి నధిష్ఠింపఁగలఁడు. అందువలన నాతఁడు యథేష్టముగ దాన మొసంగుచున్నాఁడు. అతని నే బ్రాహ్మణుఁడు వెడలి యేవస్తువును యాచించినను నావస్తువొసంగుచున్నాఁడు."

వామనవటువిట్లనెను :- మంచిది. అతనిని భిక్షఁడుగఁ బోయెదను. నాకేదైనా నిచ్చిన యెడల నాతని తొంబది తొమ్మిది అశ్వమేధ యాగములు పూర్తియగును. నా కోరిక నెఱవేర్పఁజాల కున్న నాతని నూఱవ అశ్వమేధయాగమెట్లు పూర్తికాఁగలదు."

దేవగురువగు బృహస్పతి లోలోన మనస్సులో నిట్లను కొనెను:- "లోభివాని కోరిక నెవరును బూర్తిఁకావింపఁజాలరు. అతఁడు కొలఁదిగ నడిగి కాళ్ళు బాఱఁజాపును. కాళ్ళుజాపుటవలన లోభికిఁగొంచెము లాభముకలిగెనా వాని తృష్ణవృద్ధి పొందును." పైకి బృహస్పతి యిట్లనెను :- "మంచిది, బ్రహ్మచారి మహారాజా! బలిచక్రవర్తి యజ్ఞమునకుఁ బొందు, నీబోటి భిక్షుకుఁడువాని వాఁకిలి కడకుఁ బోయెనా ఆతని అపూర్ణయజ్ఞముకూడ పూర్ణము కాఁగలదు. పొమ్మి భృగకచ్ఛ (భడొచ్)ము వైపునకుఁ బ్రయాణముకమ్మి."

వామన భగవానుఁడిట్లనెను :- "గురువర్యా! నే నచ్చటికి త్రోవనెరుఁగను. చిన్న బాలకుఁడను. మీరు నా వెంట రండు."

బృహస్పతి యిట్లనెను :- "అయ్యా! నీకంతయును దెలి యును. బ్రహ్మాండము నీయుదరమున నిండియుండినది. నీవు

గడ్డము పెరుగకున్నను నీ పొట్టలోఁ బెరిగిన గడ్డము కలదు. నీవు చిన్నవాఁడవైనను నసాధ్యుఁడవు. నడుపుము, యజ్ఞ మండపము వరకు నిన్నుఁబంపివచ్చెదను. లోపలికి రాను. కోరుట నీవే కోరు కొనవలయును."

వామన వటు విట్లనెను :-"గురుదేవా ! మీరులోని కేలరారు ? మీకు యజ్ఞమనిన నిష్టము లేదాయేమి ?"

బృహస్పతి యిట్లనెను :- "లేదు స్వామీ! యజ్ఞమనిన నిష్టములేకున్న తినునదేమున్నది ? యజ్ఞములు చేయించుట మా పనియే; కాని ఒకవృత్తి కలవాఁడదేవృత్తి కలవానిని లోలోన ద్వేషించుకొనుచుందురు. శుక్రాచార్యుఁడసురుల పురోహితుఁడు. నేను సురులకు. కావున మేమిద్దరమును కొంచెముగ నెడముఖము పెడ ముఖముగ నుందుము."

వామన భగవానుఁడిట్లనెను :- "మంచిది, మార్గమును జూపింపుఁడు." శ్రీశుకదేవుఁడిట్లనెను:- రాజా! ఇదివిని దేవగురునితో వామనమూర్తి యజ్ఞము వైపునకుఁ బోయెను."

# బలియజ్ఞమున వామనుండు

శ్లో॥ శ్రుత్వాశ్వమేధైర్యజమాన మూర్జితమ్
బలిం భృగూణాముపకల్పితై స్తతః ।
జగామ తత్రాఖిలసార సంభృతో
భారేణ గాం సన్నమయ న్పదే పదే ॥

శ్రీభాగ. ౮స్కం, ౧౮ అ శ్లో॥

క॥ ప్రక్షీణదివిజవల్లభ, రక్షావరతంత్రుఁడగుచు రాజీవాక్షుం ।
డాక్షణమున బలియింటికి, భిక్షాగమనంబు సేసెఁబెదటికము
తోన్ ॥

క॥ సర్వప్రపంచ గురుభర
నిర్వాహకుఁడగుటఁ జేసి నెఱిఁజనుదేరన్
ఉర్వరి వ్రేఁగు సహింపక
నుర్విస్థలి క్రుంగె క్రుంగె మొగ్గె నురగేంద్రుండున్ ॥

శ్రీ మదాంధ్ర భాగవతము

కస్తూరిని డబ్బిలో దాఁచిననుదాగదు సూర్యచంద్రులకు గ్రహణమువచ్చినను. వారి యందలి యెరుపును దాపఁజాలరు మలినత్వమునందు సౌందర్యము దాఁగదు. అదేవిధముగఁ దేజస్వుల తేజము దీనవికృతవేషమును ధరించినను నది దాగదు. చిన్న వేష మును ధరించినను, పెద్దవేషమును ధరించినను నధికులగనే యుందురు. వారి శోభ యింతను ప్రభావశాలిని కాఁగలదు.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- "రాజా! జీవి తన స్వార్థ విషయమును వెంటనే నేర్చుకొనును. తనకుఁ బ్రయోజనము లేనిదానినిఁ బ్రయత్న మొనర్చినను నేర్చుకొనదు. వటువగు వామనునకు అగ్నిహోత్రము, గురుపూజ, సత్య, సదాచార సంబంధమైనవి ఉపనయన సమయమునఁజాల యుపదేశములు కావింపఁబడినవి. ఆవిషయములందాతఁడు విశేష ధ్యానము నుంచలేదు; కాని భిక్ష మెత్తుకొనుటను నేర్పఁగానే దాని నాక్షణముననే నేర్చుకొనెను. ఆతని తృష్ణ గొప్పది సాధారణుల వద్ద భిక్షమెత్తుకొనుట ఉచితము కాదని తలఁచెను. చక్రవర్తి సామ్రాట్టు సమీపమునఁ జేతులను జాపుటయును, ఆతని ద్రవ్యమును గ్రహించుటకును బయలుదేరెను. చూపులకుఁ బొట్టివాఁడేకాని విశ్వబ్రహ్మాండములను బొట్టలోఁబెట్టుకొనినాఁడు. ఆతఁడెచ్చటికైనను బోవును. ఆతఁడు తన బుడిబుడి పాదమును నేలపైఁబెట్టఁగానే యేనుగెక్కిన పడవ యూగిపోవునట్లు పృథివి అడుగడుగునకును నూగిపోవుచుండెను. పొట్టి వామనుఁడు వటువై బలిని మోసగింపఁబోయెను.

ఇదివిని శౌనకుఁడిట్లడిగెను :- "సూతా భగవానుఁడు మరుగుజ్జేలయైనాఁడు. సాధారణ బ్రాహ్మణుఁడై బలిని యాచింపవచ్చును గదా! బలి యితర బ్రాహ్మణులకును నిచ్చుచున్నాఁడుకదా! అట్టి యెడనిట్టి వికృతవేషమును ధరించుటెందులకు ?"

ఇదివిని సూతుఁడిట్లనెను ;- "స్వామీ! దీని నా సర్వజ్ఞుఁడును, సమర్థుఁడును, సర్వేశ్వరుఁడును, సర్వాంతర్యామియగు

శ్యామసుందరుఁడే యెఱుఁగ వలయును. ఆతని లీల అపరంపారము. ప్రాణులకు దానిని దాటుట మిక్కిలి దుష్కరము. అయినను వామనుఁడగుటకుఁ జాలకారణములు కనఁబడుచున్నవి.''

మొదటి కారణమిదిగాఁ గనఁబడు చున్నది. సోదరులారా? కన్నులు తెఱచుకొని బాగుగాఁజూడుఁడు. భిక్షమెత్తుకొనుట అన్నిటి కంటెఁ జిన్నకార్యము. సర్వేశ్వరుఁడనగు నేను భిక్షమెత్తుకొను నవసరము వచ్చుటచేఁ జిన్నవాఁడను గావలసి వచ్చినది. అను శిక్షణ మొసంగుటకని తోఁచుచున్నది.

మరుగుజ్జువాని చేతులును, గాళ్లును, నితరావయవములును నితరపురుషులకు వలెనే యుంకను. భేదమేమనఁగా వయస్సు పెరిగినను నవి పెరుగవు. కొంచెముగఁ బెరిగిన తరువాతఁ గొంచెము బంతివలె నగును. దీనిచే భగవానుఁడు భిక్షగాఁడెంత పెరిగినను జిన్నవాఁడుగనే యుండునని చెప్పుచున్నాఁడు సదా యితరుల సమ్ముఖమున దీనుడై చేయి జావవలసివచ్చును. పొట్టను జూపింప వలయును.

మూఁడవ కారణమిదియై యుండును - మనము సాధారణ బ్రాహ్మణులవలె నైనచో రాజు ఇచ్ఛానుసారముగ నేమియు నీయఁడు. ఇంక నెక్కువగ మాటలాడినచో నాతని సేవకులేదైనఁ బరిశ్రమము చేసికొనరాదా? యందురు. మరుగుజ్జువాఁడనై వెడలి నచో రాజునకు దయకలిగి యిష్టము వచ్చినట్లు దానమీయఁ గలడు. పాపము మరుగుజ్జువాఁడని జాలిపడ గలఁడు. నాల్గవకారణమిదియై

యుండవచ్చును. ఈతఁడు పృథివిని యాచింపవలసియుండెను. అదియును పాదములతోఁ గొలుచుకొనియే. అప్పుడీ మరుగుజ్జు బ్రహ్మచారికిచ్చి వేయుఁడనును.

అయిదవ కారణమిదియై యుండవచ్చును. భిక్షకుని హృదయము సదా శంకితమైయుండును. అదినిరంతరమును వెనుక ముందులాడుచుండును. పోయిన దాత యిచ్చునో యివ్వఁడో యను కొను చుండును. పురుషులకంటె స్త్రీలతి దయామతులుగ నుందురు. పిల్లలకును బ్రహ్మచారులకును సర్వత్ర ప్రవేశముండునని వామనుఁడు బ్రహ్మచారి యయ్యెను. పిల్లలంతఃపురము లోనికిని నేయడ్డును లేకయే పోవుచుందురు. పురుషులు కడకును బోవు చుందురు. అందువలన భగవానుడిట్లను కొనెను :- ఎవరైనఁ బ్రబోధించిన బలిచక్రవర్తి నిర్లక్ష్య మొనర్చినచో, వింధ్యావళీ సమీపమునకుఁబోయి ఆమెహృదయమున దయాభావమును సంచ రింపఁజేయ వచ్చును.

ఆరవ కారణ మిదియును గావచ్చును :- విచిత్రవేషమును జూడఁగానే అందరిదృష్టులావైపున కాకర్షింపఁబడును. కావున నేను జిన్నవాఁడనై వెడలెదను. అందఱును నారూపమునుగాంచి చకితు లయ్యెదరు. నావైపున కాకర్షింపఁబడెదరు. నేను వేదశాస్త్ర సమ్మతముగను, యుక్తిపూర్వకముగను బెద్ద పెద్దమాటలు మాటలాడు చున్నపుఁడందఱును విస్మయాపన్నులై చూచుటకీ వామనుఁడు చిన్నవాఁడేకాని గొప్ప గొప్పమాటలను మాటలాడు చున్నాఁడే

యని యనుచుందురు "పిట్టకొంచెము కూతఘనము." వ్యాపార మందేదోవిధముగ జనులను దమవైపున కాకర్షించుట శ్రేష్ఠమగుకళ. మూలికలమ్ము వారు తమ దుకాణము ముందిద్దరచే జడగమాడించె దరు. వారిద్దరును జాల చెడ్డగ నజచుకొనుచుందురు. పోట్లాడుకొను చుందురు చాలమంది జనులు కుతూహల వశమున నచ్చటికి సమా వేశమగుదురు. వచ్చివారిట్లడిగెదరు :- "ఏమి విషయము?" అప్పుడు వస్తు విక్రేత వారిని శాంతపఱచి తనవస్తువుల నమ్ముకొనును. ప్రకటన కిదియొక మార్గము. వామనమూర్తియును మరుగుజ్జు వేష మును ధరించి తన విజ్ఞాపనమును నాకర్షింపఁజేసెను.

సూతుఁడు శౌనకాది మహామునులతో నిట్లనెను :- "ముని లారా! భగవానుఁడు మరుగుజ్జువేషమును ధరించుట కనేక కారణ ములు కలవు అన్నిటి సారమేమనఁగా రాజును మోసగించుటకై ఆతఁడీ వేషమును ధరించెను."

శ్రీశుకదేవుఁడు పరీక్షిన్మహారాజుతో నిట్లనెను :- "రాజా! నర్మదానదికి ఉత్తరతటమున భృగుకచ్ఛ (భడౌచ) యను క్షేత్ర మందు - బలిచక్రవర్తి యజ్ఞము చేయుచున్న చోటునకు పోవుచుఁ బోవుచు వామనుఁడుచేరెను. దూరమునుండి అగ్నిశిఖవలె జాజ్వల్యమాన మగు నొక తేజః పుంజము యజ్ఞము వైపునకు వచ్చుచుండుట నందరును గాంచిరి. సూర్య చంద్రులవలె ప్రభా వంతుఁడుగనున్న నా మాయా మాణవకుడగు హరినిఁగాంచి అంద రును నాశ్చర్యచకితులైరి. చక్రవర్తి యజ్ఞమందుండిన ఋత్విజ, యజమాన, సదస్యగణమిట్లనుకొనిరి :- యజ్ఞము వైపునకు వచ్చు

చూడిన నీతఁడెవరో ? అగ్నిదేవుఁడే సాకార స్వరూపమును ధరించి అగ్నిలోకమునుండి వచ్చుచున్నాఁడా ? లేక సూర్య దేవుఁడు యజ్ఞ దర్శనేచ్ఛచే వచ్చుచున్నాఁడా? బహుశః సదా ఐదారేండ్ల వయస్సు కలిగి బాలురవలె నుండు కుమారులలోఁ బరమతేజస్వియగు సనత్కుమారుఁడు యజ్ఞ ప్రశంసను విని వచ్చుచున్నాఁడా యేమి? ఈవిధముగ యజ్ఞమును జేయించు భృగువంశ బ్రాహ్మణులు తమ శిష్యుల తోడను, పుత్రులతోడను సహచరులతోడను నీవిషయమున దర్కవితర్కము లొనర్చుచుండు నంతలో వామనమూర్తి యజ్ఞ మండపము సమీపమునకు వచ్చెను. ఆతని మనోహరమగు వేష మును గాంచి అందఱ చిత్తములను స్వతః ఆతని వైపున కాకర్షింపఁ బడుచుండెను. ఆసమయమున వటువగు వామనుని శోభ దర్శ నీయముగనుండెను. చిన్నగఁ బలుచనైన నడుమునకు మూంజ యొక్క మోటు మేఖలకట్టఁబడి యుండెను. ఒక కౌపీనమును ధరించెను. భుజముమీఁద మోటైనశుభ్ర యజ్ఞోపవీతము దూరమున నుండియే కనఁబడుచుండెను. శ్యామవర్ణమగు సుందర తేజస్వియగు శరీరమందాతఁడు మృగచర్మమును గప్పుకొని యుండెను. తల మీఁద చిన్న చిన్న తామ్ర వర్ణముగల తళుకులు వ్రేలాడుచుండెను. చంకలో గొడుగుండెను. భుజము మీఁద బొంతయుండెను. పథ శ్రమచే శ్రమించుటచే నాతనికీవస్తువు లన్నియును భారభూతములై యుండెను. ఎప్పుడైన నవి తమ స్థానమునుండి జారిపోయినచోఁ గొన్ని క్రిందఁబడుచుండెను. కొన్నికదలు చుండెను. ఒక్కొక్క

ప్పుడు పరస్పరము కలిసికొనుచుండును. ఒక్కొక్కప్పుడు వక్ర గతినిఁ జెందును వాని నన్నిటిని సవరించుకొనుచు చిన్న చిన్న పాదములతో నడచుచు బలియొక్క యజ్ఞమండపమునకుఁ జేరెను. ఆతని యపరిమిత తేజస్సునుగాంచి, ఆతని కాంతిచేఁ బ్రభావితులై భృగువంశ బ్రాహ్మణులును, నితర బ్రాహ్మణులును వెంటనే యంత్రమువలె సంకల్పము లేకనే తమకుఁదాము నిలుచుండిరి. అగ్నికుండములోని అగ్నులును బ్రజ్వలితములై కుండమునకుఁ బైకి వచ్చి భగవానునకు స్వాగత మొసంగెను. యజ్ఞమునకు యజమాని యగు బలిచక్రవర్తి విచిత్ర బ్రాహ్మణ వేషమునుగాంచి ముగ్ధుడై, యాతఁడు లోలోన నమః పూర్వకముగఁదమ సర్వస్వము నాతని చరణములకు సమర్పించెను.

నాలుగువైపులను కలకలము బయలుదేరెను. ఒక వరమసుందరుఁడును, వామదేవ సదృశుఁడును, దేజస్వియును, దపస్వియునగు బ్రహ్మచారి యజ్ఞమండపమునకు వచ్చుటను గాంచి స్త్రీ పురుషులు గుంపులు గుంపులుగ నీ మరుగుజ్జు వటువును జూడసాగిరి. ఆతని సమస్త అంగములును, నుపాంగములును నాతని రూపమున కనురూపముగ నుండెను. అతిమనోహరముగను, బరమదర్శనీయుఁడుగను నున్న నా బ్రహ్మచారినిఁ గాంచి అందఱును నాత్మ విస్మృతినిఁ జెందిరి.

యజమానుఁడగు బలిచక్రవర్తి లేచి యెదురుగవచ్చి వానికి స్వాగత మొసంగెను. బంగరు పళ్లెరమందు చరణములను గడిగెను విధ్యుక్తముగ మంత్రములను బఠించి ఆతని కర్ఘ్యము నొసంగెను.

అత్యంత మనోహరమును మృదువునగు నాసనమును నాతనికిఁ గూర్చుండుట కొసంగెను. వామనవటువు తన కమండలువును నొకవైపునునుంచి, బొంతను భుజముపైనుండి తీసి, మృగచర్మమును సవరించుకొని, దండమును బొంతసహాయమున నుంచి ఆతఁడు సుఖాసనమునఁ గూర్చుండెను. వామనుఁడు కూర్చుండినమీదట బలి శాస్త్రోక్త విధిచే నావిచిత్రాతిథియగు విప్రునిఁబూజించెను. తులసీ చందన గంధమిశ్రిత జలముచేఁ జరణములను గడిగెను. అర్ఘ్య ఆచమనీయముల నొసంగి, యజ్ఞోపవీత వస్త్రములను గంధపుష్పములను, మాలా, ధూప, నైవేద్య, ఫల దక్షిణాదులను సమర్పించి హారతి నొసంగెను. మధుర వినీత వచనములతో స్తుతించెను. మరల నాతని పునీతపాదోదకములను శ్రద్ధాభక్తులతో శిరస్సున నుంచెను. నర్మదాతీరమున నుండగానే గంగవచ్చినదని ఆ నీటిని గృహమందంతటను జల్లుకొనెను. భృగుకచ్ఛపమందే గంగా నర్మదల సంగమమైనది. విష్ణుపాదోకమును గంగయను పేరు కలదు. దేవాధి దేవుఁడును, జంద్రశేఖరుఁడును, వృషభ ధ్వజుఁడునగు శంకరుఁ డందుల కనియే భక్తిభావముతో దానిని శిరమున ధరించినాఁడు.

శ్రీశుక దేవుఁడిట్లనెను :-"రాజా ! యోగ్యుఁడగు నతిథి తన యజ్ఞ మండపమునకు వచ్చుటను గాంచిన బలి హర్షమునకు మేర లేకుండెను. ఆతఁడు తన యపూర్వమగు నతిథి సంతుష్టి నొనర్చుటకై యేదియో అడుగుట కుద్యుక్తుఁడయ్యెను.

# బలి - వామనుఁడు

శ్లో॥ యద్యద్వటో వాంచసి తత్ప్రతీచ్ఛ మే
త్వామర్థినం విప్రసుతాను తర్కయే।
గాంకాంచనం గుణవద్ధామ మృష్టమ్॥
తథాన్న పేయ ముతవా విప్రకన్యామ్॥
శ్రీభాగ. ౮ స్కం. ౧౮ అ. ౩౨ శ్లో॥

మ॥ వరచేలంబులో మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములోరథంబులో విమృష్టాన్నంబులో కన్యలో
కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీ ఖండమొ కాక యేమడిగెదో ధాత్రీ సురేంద్రోత్తమా॥
శ్రీమదాంధ్ర భాగవతము

ప్రపంచములో మనస్వులగు వారు సత్పాత్రల కీయరానిది లేదు. పృథివ్యప్తేజో వాయురాకాశములను నీ వంచ భూతములు భగవానునిచే నిర్మింపఁబడినవి. ఏవఁడైనఁ దానొక నీటి బిందువును నిర్మింపఁ దలంచిన నిర్మింవఁ జాలఁడు. భూతముల నుత్పన్న మొనర్చుశక్తి భూత భావనుఁడగు భగవంతుని యందే కలదు. ఈ ప్రపంచమందున్న సువర్ణము, వెండి, మణిమాణిక్యములు, భవనములు, మేడలు, తోటలు, ఉద్యానవనములు, పుష్పములు, వస్త్ర

ములు, చందనము, స్త్రీ పురుషులు, గుఱ్ఱములు, ఏనుఁగులు, ఒంటెలు; గోవులు, తోడేళ్ళు, మేఁకలు మొదలగు జీవ పదార్థములన్ని యును బంచ భూతముల సంయోగము చేతనే యేర్పడినవి. మన దేహమును బంచ భూతములతో నిర్మింపఁ బడినది ఒకా నొక దిన మున నిదియును బూచిదయై, క్రుళ్ళి, మలమై పంచభూతములలో గలిసిపోవును. ఈ దేహము నశ్వరమైనపుడు దీనిద్వారా ఉపార్జింపఁ బడిన లేక నిర్మితపదార్థముల వినాశము లెట్లు కాఁగలవు. ఇవన్ని యును నొకానొక దినమున భూతములలోఁ గలిసిపోవును. ఈ నశ్వర పదార్థములందు స్వేచ్ఛాపూర్వకముగ మమత్వమును దొలి గించుట చేతను, సత్పాత్రకు దానమొసంగుటచేతను నవినాశి లభించినచో నిట్టి లాభప్రదమగు వ్యాపారమునే బుద్ధిమంతుఁడు చేయఁదలఁపడు ? పతనము నుండి రక్షించునదియే పాత్ర. అక్షత పాత్రయందు నీరు, నేయి, నూనె వీనితో నింపినచో నది పగుల కున్నఁ బాత్రయందుండినచో నది పడిపోదు. అనఁగా దానికిఁ బత నము కలుగదు. ఇదే విధముగ మానవునిఁ బతనము నుండిరక్షించు వాఁడు పతిత పావనుఁడగు శ్రీహరియే. అందువలన నన్నిటికంటే శ్రేష్ఠమగు పాత్ర ఆతఁడనియే చెప్పఁబడినది. భగవానున కర్పించిన వస్తువు క్షయిష్ణువైనదైనను నక్షయమగును. నాశవంతమైననునవినాశి యగును. కావునఁ దనకున్న సర్వస్వమును సత్పాత్ర స్వరూపుఁ డగు శ్రీహరికే సమర్పింపవలయును.

శ్రీ శుక దేవుడిట్లనెను :- "రాజా ! బలి వామనమూర్తికి పూజ చేయఁగానే చేతులను జోడించుకొని యిట్లనెను :- స్వామీ ! మీరీ

దీనునకు దర్శనమొసంగి మిక్కిలి దయ చూపితిరి. ఈ యజ్ఞ భూమిని మీ పాదరజముచేఁ బరమపావన మొనర్చితిరి. నేను మీకే విధముగ సేవ చేయవలయునో, యేమి పలికి మిమ్ములను విను తింపవలయునో తోచుటలేదు."

వామనవటువిట్లనెను :- "రాజా! మేమేమి యోగ్యులము. భిక్షుక బ్రాహ్మణులము. నీయశము దిగ్గజంతముల వ్యాపించి యున్నది. నీ ప్రశంసను విని యితర దర్శకులు వచ్చినట్లే నీ యజ్ఞమును జూచుటకు నేనును వచ్చితిని."

వినీతభావముతో బలి యిట్లనెను :-"స్వామీ! నేనుమిమ్ముల నితర సాధారణ దర్శకుల వలె భావించుట లేదు. నేను మిమ్ములను మనుష్యునిఁగా భావించుటలేదు. సమస్త రాజర్షుల, బ్రహ్మర్షుల తపస్వుల యొక్క తపో మూర్తియని భావించుచు, నా యజ్ఞమును కృతార్థ మొనర్ప వచ్చినట్లను కొనుచున్నాను."

వామన వటువిట్లనెను :- "రాజా! నీవు ధర్మాత్ముఁడవు. అతిథి నే విధముగ భగవద్బుద్ధితో సత్కార్య మొనర్పవలయునో నీకు బాగుగాఁ దెలియును. అందువలననే నీవిట్టి శిష్టాచార వాక్యములను బలుకుచున్నావు. మంచిది శిష్టాచారమైనది. ఇప్పుడు నీ బనినిఁ గావింపుము. దేవర్షి పితృతర్పణము లొనరింపుము. యజ్ఞపావన మొనర్చి పుణ్యము నార్జించుకొనుము."

ఇదివిని బలి యిట్లనెను :-"స్వామీ! మీవంటి వారి దేవ దుర్లభ దర్శనమైన తరువాతఁ గూడ నింక నాకు కర్తవ్యశేష

ముండునా! మీ పవిత్ర పాదపద్మముల నెప్పుడు ప్రక్షాళన మొనర్చితినో అప్పుడే నా పాపములన్నియును నశించినవని నేను దలంచుచున్నాను. నేను విధ్యుక్తముగఁ జేసిన సమస్త యజ్ఞముల ఫలమును బొందితిని. మీ చరణామృతమును పానమొనర్చి, శ్రద్ధతో శిరస్సున ధరించి నేను నేఁడు పవిత్ర తీర్థములందు స్నానము చేసిన వాఁడనైతిని. నేను సమస్త దేవతలను, ఋషులను, పితరులను సంతుష్టి నొందించితిని. ఈ కోమల చరణకమలములీ భూమినిఁదాకుటచే నిది పవిత్రమైనది. మీరు నన్నత్యంత మనుగ్రహించితిరి. నేను మిమ్మొక్క విషయమడుగఁ దలఁచుచున్నాను, కాని అడుగుటకు సంకోచించుచున్నాను."

వటువగు వామనుఁడిట్లనెను :- "లేదు రాజా! సంకోచింప బని యేమున్నది? నీవడుగఁ దలఁచినది నిస్సంకోచముగ నడుగుము."

బలి యిట్లనెను:- "స్వామీ! మీరు నన్నేదో యాచింపవచ్చినట్లు భావించుచున్నాను."

నవ్వి వటువగు వామనుఁ డిట్లనెను:- మహారాజా! నీకెట్లు తెలిసినది?"

బలి విస్మిత భావముతో నిట్లనెను:- "స్వామీ! నాకు నిశ్చయము కాలేదు. కాని మీరేదో ప్రయోజనము కొఱకై వచ్చినట్లను మానించుచున్నాను. మీ బ్రాహ్మణ వేషమే చెప్పుచున్నది. బ్రాహ్మ

బడు భిక్షుకుఁడై జన్మించును. ఆతనికి సాంసారిక ప్రపంచాముతో, ప్రయోజనము లేదు. ఆతఁడెవరి కడనైనను వెడలినచో యాచించుటకే పోవును మీరీ బ్రహ్మచారి వేషమును ధరించితిరి. బ్రహ్మచారికి తన నిత్య కర్మకును, అధ్యయమునకే అవకాశములేదు. ఆతఁడే గృహస్థుని కడకైనను వెదలినచో నేదో ఆవశ్యక వస్తువు కొఱకై వెడలును. బ్రాహ్మణులకు రెండవ అజీవిక అధ్యాపనము, యజ్ఞమును జేయించుట, దానమును గ్రహించుట, యజ్ఞోత్సవమునకు బ్రాహ్మణు లేదియో ఆశతో వెడలుదురు. ఈ కారణములన్నిటినిఁ బట్టి మీరేదో ఆవశ్యకమగు వస్తువును యాచించుటకు వచ్చితిరని నేనూహించితిని. నా యనుమానము నిత్యము కాదు కదా!"

రాజుయొక్క యీ ప్రశ్నను విని భిక్షకుఁడగు వామనుఁడు కొంచెము లజ్జించి నట్లయ్యెను. లజ్జా దీనతాయుక్తమగు నవ్వుతో సంచేతనము నాతఁడీ యనుమానము సత్యమని యంగీకరించెను.

బలి యాతని తపస్తేజ, సౌందర్య సరళతాస్వభావమునకు బరమానందమును జెందుచుండెను. ఇప్పుడాతని లజ్జాయుతమగు నవ్వుచే నాతని సాహసము పెరిగి యిట్లనెను:- "స్వామీ! లజ్జింప వలసిన పనిలేదు. మీరు బ్రహ్మచారులు, సత్పాత్రులు, మీవంటి సత్పాత్ర నన్ను గౌరవాన్వితు నొనర్చుటకై నన్ను యాచింప వచ్చితిరి. మీ బ్రాహ్మణుల కృపచే మావద్ద నేవస్తువును గొదువ యనునది లేదు. మీరేది యడుగ దలచితిరో దానినడుఁగుడు. మీరు రాజ్యము నడిగినను దాని నొసంగుటకు సిద్ధముగ నున్నాను.

నవ్వి వామను డిట్లనెను :- "రాజా! చిన్నవాడను రాజ్య మేమి చేయఁగలను?"

బలి యిట్లనెను:- "అయితే, మీకిష్టము వచ్చినదేఅడుగుఁడు మీరు చిన్నవటు బ్రహ్మచారులు. పిల్లలకుఁబాలనిన నిష్టము. మీరు పాలు త్రాగుటకు గోవు కావలసియుండిన నొకటేగాని, రెండు, పది, యిరువది, యేబది, నూఱు, వేయి, పదివేలు, లక్ష, రెండులక్షలు మీకెన్ని గోవులు కావలసియుండిన నన్నిటికంటె సుందరమైనవి యును, పాడివియును, నెక్కుడుగఁ బాలిచ్చునవియును నడుగుఁడు"

వామనుఁ డిట్లనెను;- మహారాజా! గోవులను నేనెచ్చట గట్టు కొని తిరిగెదను? నేనెంత చిన్నవాడఁనో చూచుచున్నావుకదా! నా శరీరమునే తీసికొని పోవుట కష్టముగ నున్నది.

బలిచక్రవర్తి మిక్కిలి యుత్సాహముతో నిట్లనెను :- "మంచిది గోవులు కాకుండినఁ బోనిండు, మీకెంత సువర్ణము కావల యునో తీసుకొని పొండు. మీవద్ద సువర్ణ ముండినచో నమస్త సామగ్రులును వానికవియే రాఁగలవు. భోజనమడుగుడు, వస్త్రముల నడుగుడు, పాలు, మీగడ, వెన్న, పాలకోవా, మొదలైన వన్ని యును నీ దబ్బుచేఁ రాఁగలవు. డబ్బున్నవారివద్దకు గొప్ప గొప్ప గుణవంతులును, శ్రేష్ఠాతి శ్రేష్ఠ పండితులును, నుత్తమ కళాకారు లును వచ్చుచుందురు. సమస్త గుణములును గాంచనమున నివాస మొనర్చుచుండును. కావున మీరు యథేచ్ఛగా బంగారము నడుగుఁడు."

వామనుఁడిట్లనెను:- మహారాజా! బంగారము నెచ్చటఁగట్టు కొని తిరుగుదును? సువర్ణము రాఁగానే వ్యవహార మందసత్యత వచ్చును. ధనమదము వృద్ధియగును దానియందాసక్తి క[illegible]గును. ధనికులకు దయ యనునది యుండదు. రజోగుణము వృద్ధియగును. అందఱతో వైరము కలుగును. అందఱాతనిఁ గొట్టి వానినుండి ధనము లాగుకొన వలయునను కొనుచుందురు."

అంత బలి యిట్లనెను:- మంచిది సువర్ణమును గైకొనకుఁడు నేను మీకత్యంత సుందరమగు భవనము నిర్మించెదను. దానిలో మెత్తని పరుపులు పరువఁ బడియుండును. బంగారపు టుయ్యేల యుండును. అత్యంత సుందరమగు స్వచ్ఛమును, దెల్లగనుండిన వస్త్రములు కొట్లనిండ బియ్యము నిండియుండును. సమస్త పదార్థము లందుండును. తినుటకు లేహ్య, చోష్య, భక్ష్య, భోజ్య, పేయ పదార్థములుండును. త్రాగుట కత్యుత్తములగు పదార్థములు కలవు. ఇట్టి సర్వ సంపద్యుక్తమును, సమస్త సామాగ్రులతో సంపన్న మైన పదార్థములతోఁ గూడుకొనిన దానిని దానము కావించెదను. నా కింకను వివాహము కాలేదు. గృహిణి లేక గృహమెందుకని మీరన వచ్చును. ఇటుకలును రాళ్ళతోఁ గట్టఁబడినవి యిండ్లుకావు. ఇట్టివానిలో నుండువారిని గృహస్థులవరు. అట్లైనఁ బెద్ద పెద్ద మీసములను, గడ్డములను, జడలను బెంచుకొనిన సాధువులును నిండ్లలో నివసించు చుండెదరు. వీరు గృహస్థని పిలువ బడరు. గృహిణి యుండు గృహమే వాస్తవమున గృహము. అట్లైన మీకు వివాహేచ్ఛయే యున్నచో నేదోవిధమున మీరే ఒక బ్రాహ్మణ

కన్యకును వెదుకు కొనుఁడు. నేను మీకు వివాహ మొనర్చెదను. బ్రహ్మచారులగు మిమ్ము గృహస్థుగా నొనర్చెదను. రెండు కాళ్లను నాల్గుకాళ్లుగాఁ జేయఁగలను. నిర్వాహము కొఱకు గ్రామము కావలయు ననిన గ్రామముల నిప్పించెదను. గుఱ్ఱము కావలసియుండిన గుఱ్ఱము మీయింట వాఁకిటఁ గట్టించెదను ఏనుఁగు కావలయుననిన నేనుఁగు నొసంగెదను. రథమును గోరుకొనినచో సుందర సువర్ణ మండితమగు రథము నిప్పించెదను. మీరును మీ గృహిణియు దానిలో. గూర్చుండి సుఖపూర్వకముగఁ దిరుగుచుండ వచ్చును. ఈ వస్తువులన్నియును గాక మీకింకేమైనను గావలసి యుండిన దాని నడుఁగవచ్చును. సంకోచములేక అడుగవచ్చును. కృపణుల నడిగిన లజ్జవేయును స్వయముగ శ్రద్ధతో నొసంగుటకు సమాత్యుకులైనపుడు దాని నడుగుటలో లజ్జించుట వ్యర్థము.

శ్రీ శుకదేవుఁడిట్లనెను :- "రాజా! రాజు సమస్తవిధములను దన కనుకూలుడనియును, సమస్తమును నొసంగుట కుత్సహించుచున్నాఁడనియుఁ దెలిసికొని, ఆతని నింకను దృఢ మొనర్చుటకు, ఆతనిని మాటలతోఁ గట్టుటకును, నాతని మోసగింపఁ గపటవేషమును ధరించిన యా బ్రాహ్మణ దేవత ఆతనితో నేమో పలుకుచుండెనుఁ ఆతనికేమి కావలయునో సూటిగాఁ జెప్పక, దానికి గొప్ప భూమికను బంధించి చెప్పుట కారంభించెను.

## వామనుఁడు బలి కులమును గూర్చి ప్రశంసించుట

శ్లో॥ వచస్తవైతజ్జనదేవ సూనృతమ్
కులోచితం ధర్మయుతం యశస్కరమ్ ।
యస్యప్రమాణం భృగవః సాంపరాయే
పితామహః కులవృద్ధః ప్రశాంతః॥

—శ్రీభాగ. ౮స్కం. ౧౯అ. ౨శ్లో॥

సీ. జననాథ నీమాట సత్యంబు సత్కీర్తి
దంబుఁగులార్హంబు ధర్మయుతముఁ
గరుణానువర్తులు ఘనతత్త్వమూర్తులు
గాని మీకులమందుఁ గలుగ రొరులు
రణభీరువులు వితరణభీరువులు లేరు
ప్రత్యర్థు లర్థులు ప్రబ్బికొనిన
దానశౌండిమమునఁ దనుపుదు రధికులై
మీతాతలందఱు మేటిమగలు.

శ్రీమదాంధ్ర భాగవతము.

నీతియుక్తులతోఁజేయఁబడిన కార్యమే బాగుగ సిద్ధించును. అన్ని కార్యములందును నెట్లు యుక్తియుండునో భిక్షమెత్తుట యందును యుక్తియుండును. "దీనితో నేమియును లాభములేదు.

భిక్షమెత్తుకొని తిందు"మని లోకులనుచుందురు. దీనినిబట్టి భిక్ష మెత్తుట అన్నిటికంటె సరళ కార్యమని తెలుచున్నది. కాని వాస్తవమున విషయమిదికాదు. భిక్షమెత్తుట చాల కఠినకార్యము. ఇతరుల హృదయమున దయాసంచారము గావింపఁజేసి, పరిశ్రమచే సంపాదించిన డబ్బును దీసికొనుట సరళకార్యముకాదు. దీనికొరకును బుద్ధిబలమును యుక్తియును గావలయును. భిక్షకుఁడు దాత దృష్టి తనమీఁదఁబడునట్లు వేషమునువేయవలయును. వాస్తవమున నీతనికి ధనమవసరమని వానినిఁ జూడఁగనే దాతకు దోఁచవలయును. అందువలననే చాలమంది బిచ్చగాండ్రెరుపు రంగును రాచుకొని, దానిమీఁద గట్టునుగట్టి తమ శరీరమందు కృత్రిమగాయమును జూపించెదరు. చాలమంది ఒక కాలిని భూమిలో బాతుకొని, దాని స్థానమునఁ గొయ్య కాలినుంచి కుంటివారుగాఁ బ్రదర్శించెదరు; చాలమంది ఒక చేతిని జొక్కాయందు దాఁచుకొని, ఆస్థానమునఁ గొయ్యతోఁ జేయఁబడిన కృత్రిమ హస్తమును దగిలించుకొని తాము చేతులు లేనివారమని చెప్పుకొనుచుందురు. కొందఱు కన్నులుండియును గ్రుడ్డివారుగ నభినయించెదరు. చాలమంది స్త్రీలు కృత్రిమ పసిబిడ్డల నేర్పాటుచేసికొనియును, నింకొకరి పిల్లలను దెచ్చియును నప్పుడే కనినవారివలెఁ గనఁబడుచుందురు. సారాంశమేమనఁగా దాతయొక్క హృదయములో నీయవలయునని భావన యెట్లు కలుగునో అట్టి వేషమును భిక్షకుఁడు వేయవలయును. పండితుఁడైనఁ బని జరుగుచోఁ బండితవేషమును వేయవలయును. వేషము

వలన ప్రభావము మానవునిపైన వెంటనే పడును. స్వభావము సహవాసముచేఁ దెలియఁబడును. అందువలననే భగవానుఁడు దయ నీయమైన బ్రహ్మచారిభిక్షుక బ్రాహ్మణవేషమును ధరించెను.

భిక్షగాఁడైనవాఁడు ముందుగా దాతకడనే యే నడతలు సాగునో, ఎట్టివారిని మన్నించునో తెలిసికొనవలయును. అధికముగ వాఙ్మయగుచో వానికడకుఁబోయి వానినిఁ బ్రశంసింప వలయును. అతనిని శ్రేష్ఠుడగు దాతయని పలుకవలెను. మూఁడవ విషయము దాతయొక్క వంశము వారిదివరలో నిర్ధనులును, భిక్షగాండ్రు నైనప్పటికిని, రాక్షసులవలెఁ గ్రూరులుగ నుండినను వారి నత్యధి కముగఁ బ్రశంసింప వలయును. దానివలన నాతనికి కులీనతాభి మానము జాగృతిని జెందును. నాల్గవ విషయము - స్వయముగ దాతను మధుర శబ్దములతో నాతఁడొనర్చిన కార్యములను గోరంత లను గొండంతలుగఁ బ్రశంసింప వలయును. ఇట్టికార్యముల నింకె వరు చేయఁగలరన వలయును. ఐదవవిషయము-తనకీ వస్తువు కావలయునను తనయభిప్రాయములను వెంటనే చెప్పరాదు. గొప్ప భూమిక నేర్పాటు చేసికొని చివరకుఁ బ్రసంగము రాఁగానే సరళతలోఁ దనకుఁ గావలసిన దానిని బయటపెట్టవలయును. చివ రకు నాకీవస్తువు ముఖ్యముగఁ గావలసియున్నది. అదియెచ్చటనైన లభించినచో మీకడకు వచ్చి శ్రమపెట్టువాఁడను గాననవలెను.

ఆఱవ విషయ మేమనఁగా- మొదటి నుండియును లోభముగ నుండరాదు. ఈవస్తువు నాకవసరము లేకుండిన నేనడిగెడు వాఁడనే కానని ముందుగాఁ దన నిస్పృహతను వెల్లడింపవలయును. తన

త్యాగవృత్తిని బ్రశంసించుచు దాతను దనవైపున కాకర్షింప వల యును. ఈవిషయముల నన్నిటిని దృష్టిలోఁ బెట్టుకొని యాచకుఁడు దాతయును నుదారుఁడు నగువానిని యాచించినచో నాతని యాచన యెన్నటికిని విఫలము కాదు. ఉత్తమ భిక్షుకుఁడు యథాశక్తిగ లోభివాని నెన్నటికిని నడుఁగరాదు. కృపణుఁ డొకవేళ యిచ్చినను బదిచోటులం దప యశస్సును గావించును. శ్రేష్ఠుఁడగువాఁడు లేదన్నను నాతఁడు చాల సిగ్గుపడును. ఈ విషయమును భిక్షుకులకు శిక్షన మొసంగుటకే భగవానుఁడు భిక్షుక వేషము ధరించినాఁడు.

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా! బలిచక్రవర్తి అత్యంతో దారతతో వటువగు వామనునితోఁ గోరిన వస్తువు నడుగ వచ్చునని బలవంత పెట్టఁగా నాతని నుబ్బించుటకై భిక్షుకుఁడగు భగవానుఁడు భిక్షగానియొక్క సమస్త లీలలను బ్రదర్శించుచుండెను. ఈ సమ యమున బలిచక్రవర్తి శుక్రాచార్యుని గుప్పిటలో నున్నాఁడని గ్రహించెను. ఈతఁ డాతఁడేమి చెప్పిన దానినిఁ జేయును. అందు వలన ముందుగా నాతఁడు శుక్రాచార్యునిఁ బ్రశంసించుచు నిట్లనెను:- రాజా! నీవు ధన్యుఁడవు మేము నిన్ను గూర్చిన ప్రశంసను వినిన దానికంటె నెక్కుడుగనున్నది. ఏలనుండదు? ఎవనియొక్క సమ్మతి దాత, పురోహితుఁడు, గురువు, సమస్తైహ లౌకిక పారలౌకిక కార్య ములను జేయించు వాఁడునగు భృగునందనుఁడు శుక్రాచార్యులై యున్నారో నీమాటలు దాని కనురూపముగనే యున్నవి. సేవకుని వ్యవహారమును గాంచి స్వామి వ్యవహారమును దెలిసికొన వచ్చును.

శిష్యుని యోగ్యతను బట్టి గురువుయొక్క యోగ్యత నూహింపవలసి యున్నది. ఒక భిక్షుకుని సమ్ముఖమున నిట్టి యుదార, మధుర, నిశ్చల వచనములను శుక్రాచార్యుని శిష్యులే పలుకఁగలరు. అనులీన శిష్యుఁడై యుండినచో గుర్వాజ్ఞను మన్నింపఁడు నీ కులము విషయమున జెప్పవలసిన దేమున్నది ?"

అత్యంత నమ్రుఁడై లజ్జించుచు బలిచక్రవర్తి యిట్లనెను :- "ప్రభూ ! నేను మీ బ్రాహ్మణులకు దాసుఁడను"

అత్యంతోల్లాస స్వరమున వామన వటు విట్లనెను :- "మహారాజా ! ఇట్టినమ్రత అకులీనులకు రానేరాదు. నీవు బ్రాహ్మణ సేవకుఁడవు ఇందాశ్చర్య మేమియును లేదు. బ్రాహ్మణుల నిమిత్తమై తన ప్రాణముల నొసంగిన వీరోచనునకు నీవు పుత్రుఁడవు."

వీరోచన మహారాజు గొప్పతేజస్వి, యశస్వి, శూరవీరుఁడు, దాత, ధనుర్వేద విశారదుఁడు ఆతఁడు దన బాహుబలముచే స్వర్గమును జయించెను. దేవతలను స్వర్గమునుండి తరిమివైచెను. ఆతఁడు త్రిలోకములను శాసించెను. ఆతనికడ కెప్పుడు వచ్చి బ్రాహ్మణు లేవస్తువును యాచించినను వెంటనే యిచ్చెడువాఁడు ఆతనికడ బ్రాహ్మణుల కీయరాని వస్తువనునది లేదు. సురగణ మాతని జయింపఁజాలక కపటముతో జయింపఁ దలఁచిరి. ఇంద్రాది దేవతలు బ్రాహ్మణ వేషములను ధరించి ఆతనికడకు వచ్చిరి బ్రాహ్మణ భక్తుఁడగు వీరోచనుఁడు వారికి యథేష్టముగ స్వాగత సత్కారము లొనర్చి, వారు యథార్థమగు బ్రాహ్మణులు కారనియు, తమకు

శత్రువులగు దేవతలు బ్రాహ్మణ వేషములను ధరించి తనకడకు వచ్చిరనియుఁ దెలిసికొన్నను నాతఁడిట్లనుకొనెను :- "వీరెవరైనఁ గానిండు, బ్రాహ్మణ వేషములను ధరించి నా కడకు వచ్చినారు, కావున వీరిని నేను బ్రాహ్మణులకు వలె స్వాగత సత్కారము లొనర్పవలయును." ఇట్లాలోచించి వారిని విధ్యుక్తముగఁ బూజించి చివరకిట్లనెను :- "బ్రాహ్మణులారా ! మీ రేప్రయోజనము కొరకై నాకడకు వచ్చితిరో దానిని జెప్పుడు, నేను మీ కేప్రియకార్య మొనర్పవలయును."

వారిలో బ్రాహ్మణ వేషమును ధరించిన సహస్రాక్షుఁడగు నింద్రుఁడిట్లనెను :-"రాజా ! మా కోరికను నెరవేర్చెదనని మీరు మాటనీయవలెను అట్లైననే మేము మిమ్ము యాచించెదము."

అంత వీరోచన మహారాజిట్లనెను :- "బ్రాహ్మణులారా ! మీరు నాయందింత టవిశ్వాసమేల కలిగియున్నారు మీరడుగఁ దలఁచిన దేమో నిస్సంకోచముగ నడుగవచ్చును. నా వద్ద బ్రాహ్మ ణుల కీయరాని వస్తువేమియును లేదు."

ఇది విని యింద్రుఁడిట్లనెను :-"రాజా ! మేము మీ మిగిలిన ఆయువును గోరుచున్నాము. మాకు మీ జీవితము నొసంగుడు."

అత్యంత హర్షముతో బ్రాహ్మణ భక్తుఁడగు వీరోచనమహారా జిట్లనెను:- "బ్రాహ్మణులారా ! నేఁడు నేను కృతార్థుడనైతిని. నా

జీవితము ధన్యమైనది. అది బ్రాహ్మణులకు పనికివచ్చినది. నేను నా జీవన ప్రాణములను సహర్షముగ మీకు సమర్పించుచున్నాను."

వామనవటువిట్లనెను :- "రాజా! ఇట్లు పలికి యాతఁడింద్రుని నెఱిఁగియును తన జీవితమొసంగెను. అతని వీర్యము నుండి నీవు పుట్టితివి. తండ్రియే పుత్రుఁడై యుద్భవించును. తండ్రియొక్క ఆత్మయే పుత్రరూపమునఁ బరిణమించును. నీవును సంతతి బ్రాహ్మణభక్తుఁడవే, ఈ విషయమున నాశ్చర్యమును బొందవలసిన పనిలేదు. ఏలయనఁగా నీవు పరమభక్తుడవు, యశస్వివి, అసురాధిపుఁడగు వీరోచనుని పుత్రుఁడవు."

సిగ్గుతో బలి యిట్లనెను :- స్వామీ ! నే నాతని చరణ ధూళితోనైన సరిపోలఁజాలను. నాకట్టి గుణము నూర్లకొలది జన్మముల కైనను రాఁజాలదు."

వామనవటువు వికసితుఁడై యిట్లనెను :- "రాజా ! నీవట్టి పలుకులను బలుకకుము. మీ కులములో నందఱును నిట్టివారే వారందఱలో గుణములుకలవు. అందఱును నేకమై నీలో ఘనీభూతులైరి. నీ తండ్రియగుఁ బ్రహ్లాదునిగూర్చి చెప్పుట దీపముతో సూర్యుని జూపించుటయగును. భగవంతుని గుణములవలె నాతని గుణములును సర్వత్ర కీర్తింపబడుచుండును. భగవంతుని యశము వలె లోకములో నాతని యశస్సును వ్యాపించియున్నది. ఆతఁడు భక్తలోకైకాగ్రణి. పూజనీయుఁడు, ఆదర్శమూర్తి, ఏ కులమందు భక్త శిరోమణియగు బ్రహ్లాదుఁడు ప్రకాశించుచున్నాఁడో,

తన నిర్మల నిష్కళంక సుయశముచేఁ బ్రపంచమందు సూర్యుని వలె దేదీప్యమాన మగుచున్నాఁడో రాజా! ఆ కులమందే నీవు జన్మించితివి. ఆ ప్రహ్లాదుఁడు నీ తండ్రికి తండ్రి. పౌత్రునకా గుణము లేలరావు మీకు బ్రాహ్మణ భక్త్యాదిసద్గుణములు కులపరం పరచే బైతృక సంపత్తియైయున్నది. మీపూర్వజులు బ్రాహ్మణులకు దానమొసంగుటలో శూర వీరులు. అంతేకాదు. వీరుఁడననుకొను యోధుఁడెవఁడును వచ్చి రణమును యాచించి యూరకపోయిన వారెవరును లేరు. శుభ పర్వమందుగాని, యుద్ధస్థలమందుగాని వచ్చి ధనమును గాని, యుద్ధమును గాని యాచించినచో నీతండ్రి గాని, తాతలు గాని, ముత్తాతలుగాని వెనుకాడలేదు వారి సమ్ముఖము నకు వచ్చినపు డెవరును నిరాశులై పోలేదు. అట్టి యెడ నేనేల నిరాశుఁడనై పోఁగలను.

బలి యిట్లనెను :- "ద్విజవరా! మిమ్ములను జూడఁగా చిన్న వారుగా నున్నారు. మా యీ విషయములన్నియును మీకెట్లు తెలిసినవి? మాతండ్రి, తాతల, ముత్తాతల విషయములన్నియును మీకుఁదెలిసినవి. చూడఁగా మీరు సర్వజ్ఞులుగఁ గనఁబడుచున్నారు'

నవ్వి వామనవటు విట్లనెను :- "రాజా! ఇందులో సర్వజ్ఞత యేమున్నది? సూర్య, చంద్ర, పృథివీ, సముద్ర హిమాలయముల నెట్లందఱెఱుగుదురో అట్లే వంశవిఖ్యాతియును జగద్విదితమే. ఈ ప్రపంచమంతయును మీయశస్సుచే నిండియున్నది. రాజా! శూర వీరులును, పరాక్రమవంతులును, యశస్వులును, విశ్వ విజయులును

నైన నీతండ్రియును, తాతయును, ముత్తాతలును మిగిలినవారి సంగతియేల వారు విష్ణువును గూడ మెప్పించినవారు. నీవు అనేక సార్లు శుక్రాచార్యాదుల వలనను, ప్రాచీన ఋషిమునుల వలనను వారి యితిహాసమును వినియేయుందువు. ఆ విషయములోఁ గొంత వరకు నేను జెప్పెదను. నీవు సావధానముగ వినవలెను. సంకోచింపవలదు. వారిచరిత్రములను వినిన నీకును లాభము కలుగఁ గలదు."

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా ! ఇట్లుపలికి కపట వామనుఁడు బలినిఁ బొగడుటకును, ఆతని ప్రపితామహులను ప్రశంసించుట కుద్యమించెను.

.....

## వామనుడు బలియొక్క ప్రపితామహులఁ ప్రశంసించుట

శ్లో॥ యతోజాతో హిరణ్యాక్షశ్చరన్నేక ఇమాం మహీమ్
ప్రతివీర దిగ్విజయే నావిందత గదాయుధః ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౯ అ. ౫ శ్లో॥

వ. తొల్లి మీ మూడవ తాత హిరణ్యాక్షుండు విశ్వవిజయంబు సేసి గధాయుధుండై భూతలంబునఁ బ్రతివీరులంగానక సంచరించె.

శ్రీమదాంధ్ర భాగవతము.

వంశపరంపరా ప్రభావము కొలఁదిగనో గొప్పగనో తప్పక యుండును. తన పూర్వజుల కీర్తి యశములను, గార్యములను స్మరించుటచేతను, శ్రవణమొనర్చుటచేతను దనకును నుత్తేజము కలుగును. కావుననే యుద్ధములో నేను ఫలాని వంశము వాఁడనని తమలోఁ జాము కవ్వించుకొనుచుందురు. సూత, మాగధ, వందీ గణము వారి పూర్వజుల యశమును గానమొనర్చుచుందురు. దాని మూలమున వారి ప్రభావమును స్మరించి ప్రాణపణముగ యుద్ధము చేయుదురు. కులము వారు చేసిన కార్యములను స్మరించుటచేఁ బిరికివారి ధమనులందును వీరరక్తము వేగముతో సంచార మొనర్చును. ఈ విషయమున నొక ప్రాచీన కథకలదు.

ఇద్దరు ఒక విషయమునఁ బోరాడు కొనుచుండిరి. వారిలో నొకఁడు వైశ్యుఁడుఁ రెండవవాఁడు క్షత్రియుఁడు. వైశ్యుడు హృష్ట పుష్టముగను లావుగ స్థూలకాయుఁడుగ నుండెను. రెండవవాఁడు క్షత్రియుడు దుర్బలుఁడు,సన్నని వాఁడు,నిర్బలుఁడుఁ క్షీణకాయుడు మాటలలోఁ జేతులు కలియు స్థితివచ్చెను. వైశ్యుఁడు బలవంతుఁడు స్థూలకాయుడు ఆతఁడు క్షత్రియునిఁ గ్రిందపడవైచి, వాని రొమ్ము మీఁదఁ గూర్చుండి మిక్కిలి గర్వముతో నిప్పుడేమనెదవో చెప్పుము."

దుర్బలుఁడగు వాఁడింతటి లావుమనుష్యుని భారమును సహింపఁ జాలక పోయెను. ఆతని ప్రాణము లవసిపోయెను. క్షమా పణమును గోరుకొనుట కాతఁడు క్రిందనే పడియుండి మిక్కిలి స్నేహముతో నిట్లనెను:- "సోదరా! నీవేజాతివాడవు. నీజన్మ యే కులములో నైనది?"

జయించినవాఁడు సింహమువలెనగును. విజయోల్లాసమున గర్వముతో నిట్లనెను:- మేము వైశ్యులము. ఏమిచేసెదవో చెప్పుము.

ఇది వినఁగానే క్షత్రియుని ధమనులయందు జాతిగతమగు వీరత్వము సంచారమయ్యెను. గద్దించి అతఁడిట్లనెను:- "ఓరీ కోమటీ! ధనమందును, వ్యాపార బుద్ధియందు నీవు నన్ను జయించిన జయింతువుగాని శారీరకబలములో నీవు నన్నెట్లు జయింపఁగలవురా? ఇట్లు పలికి అతఁడు వెంటనే వానినిఁ గ్రిందబడవైచి క్షత్రియుఁడు పైనఁగూర్చుండెను, అందఱును దీనినిఁగాంచి నవ్వి యిట్లనిరి :- కులాగతముగ వచ్చు ప్రభావ ముండితీరును."

శ్రీ శుకదేవుడు పరీక్షన్మహారాజుతో నిట్లనెను:- "రాజా! బలికి నుత్సాహము గలిగించుటకై వామనుఁడాతని తండ్రి, తాతల ప్రశంస లొనర్పఁగా బలి యుత్సాహమును జెందుచున్నాఁడని తెలిసికొని, యిప్పుడాతఁడు ప్రపితామహులను బ్రశంసించుచుండెను. వామనుఁ డిట్లనెను :- "రాజా మీ వంశము సాక్షాత్తుగ బ్రహ్మనుండి ఆరంభ మైనది. బ్రహ్మ మానసపుత్రుఁడు కశ్యపుఁడు. ఆతనికి దితి. అదితి మొదలైనవారు పదుముగ్గురు పత్నులుకలరు. తపస్వియగు ఋషి, ఈ సమస్త స్థావరజంగమ దృశ్యజగత్తు ఆతని సృష్టి. ఆతఁడు బ్రహ్మవలె రెండవ ప్రజాపతి. ఆతనికి దితియను భార్యయందు హిరణ్యకశిపు హిరణ్యాక్షులను నిద్దరాదిదైత్యు లుదయించిరి. వారే నీకు ప్రథమ పూర్వజులు. హిరణ్యకశిపుని పుత్రుఁడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదునకు విరోచనుఁడు, విరోచనునకు నీవు. నీకున్ను నీవంటి

తేజస్వులును, యశస్వులును, దాతలును, శివభక్తులైన బాణాదులు నూర్వురు పుత్రులు కలరు. నీ కులమందు శూరత్వము, దానము, వీరత్వము పూర్వమునుండియును బరంపరాగతముగ వచ్చుచున్నది. నీ తండ్రి, తాతలయొక్క దానశీలతయు. వీరత్వమును, భక్తిని గూర్చి యతికించిద్దిగ్దర్శనముగ జెప్పితిని. ఇప్పుడు నీవు నీ ప్రపితామహుల విషయమును వినుము."

నీప్రపితామహు లిద్దరిలో హిరణ్యకశిపుడు పెద్దవాడు. హిరణ్యాక్షుడు చిన్నవాడు. హిరణ్యాక్షు డతి శూరుడు. ప్రపంచమం దాతనితో దలపడు వా డట్లుండనిండు, ఆతని సమ్ముఖమున నిల్చుండగలవాడును లేకుండెను. ఇంద్రాది లోకపాలురు ఆతని నామమును వినగానే గడగడ వణకుచుండెడు వారు. ఆతడు చేతిలో గదను బట్టుకొని సమస్తలోకమున దిగ్విజయమును జెందుటకు వెడలెను. అందఱను యుద్ధమునకు బిలిచెనుగాని యందఱును. బాదముల మీదబడి క్షమింపవేడుకొనిరి. సాక్షాద్విష్ణువునకు గూడ ఆతనితో బోర సాహసము లేకపోయెను. వంది రూపమును ధరించి ఆతని భయమునకు బాతాళమున దాగెను. ఆ వీరు డాతనిని వెదుకుకొనుచు బాతాళమునకుగూడ పోయెను. ఏలయనగా యుద్ధము కొఱకాతని చేయి దురదయెత్తుచుండెను. అప్పుడిద్దరును దలపడిరి. ఈ యసురవర వీరుడు సూకర వేషధారియగు విష్ణువును నొప్పించెను. ఏదో విధముగ నాతడు చంపబడినను నాతని బలమును

స్మరించుచు విష్ణువు తనను బరాజితుని గనే భావించెను. విష్ణువు సర్వత్ర భూరి భూరి ప్రశంస లొనర్చునట్లుగ నాతఁడు యుద్ధమందు విష్ణువును సంతుష్టపరచెను.

ఆతనియన్న హిరణ్యకశిపుఁడు తనతమ్ముని మరణమును విని చేత గదను ధరించి విష్ణువుతోఁ బోరఁబోయెను. అప్పుడు విష్ణుభగవానునకు గుండెలదరెను. బరాక్రమవంతుఁడగు నావీరుఁడు సరిగా వైకుంఠమునకుఁబోయి నేను విష్ణువును జంపిగాని తిరుగ ననెను."

ఈ వీరునితోఁ దాను జయింపఁజాలనని విష్ణువనుకొనెను. "వీనినిఁ జంపకున్న నన్ను వదలఁడు. బయట నెచ్చటనైనను దాగినచో నాతఁడు నన్ను వెదుకఁగలఁడు. ఏలయనఁగా నీతని దృష్టి బాహ్యదృష్టి" అని యిట్లాలోచించుకొని విష్ణువాతని హృదయములో దాగుకొనెను. కన్నులలోని పాపలు కన్నులనెట్లు చూడఁజాలవో అట్లే హిరణ్యకశిపుఁడు హృదయములో దాగిన విష్ణువును జూడఁజాలకపోయెను. ఆతఁడు వైకుంఠములో నలువైపులను వెదకినను విష్ణువు కనఁబడలేదు. అంతనాతఁడు పృథివిని లాగివైచెను. స్వర్గమును వెదకెను. మహర్లోక, జనలోక, తపోలోక, సత్యాదిలోకములందును, దశదిశలందును, సప్తసముద్రములందును, సప్తపాతాళములందును, సమస్తస్థానములందును వెదకెను. విష్ణువు బయటయుండినఁ గనఁబడెడువాఁడే. ఆతఁడు గడగడ వణఁకుచు, సూక్ష్మశరీరమును ధరించి హిరణ్యకశిపుని శరీరమందుఁ బ్రవేశించెను. సర్వత్ర వెదకినను విష్ణువు కనఁబడకపోఁగా నాతఁడు గర్జించి అహంకారముతో

నిట్లనెను :-"విష్ణువును నేను జయించినాను. అతఁడు నాభయమున మరణించినాఁడు. ఉండియుండినచోఁ గనఁబడెడువాఁడే." ఈ విధముగ విష్ణువు నెదుర్కొన్నవారు మీ పూర్వజులు. ఆతని పుణ్య ప్రభావముచేతనే బ్రహ్లాదునివంటి విశ్వవిఖ్యాత భగవద్భక్తుఁడాతనికిఁ బుత్రుఁడైనాఁడు. అట్లే అతనికి విరోచనునకు నొక ఋషి పుత్రునకును గొప్ప జగడము వచ్చెను. విరోచనుఁడు నేను గొప్పయనిన, ఋషి నేనే గొప్పయనెను. ఇద్దరును బ్రహ్లాదుని మధ్యవర్తిగా నెన్నుకొనిరి. ఇద్దరును బరస్పరము వారు తమ ప్రాణముల నొడ్డిరి. బ్రహ్లాదుఁడు మిక్కిలి ధర్మ సంకటములోఁబడెను, కాని ఆతఁడు సత్యధర్మములను విడువలేదు. విరోచనునికంటె ఋషి కుమారుఁడే శ్రేష్ఠుఁడని బ్రహ్లాదుఁడు నిర్భయముగ నిర్ణయము గావించెను. రాజా ! మీ కులము వారేది చెప్పఁదలఁచిరో దానినిఁ జెప్పెదురు. దేని నీయఁదలఁచెదరో దాని నిచ్చెదరు. ఇంతవరకెవరునూ నిరాశులై పోలేదు. ఎవరికిని వచనమొసంగి తప్పనులేదు.

నీవు వారికి దీసివేసినవాఁడవుకావు. నీలో వారందరయొక్క సమగ్రగుణములును సమావేశమైనవి. నీవు నీ బాహుబలముచే దేవతలను జయించి స్వర్గాధిపత్యమును సంపాదించితివి, త్రిలోకములును నీకు వశమైనవి. అయినను నీవు విషయభోగలిప్తుఁడవు కాలేదు. నిరంతరము దాన పుణ్య యజ్ఞ యాగములందు లగ్నుఁడవైనావు. సదా కల్పవృక్షమువలె యాచకుల మనోరథములను పూర్ణమొనర్చుచున్నావు. చంద్రునివలె నందఱకును శీతలతా ప్రదానమొనర్చుచున్నావు. సూర్యునివలె నందఱకును బ్రకాశ మొసంగుచున్నావు.

నీవు పృథివికంటెను సహనశీలుఁడవు. వాయువువలె భోగములందు నిర్లిప్తుఁడవు. జలములకువలె జీవులకు జీవనము. ఆకాశమువలె నిర్మలుఁడవు. ఇదంతయును గురుకృపాఫలము. నీ గురుదేవుఁడగు శుక్రాచార్యుఁడు సర్వసమర్థుఁడు నీకు హితకరమగు ధర్మమును సదా శిక్షణ మొసంగుచుండును. నీకు ధర్మమందచలితదీక్ష కలుగుట వారి శిక్షణ ఫలితమే."

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా! ఆ చిన్న వామనవటుని ముఖమున నిట్టి ధారా ప్రవాహమగు వక్తృతను విని గుణగ్రాహి యగు బలి చకితుఁడయ్యెను. ఈ మధుర భాషియగు పిల్లవానికి సర్వస్వమును దాన మొనర్పవలయునను బుద్ధికలిగెను. అందువలన మిక్కిలి యుల్లాసముతో నిట్లనెను:- "బ్రాహ్మణకుమారా! పరమ పూజనీయుడవగు వటూ! బ్రహ్మచారీ! నీవు నీ కోరికను వెల్ల డించుము. నా కోరిక నెరవేరదేమోనను శంక నేమాత్రమును బెట్టు కొనకుఁము. మీరేది యడిగినదానిని నేను సంకోచింపక యీయఁ గలను. నీవు సంకోచమును వదలి నీ యిచ్ఛననుసరించి వస్తువు నడుగుఁము."

శ్రీశుకదేవుఁ డిట్లనెను :- "రాజా! ఇది వినియును వటుఁ పూరకుండెను. అతఁ డేమియు నడుగలేదు. బలిచక్రవర్తి మాటి మాటికిని నడుగుఁడని బలవంత మొనర్చు చుండెను."

# వామనుఁడు బలిని మూఁడడుగు లడుగుట

శ్లో॥ తస్మాత్త్వత్తో మహీమీష ద్వృణేఽహం వరదర్షభాత్ ।
వదాని త్రీణి దైత్యేంద్ర సమ్మితాని పదా మమ ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౯ అ. ౧౬ శ్లో॥

ఆ. నీవు రాజవనుచు నిఖిలంబు నడుగుట
దగవు గాదు నాకుఁ దగిన కొలఁది
యేను వేఁడికొనిన యీ పదత్రయమును
జాలదనక యిమ్ము చాలుఁజాలు ॥

శ్రీమదాంధ్ర భాగవతము.

గొప్పవారికడ నల్పవస్తువును యాచించుట అవమాన మొన ర్చుటయే; కాని అడుగు యాచకుఁడు కపటియై, వ్రేలినిఁ బట్టుకొని తర్వాత జేతినిఁ బట్టుకొనుటకుఁ బ్రయత్నించినచో గొప్పవారు సంకటములోఁ బడిపోవుదురు. వానిగతి సర్పము, చుంచువలె నగును. మ్రింగుటకును వీలులేదు. క్రక్కుటకును వీలులేదు. ఈ విధముగఁబలికి, మాట యిచ్చిన తరువాత వారు అవుననలేరు, కాదనలేరు. కాని మనస్వియు జ్ఞానియు నగువారు ప్రాణముండఁగాఁ బ్రతిజ్ఞను వీడఁ జాలరు. అప్పుడే వారికీర్తి ప్రపంచమున నమర మగును. వారు పరాజితులైనను విజయులే.

శ్రీశుకదేవుఁడిట్లనెను :- రాజా ! బలిచక్రవర్తి మాటిమాటికిని వామన వటువును వాంఛిత వస్తువు నడుగుఁడని బలవంత మొనర్పఁగా నాతఁడు బలిచక్రవర్తితో నిట్లనెను :- "దైత్యేంద్రా ! నీవు వరదాతలలో విఖ్యాతుఁడవు. త్రిలోకములందును నీయొక్క విమల ధవళ కీర్తి వ్యాపించియున్నది. సర్వత్ర నీ దానము విషయమునఁ బ్రసిద్ధి కలదు. అందువలననే నేనును నిన్ను గొంచెముగ నడుగుటకు వచ్చియున్నాను."

ఇది విని యుల్లాసముతో బలి యిట్లనెను :- "సరియే అడుగుము. బ్రాహ్మణోత్తమా ! నీకిష్టము వచ్చిన దడుగుమని నేనెంత సేపటి నుండియో ప్రార్థించుట లేదా ?"

వటు విట్లనెను :- "నాకు కొంచెముగ భూమి నీయవలయును." బలి అత్యంత హర్షముతో నిట్లనెను :- "స్వామీ ! ఈ భూమినంతయును మీదియే.

వామనుఁ డిట్లనెను :- "రాజా! నేను లోభియగు బ్రాహ్మణుఁడను గాను. నాకు కావలసిన దానికంటె నెక్కుడుగ సంగ్రహింపను నాకు నా కాలియడుగు కొలతతో మూఁడడుగులు కొలిచి దానమిమ్ము."

ఇది విని బలి చక్రవర్తి పక పక నవ్వి యిట్లనెను:-"పిల్లల బుద్ధి పిదపబుద్ధియను పెద్దల వాక్య మసత్యము కాదు. మాటలలో మీరు పెద్దవారిని మించిపోయినారు. కాని పిల్లతనపు చేష్ట లెచ్చటికి పోఁగలవు ? మీ స్వార్థ విషయమున మీ రబోధ శిశువువలె నైతిరి.

అయ్యో! యాచనలో నావంటి చక్రవర్తిని మంచి మంచి యుక్తుల తోడను, మధుర వాక్కులతోడను ప్రసన్నునిఁ గావించుకొని మూఁడడుగుల భూమి నడుగుటేమిటి? సమస్త పృథివి నడుగ వచ్చునే, అడిగి అడిగి మూఁడడుగు లడుగుటయా?

ఇది విని వామనవటు విట్లనెను:- "రాజా! యాచన అన్నిటి కంటె నికృష్టకార్యము. ఋషులు దానమును గ్రహించుట కూడ దనిరి వా రపరిగ్రహ వ్రతమును గూర్చి భూరి భూరి ప్రశంసలొనర్చిరి. ఒకవేళ యాచింపక తప్పకున్నచో దానమును గ్రహింప వలసి వచ్చినచోఁ గష్టముగ జీవనము గడుచునంత మాత్రమే గ్రహింప వలయును. ఈ నియమమున నావశ్యక వస్తువును దానముగ గ్రహించిన నేవిధమగు దోషమును నంటదు."

బలి యిట్లనెను:- "మంచిది. ఇది బాగుగనేయున్నది. కాని దానిలో మూఁడడుగుల నేలతో నేమగును? మీరువరుండనైనబరుండ లేరుకదా! కష్టము గాక మీకు లభించిన దేముండును. మీకు కష్టము కలుగఁగానే మరల నాకడకు వచ్చి యిట్లనెదరు:- "ఈ కొంచెమున నాకు జరుగుటలేదు. ఇంక మూఁడు బారలీయ వలయును." దాని తోడను మీకు పనిజరుగదు అగ్నిహోత్రము నెచ్చటఁ బెట్టుకొందురు? ఆవు నెచ్చటఁ గట్టివైచుకొందురు? బావి నెచ్చట త్రవ్వించు కొందురు? చెట్ల నెచ్చట నాటుకొందురు? కథాప్రవచనములకు పీఠ మెచ్చట నేర్పాటు చేయుదురు? విద్యార్థులు వచ్చినచో వారి కెచ్చటఁ జదువును జెప్పెదరు? మరల మీరు నాకడకు రావలసినదే. ఇట్లు

మాటి మాటికి నడుగుటకంటె మీరొక్కసారియే యథేచ్ఛగా నడు గుడు. నేను దానమొసంగు నప్పుడీ విషయము నెక్కుడు శ్రద్ధతోఁ జూచుచుందును. అన్నిటికంటె మిక్కిలి తక్కువ దాన మేమనఁగా నా యాచకుఁడు మరల నింకెవరి కడకును వాని జీవితములోఁబోయి యాచింపరాదు; చేయి జాపరాదు. మీరింక నెక్కుడుగ భూమి నడుగుఁడు. మీ పాదములు చూచినఁ జిన్నవిగ నున్నవి. వీనితోఁ గొలిచిన నెంతటి భూమి రాఁగలదు?''

ఇది విని వామనుఁ డిట్లనెను:-''రాజా! మనుష్యులందఱును దమ చేతులతోఁ దొంబది యాఱంగుళములుందురు. పెద్దవారికి పెద్ద వ్రేళ్ళుండును. చిన్నవాండ్రకు జిన్నవ్రేళ్ళుండును. నాకూరక కూర్చుండి జప మొనర్చుకొనుటకే భూమి చాలును. ఇతరుల స్థలములోఁ గూర్చుండి జపతపము లొనర్చిన నందులో సగము భాగము వారికిఁ బోవును. కావున నాకుఁ గేవలము కూర్చుండుటకు మాత్రమే భూమి కావలయును.''

బలి యిట్లనెను:- 'స్వామీ! ఇదంతయును సత్యమే. కాని పూర్ణ సంతుష్టినిఁ జెందు నంతటి భూమిని కోరుకొనుడు.'

అంత వామనుఁడిట్లనెను:- 'రాజా! పృథివివలన సంతుష్టినిఁ జెందినవారెవరో ఒక్కరిపేరును నాకు జెప్పుము. మూఁడడుగులతో సంతుష్టినిఁ జెందనివాఁడు, సప్త ద్వీపయుతమును, నవఖండ మండితమునగు నీ పృథివినంతను బడసినను సంతుష్టినిఁ జెందఁజాలఁడు మనువగు ప్రియవ్రతుఁడు, గయుఁడుఁ భగీరథుఁడు, రావణుఁడు, హిరణ్యకశిపుఁడు, మొదలగు గొప్ప గొప్ప తేజస్వులును ప్రతాప

శాలురును రాజులెందరో యుండిరి. వీరందఱును సప్త ద్వీపాధిపతులే, సప్తసముద్ర యుతమగు నీవసుంధరయందు వారి యాజ్ఞ మన్నింపఁబడు చుండెడిది. కాని వారును జివరకు తృష్ణకు వశీభూతులై పృథివికొఱకు పోరాడుచుండిరి. వారి తృష్ణ శాంతింపలేదు. ఈ విషయముఁ నెంతగా ననుభవించిన నంతగాఁ దృష్ణ పెరుగును. యయాతి మహారాజు తన వృద్ధావస్థను దన పుత్రునకొసంగి, ఆతని యువావస్థతో భోగముల ననుభవించెను. చివరకాతఁడిట్లు చెప్పినాఁడు:- 'విషయముల ప్రచురతలో సుఖములేదు, శాంతిలేదు, సంతోషము లేదు, తృప్తిలేదు. వాని నుప భోగించుటచేఁ దృష్ణ అధికాధికముగఁ బెరుగుచుండును. కావున రాజా! నేను మూఁడడుగుల భూమికి మించి నధికముగ గ్రహింపను. నాకిదియే బ్రహ్మాండము.'

బలి యిట్లనెను :- "స్వామీ! నాకేమియును నిబ్బందిలేదు, మీరు మూఁడడుగులు గైకొనుఁడు. మూఁడులోకములను గైకొనుఁడు. నేనన్నిటికిని సిద్ధముగనే యున్నాను. కాని అది నా పదప్రతిష్ఠకు విరుద్ధమగు విషయము. మీరు చిన్నవారు, చిన్న వస్తువునడుగుటకు సంకోచింపరు. కాని యిది నాకు మాత్రమవమాన కరమగు విషయము. మీరు నా కనురూపమగు దానము నడుగుఁడు.

కపటియగు వామను డిట్లనెను :-"రాజా! నేను బ్రాహ్మణుఁడను. బ్రాహ్మణునకు ముఖ్యధనము సంతోషము. బ్రాహ్మణుఁడావశ్యకతను మించిన వస్తువులను సంగ్రహించినను, లోభము

పెరిగినను వానికి పతన మనివార్యము. బ్రాహ్మణుఁడు లభించిన దానితో సంతుష్టినిఁ జెందవలయును. నీటి వలన నగ్ని చల్లారినట్లు, అసంతోషముచే బ్రాహ్మణుని తేజము నశించును. నాకు సర్వమును మూఁడడుగులే యగుచుండఁగా నేనధికముగ నేల యాచింపవలయును? అధికముగ సంగ్రహించి పాపభాగి నేల కావలయును ?

దైత్యరాజగు బలి, బాలకుని యీ హఠమును గాంచి యిట్లనెను,-"ప్రపంచములో మూఁడు హఠములు ప్రసిద్ధములు. రాజహఠము, స్త్రీహఠము, బాలహఠము నేను రాజునుగాఁబట్టి నాహఠము నాకు తెలియదు. నారాణి పతివ్రత కాఁబట్టి ఆమె నాతో నెన్నడూ హఠమును గావింపదు. సదా నాతోడనే కలిసిమెలసి యుండును కావున దాని విషయమునను నాకనుభవము లేదు. కాని బాలహఠమును నేను ప్రత్యక్షముగ నేఁడు చూచితిని. నాల్గంగుళములుకలిగి చిన్న చిన్న కమల దళములవలె నున్నవీ బ్రాహ్మణకుమారుని చరణములు. వానితోఁ గొలుచుకొని యీతఁడు పృథివిని గైకొనదలచుచున్నాఁడు. అవియైనను లక్ష, రెండు లక్షలు, వేయి రెండువేల యడుగులు కాదు. కేవలము మూఁడడుగులకు మాత్రము కోరుకొనుచున్నాఁడు నా కిచ్చుటకును సిగ్గగుచున్నది. చెప్పుకొనుటకును సిగ్గగుచున్నది. అంత వామనునితో నిట్లనెను :-"బ్రహ్మచారీ! నాయనా! ఇంకఁ గొంచెమడుగుఁడు."

హఠపూర్వకముగఁ గపటీయగు బ్రాహ్మణుఁడిట్లనెను :- "రాజా! నావని దీనితోడనే తీరిపోగలదు. ఏలయనఁగా దనకెంత కావలయునో అంతయే అర్థసంగ్రహ మొనర్చుట ఉచితము. ధర్మసంగతము, న్యాయము."

నవ్వి బలి యిట్లనెను :- "మంచిది స్వామీ! గ్రైకొనుఁడు. మూఁడడుగుల పృథివిని. కాని, కొలుచుకొనునప్పుడు కొంచెము సాగవలయును."

వటువగు వామనుఁడు నవ్వుచు నుపేక్షాస్వరమున నిట్లనెను :- "అట్లైనఁ జూతములెండు, నీవు ముందు సంకల్ప మొనర్పుము. తర్వాత నేమి కాఁగలదో తరువాత నీవే చూడఁగలవు."

శ్రీశుక దేవుఁడిట్లనెను :- "రాజా! వామనుని యీ మాటలను విని బలిచక్రవర్తి ఆతనికిఁ బృథివి నొసంగుట కుద్యుక్తుఁడయ్యెను. శుక్రాచార్యునకీ వటు వామనుని యథార్థరూపము తెలియును. ఈతఁడు మోసగించుచున్నాఁడని ఆతని కిదివరకే తెలియును. ఈతఁడు తన శిష్యుని సర్వస్వమును హరింపదలచుచున్నాఁడని బలిని సంకల్ప మొనర్చుటను విరమింప జేయుటకై ఆతనికి నీతిని బోధింపఁదలఁచెను."

.....

## శుక్రాచార్యుఁడు శిష్యున కుపదేశించుట

శ్లో॥ ఏషతే స్థానమైశ్వర్యం శ్రియం తేజోయశః శ్రుతమ్ ।
దాస్యత్యాచ్ఛిద్య శక్రాయ మాయామాణవకో హరిః ॥
శ్రీభాగ. ౮ స్కం. ౧౯ అ. ౩౨ శ్లో॥

సీ॥ దనుజేంద్ర యాతఁడు ధరణీసురుఁడు గాఁడు
దేవకార్యంబు సాధించుకొఱకు
హరి విష్ణుఁడవ్యయుం డదితి గర్భంబునఁ
గశ్యపసూనుఁడై కలిగెనకట।

శ్రీమదాంధ్ర భాగవతము

యజమాని హితముకొఱకు ముందుండువాఁడే పురోహితుఁడు. యజమాని పురోహిత సంబంధము పితాపుత్ర సంబంధమువంటిదిగ నుండును. పురోహితుని పుత్రపుత్రికలతో నన్న చెల్లెండ్ర సంబంధ ముండును. యజమాను నింటినిఁ బురోహితుఁడు తన యిల్లుగా భావించును. ఆతని హితము కొఱకు సదా తత్పరత వహించి యుండును. యజమానుఁడును బురోహితు నడుగక ఇహలోక పరలోక సంబంధములగు కార్యముల నొనర్పఁడు. తండ్రి యాజ్ఞల నైనను దిరస్కరింపవచ్చునుగాని పురోహితుని ఆజ్ఞలను దిరస్కరించుట అసంభవము. వశిష్ఠమహర్షి తన యజమానుఁడగు మహారాజుతో నీపుత్రుఁడు ధర్మవిరుద్ధముగ శ్రాద్ధపదార్థమునుండి కొంత తినినాఁడు. కావున వీనిని నీరాజ్యమునుండి వెడలనడుపుము." అనెను, ఇంతటి చిన్న అపరాధమునకై తన రాజ్యమున కధికారి యగు యువరాజును శాశ్వతముఁగ దేశభ్రష్టు నొనర్ప నేమంత న్యాయము ?" కాని దీని నడుగువారెవరు ? పురోహితుని యాజ్ఞకు విరుద్ధముగ మాట్లాడువాఁడెవఁడు ?" రాజాతని వెడలఁగొట్టెను. ఇంతకుఁ జెప్పఁ దలఁచిన సారాంశమేమనఁగా యజమానుఁడు పురో

హితుని సమస్తాజ్ఞలను నను నచ అనకయే పాలనజేసెడువాఁడు. పురోహితుఁడును దన తపస్తేజములచే నిరంతరము యజమానుని హితమునే కాంక్షించుచుండును, ఆతని యున్నతినిఁ దన యున్నతిగను, ఆతని అవనతినిఁ దన యవనతిగను దలఁచెడువాఁడు. అందువలన నీ సంబంధము మిక్కిలి పవిత్రమైనదిగ నెన్నఁబడుచున్నది. కాలక్రమముననీసంబంధము లోపించెను.

శ్రీ శుకదేవుఁ డిట్లనెను :- "రాజా ! చాల సేపటి వరకు వాదవివాదములు జరుగఁగా వామనుఁడు తన మూఁడడుగుల పృథివి మీఁదనే నిలువఁబడెను. అప్పుడు బలి చక్రవర్తి యిట్లనెను :- "మంచిది స్వామీ ! మీయిష్టము. తీసుకొనుఁడు మూఁడడుగుల నేలనే గైకొనుఁడు. నా రాజ్యములో నేచ్చటనైనను మీకిష్టము వచ్చిన చోటున మూఁడడుగులను గొలుచుకొనుఁడు. నేను జేతిలోనికి జలమును గైకొని సంకల్పమొనర్చెదను." ఇట్లు పలికి ఆతఁడు సువర్ణమయమగు ఝారీ చెంబునుండి జలమును దీసికొని శుక్రాచార్యులతో సంకల్పమును జేయించుఁదనఁగా శుక్రాచార్యుఁడు శుష్కహాసమొనర్చి యిట్లనెను :- "రాజా ! నీవేమి చేయఁబోవుచున్నావు?"

ఉల్లాసముతో బలి యిట్లనెను :- "స్వామీ ! మీరు చూచుట లేదా యీ బ్రాహ్మణ బాలకుఁడెంతటి సుందర తేజస్వి, తపస్వియో ఈతని భూదానమొనర్చుచున్నాను."

దృఢతా సర్వమున శుక్రాచార్యు డిట్లనెను :- "పనిలేదు, సంకల్పము చేయవలసిన పనిలేదు, ఈతనికి భూదాన మొనర్చుట ఉచితముకాదు."

ఇది విని బలిచక్రవర్తి నిర్ఘాంతపోయెను. దాన మొనర్చుటలో గురుదేవు డింతవర కెన్నడును గాదనలేదు. నేడిట్టి నూతనాజ్ఞ యెట్లు వచ్చినది ? విస్మితుడై దీనతాస్వరమున నిట్లనెను :- "పాపమీ బ్రాహ్మణకుమారుడు స్వయముగ మిక్కిలి సంకోచముతో జాల తక్కువ భూమినడిగినాడు. దానినైన నిచ్చుటకు మీకిష్టపడుట లేదు. కారణమేమి ?"

శుక్రాచార్యు డిట్లనెను :- "కారణమేమున్నది? బ్రాహ్మణుడైనచో నీయవచ్చును. ఈతడు మోసగాడు. కపటవేషమును దాల్చినాడు. ఈతడు విష్ణువయ్యా విష్ణువు. మరుగుజ్జువాడై నటకునివలె లీలయొనర్చుచున్నాడు. ఈతడు తన్ను దాచుకొనుచున్నాడు; కాని నావద్ద దాగగలడా ? నేనీతని చేష్టలన్నిటి నెఱుగుదును నాకీతని ఆఱవయేడు వఱకును దెలియును. ఈతడు మహా మాయావి. నీ ముత్తాతను సగము సింహము సగము నరుడై సంహరించెను. నీ చిన్నముత్తాతను శూకరమై చంపినాడు ఇప్పుడు మరుగుజ్జై నిన్ను మోసగింపవచ్చినాడు. నేను నా సమ్ముఖమున నన్యాయమును జరుగనీయను. నేను పృథివీదానము నొసంగనీయను."

బలి సరళతతో నిట్లనెను :- "ఏల వృథాగా శంకించెదరు ? ఇట్లు సందేహించుచో నందరను సందేహింపవచ్చును. ఎవరైనఁ గానిండు, భిక్షగాఁడై వచ్చినాఁడు. మూఁడడుగుల భూమినే అడుగు చున్నాఁడు. ఈయనిండు."

తనమాటను సమర్థించుకొనుచు శుక్రాచార్యుఁ డిట్లనెను :- "మూఁడడుగులే యని భావింపకుము. ఈమూఁడడుగుల తోడనే సమస్తమును గ్రహింపఁగలఁడు. మూఁడడుగుల తోడనే యీతఁడు త్రిలోకములను గొలుచుకొనఁ గలఁడు. నీయిల్లు, వాఁకిలి, యశము, ఐశ్వర్యము, ధనము, లక్ష్మి వేయేల సర్వస్వమును హరించి యీ దేవతల కొసంగ గలఁడు. నాకీతని సంగతి తెలియనిదికాదు. ఈతఁడు కశ్యపుని వీర్యమున నదితి గర్భమున నుద్భవించినాఁడు. ఈతని జన్మకు ముఖ్యోద్దేశ్యము దేవతాకార్యమును సాధించుటయే. అసురులనుండి సమస్త సంపత్తునపహరించి సురల కొసంగఁగలడు. ఈతనికేదైన నిచ్చితివా సర్వస్వమునిచ్చినవాఁడవు కాగలవు అసురులకు క్షేమము లేదు, కల్యాణములేదు, ఐశ్వర్యములేదు, వృద్ధి లేదు, రాజ్యములేదు. ఇప్పుడు దేవతలు తిరుగుచున్నట్లు తిరుగఁ గలరు. కావున నేను నాశక్తి యున్నంతవరకు దానమీయనీయను."

ఈమాటలు వినఁగానే బలికి మిక్కిలి దుఃఖము కలిగి యిట్లనెను :- "అయ్యా! ఈచిన్నపిల్లవాని ముందిట్టి రూక్షమగు పల్కులు పల్కెదరేల? పిల్లవాడు మొదట సంకోచ వశమున నడుగనే యడుగలేదు. నేనెంతో చెప్పఁగా నడిగినాఁడు అయినను

దానిని మీరడ్డగించుచున్నారు. "బ్రాహ్మణుఁడింకొక బ్రాహ్మణునిఁ గాంచి కుక్కవలె గురగురలాడుచుండు" నను సామెత నిజమైనది. ఒక్కసారి ప్రతిజ్ఞ చేసిన తరువాతఁ గాదనుటెట్లు? నే నసత్యవాదిని గావలయునని మీ యుద్దేశ్యమా? నా ప్రతిజ్ఞను నెరవేర్చకుండు మందురా?"

శుక్రాచార్యుఁడు గంభీరముగ నిట్లనెను :- "ఓయీ పిచ్చి వాఁడా! అసత్యవాదియై వచ్చిన వానికద నిజమేమి సాగును. ప్రతిజ్ఞను విఫలముచేయవచ్చిన వానికి సఫలమెట్లగును? నీవీతనికి మూఁడడుగుల భూమినొసంగుటకు ప్రతిజ్ఞ నొనర్చియుంటివి. నీకు చిన్న చిన్నగఁ గమల దళమువలెఁ గనఁబడుచున్న నీతని పాదములు కృత్రిమ పాదములు. కొలుచునప్పుడు చూడవలయును నీవు ఈ విశ్వవ్యాపకుఁడగు వటువు ఒకపాదముతో సమస్త పృథివినిఁ బాతాళ సహితముగఁగొలుచును, రెండవదానితో నాకాశ మందున్న సమస్తలోకములను గొలుచును. రెండడుగుల తోడనే యీ యూర్ధ్వాధోలోకములను విశ్వబ్రహ్మాండమును గొలిచివేయును. తర్వాత మూఁడవదానికి నీవెచ్చటఁ దేఁగలవు? నేనే అసత్యవాదిని కాఁగలను. మూఁడడుగులు దానమొసంగి యీయఁజాలకున్నచో నీవు నరకమునకుఁబోఁగలవు ప్రతిజ్ఞ నొనర్చి యీయఁజాలని వాఁడవై పాపులు వడు నరకమునఁబడి యాతనల ననుభవింపవలసి వచ్చును. అసత్యవాదివి కాఁజాలకున్నచో స్వామీ! ఇంత నేనీయఁ జాలను" అనుము. ఏదైన నొక్కటే. ఈతఁడడిగినంత నీవీయఁ జాలవు."

దీనతతో బలి యిట్లనెను :- "అట్లనకుఁడు గురుదేవా! ఇప్పుడొక్కసారి నోట వెలువడిన మాట శక్తికొలఁది పాలింపఁబడ వలయును."

శుక్రాచార్యుఁడు కసరుచు నిట్లనెను :- "ఓయీ! నీవు పిచ్చివాఁడవువలెనున్నావే? నోటి నుండి నవ్వులాటకు వెలువడిన వెన్నో వచ్చుచున్నవి మానవుఁడు తన హితమును జూచుకొనవల యును."

బలి యిట్లనెను:- "స్వామీ! మీరు మాటిమాటికిని దానము యొక్క మూలమునే హరించు మాటలను బలుకుచున్నారు. నౌక లోనికి నీరు వృద్ధియైనను, ఇంటిలో ధనము వృద్ధియైనను లోభ ముచే దానినుంచరాదు. వెదజల్లవలయును. దానమువలన ధనము వృద్ధియగును. ఈ లోకమునఁ గీర్తియును, బరలోకమున సుఖమును లభించును.

శుక్రాచార్యుఁ డిట్లనెను :- "నాయనా! ఈ విషయమును నీకు నేను మరలఁ జెప్పుచున్నాను. దానమొనర్చుట చెడ్డది కాదు కాని ముందుగ నాత్మ, తరువాతఁ బరమాత్మ. తన ఆ జీవికను రక్షణ మొనర్చుకొని మిగిలినదానిని దాన పుణ్యములకు వినియోగింప వలయును. ఇంటిలోని వారు ఆఁకలిచేఁ జచ్చుచుండునపుడు మనము దాన మొనర్చినచో నది దానమును గాదు. పుణ్యమునుగాదు. పాపము అధర్మము. తనకాశ్రితులైనవారిని ముందుగా రక్షించుట కర్తవ్యము. తన యా జీవిక నష్టమగునట్లుచేయు దానము దానము కాఁజాలదు.

నీకు ప్రతి మాసమునకు రు 100-00 నూఱు రూకలాదాయము కలదు. నీవు దానపుణ్యాదులకు దాని నుండి రు 20-00 యిరువది రూకలను ఖర్చుపెట్టి మిగిలినది గృహ కార్యములకు వినియోగించినది యుచితమే. ఒక్కసారిగా నంతయు నిచ్చివైచినచో నీవు పరివార సహితముగ నాఁకలిచేఁ జావవలసినదే, అడుగుకొని తిరుగవలసినదే. దానపుణ్యములు వదలిపోవును. స్వయముగ నితరులను యాచింపవలసి యుండును. ఇది ధర్మముకాదు, అధర్మము, ఆ జీవికాయుక్తపురుషుఁడే దాన, యజ్ఞ, తప, సత్కార్మాదుల ననుష్ఠింపఁగలఁడు."

బలి యిట్లనెను :- "తనసర్వస్వమును దాన ధర్మములకు వినియోగపడుటకంటె నింక మంచివిషయమేమున్నది ?"

శుక్రాచార్యుఁడత్యంత మమత్వముతో నిట్లనెను : "నాయనా! త్యాగులకును విరాగులకును నీ విషయము లుచితములేమో కాని గృహస్థులకివి యుచితములు కావు."

బలి యిట్లనెను :- "గృహస్థుల కేది యుచితము."

శుక్రాచార్యుఁడిట్లనెను :- "అతఁడు వ్యావహారిక ధర్మము నాశ్రయింపవలయును. ధర్మమని తెలిసికొని యేవిషయమునను హఠము చేయరాదు."

బలి యిట్లనెను :-"స్వామీ ! వ్యావహారికధర్మమేది ?"

శుక్రాచార్యుఁ డిట్లనెను :- "అయితే వినుము. నేను నీకు వ్యావహారిక ధర్మమును జెప్పెదను."

శ్రీశుక దేవుఁడిట్లనెను : "రాజా ! ఇట్లు వలికి శుక్రాచార్యుఁడు బలికి వ్యావహారిక ధర్మము నుపదేశింపసాగెను."

......

## శుక్రాచార్యుని వ్యావహారిక ధర్మము

శ్లో॥ ధర్మాయ యశసేఽర్థాయ కామాయ స్వజనాయ చ ।
పంచధా విభజన్ విత్తమిహాముత్ర చ మోదతే ॥

శ్రీభాగ. ౮ స్కం. ౧౯ అ. ౩౭ శ్లో॥

సీ॥ దనయింటఁగల సర్వ ధనమును నైదుభా
గములుగా విభజించి కామమునకు

ఆ॥ నర్థమునకు ధర్మ యశముల కాశ్రిత,
బృందములకు సమతఁబెట్టునట్టి
పురుషుఁడిందుఁబూర్ణుఁడై మోదించు,
నన్నుమానిచేఁత దగవు గాదు

శ్రీమదాంధ్ర భాగవతము

కుటుంబీకులఁ యొక్కయును, ప్రాణముల మీఁదను లోభము లేని ధర్మమే విశుద్ధధర్మము, ఫల కపటములేని ధర్మమే యథార్థ మగు ధర్మము. దానినే పాలింపవలయును. రెండవ వ్యావహారిక ధర్మము చేతులు కాళ్ళను రక్షించుకొనుచు మూఁజిని దెంచి వేయుట. విశుద్ధధర్మమందు కర్తవ్యమే ప్రధానమగును. హరి శ్చంద్రుఁడు సత్యపాలనమే ధర్మమని భావించెను. దేనికొరకై ఆతఁడు రాజ్యమును వీడెను, దేశమును వదలెను, భార్యనమ్ము కొనెను, పిల్లవాని నమ్ముకొనెను. తానమ్ముడుపోయెను, కాని ధర్మ మును వదలలేదు. వ్యావహారిక ధర్మపాలన మొనర్చువారు తమ యోగ క్షేమముల కంతరాయము రానంతవరకే ధర్మపాలన మొన ర్చెదరు. తమ జీవనమందు గాని, తమ వృత్తియందుగాని వ్యాఘాత మును గమనించిరా వారు తమ ధర్మముల నుండి తొలఁగుదురు. నీతి కారులదే ధర్మము నాశ్రయించిరి. వారి మతమేమనఁగా మాన వుఁడు బ్రదికియుండినచో జీవితములో వందల కొలఁది మంగళమయ ధర్మముల నొనర్ప వచ్చును, చూడవచ్చును. ఒక విషయమునకై ప్రాణముల నర్పించుట బుద్ధిమంతుని లక్షణము కాదు.

శ్రీ శుకదేవుఁ డిట్లనెను :- "రాజా! బలిచక్రవర్తి వ్యావహా రిక ధర్మజిజ్ఞాస చేయఁగా శుక్రాచార్యుఁ డిట్లనెను:- "రాజా. గృహస్థుడు తన పొట్టను నింపుకొనుటయేకాదు, ఆతఁడు తన యాదాయమును నైదు భాగము లొనర్పవలయును ఆ యైదు భాగ ములను నైదు కార్యములకై వ్యయ మొనర్పవలయును.

బలి యిట్లడిగెను:- "గురుదేవా! ఆ యైదు కార్యములేవి? దానిని నాకు బాగుగాఁ దెలుపవలయును."

శుక్రాచార్యుఁ డిట్లనెను :- ఒకానొకని ఆదాయము నెలకు రు 500 లగుచో నాతఁడు రు 100లు ధర్మకార్యములకు వ్యయ మొనర్పవలయును. ఏలయనఁగా ధర్మ మొనర్పక మానవుఁడు శుష్క ప్రకృతి కలవాఁడై దయాహీనుఁడగును. పరలోకమందు ధర్మమే వెంటవచ్చును. ఇచ్చట మనమేమి చేయుదుమో దానినిఁ బరలోకమునఁ బొందుదుము. ఇదియొక విధమగు బరలోకగత కోశము.

అంత శౌనకుఁ డిట్లడిగెను :- "సూతా! పరలోకగత కోశమెట్లు ?"

ఇది విని సూతుఁడు నవ్వి యిట్లనెను :- "స్వామీ! ఒక శెట్టి మిక్కిలి కృపణుఁడు. అతని యింటికొక ధర్మబుద్ధిగల కోడలు వచ్చెను. ఆ యింటిలో దానపుణ్యములు లేక పోవుటను గాంచి, ఆమె యేకాంతమునకుఁ బోయి కొంచెము సేపేడ్చెడిది. కోడలు రోజు నేడ్చుచున్నదేమి కారణమని మామ యడిగించెను. నాకడ నేవస్తువు నకును లోటులేదు. ఆమె కేమి కావలయునో చెప్పుమనుఁడు."

కోడలిది విని తన మామతో నిట్లు చెప్పించెను :- "నిత్యము పాసిన కూడును దిని తిని నాకు విసుగు పుట్టుచున్నది. ఇచ్చటి వారందఱును బాసిన కూడును దిన కోశమును బెంచు చుండెడిరే యనియే నా కష్టము."

ఇది విని శెట్టి యిట్లనెను:- "కోడలెట్టి మాటలు మాటలాడు చున్నది. ఇచ్చట నెవరును బాసినకూడును దినరు, నావద్ద కోటి రూపాయలు ప్రోగైనవి."

కోడలిట్లనెను :- "పూర్వ జన్మమున దాన పుణ్యము లొనర్చినవారే తినుచున్నాము. పూర్వజన్మములో నిచ్చినదాని నిప్పు డుపభోగించుట పాసినకూడు తినుటయేయగును. మీరిచ్చటఁ బ్రోవు చేయునది ఇచ్చటనే నిలిచిపోవును. పరలోకమునకై నీవద్ద నేమియు నుండదు. దానమును లేదు పుణ్యమును లేదు.

కోడలు పలికిన యీమాటలను విని మామ లజ్జితుడయ్యెను తన యాదాయమును నైదు భాగములొనర్చి దాన పుణ్యములందు కోడలి సమ్మతిచే దానము లొనర్పసాగెను.

సూతుఁ డిట్లనెను :- "మునులారా! భగవానుఁడు సామర్థ్య మిచ్చి యుండినను నాతఁడు దాన పుణ్యములొనర్పకున్నఁ బరలోకమునకుఁ బాథేయముంచుకొనకున్న వానికి మించిన మూర్ఖుఁడింకెవఁడుండును ఈ విషయములో నొక మనోరంజకమగు నితిహాసమును వినుఁడు."

ఒక శెట్టి యుండెను. ఆతనికడ నొక నౌకరు నివసించుచుండెను. నౌకరు గ్రామీణుఁడు. మిక్కిలి అమాయకుఁడు. సదా ధార్మిక విచారముకల భక్తుఁడు సాధారణముగ జనులు అమాయకులగు ధార్మికులను బరిహాస మొనర్చుచుందురు. వారిని మూర్ఖులుగాఁ

జేసిన వారికానందము కలుగును. నౌకరు పూర్వపువాఁడు, అమాయకుఁడు స్వామికి నచ్చినవాఁడు, ఇంటివాఁడువలెనే యుండెను. ఆతఁడు డబ్బును బ్రోవుచేసెడు వాఁడుకాఁడు. లభించిన దానిని దాన పుణ్యములకు వ్యయ మొనర్చును. శెట్టి కొంచెముగ లోభి. అటునుండి ధనము రావలెను, ఇటునుండి ధనము రావలెను. ఆ కొట్టు నుండియు లభింపవలెను, ఈ కొట్టునుండియు లభింపవలెను. అది లభింపవలెను, ఇది లభింపవలెను అను నీ చింతలోనే యుండును. అవకాశము చిక్కినపుడు నౌకరుతో నెగతాళి యాడుచుండును.

ఒకదినమున శెట్టికి వంకరటింకరకఱ్ఱ ఒకటిదొరకెను. దాని నాతఁడు తననౌకరుకిచ్చుచు నిట్లనెను :- "ఇది విచిత్రమగు కఱ్ఱ. దీనిని నీకంటె మూర్ఖుఁడగువాని కీయవలయును."

సేవకుఁడిట్లనెను :- "మంచిదిస్వామీ! అనిపలికి ఆతఁడు కఱ్ఱను దీసికొనెను. ఆతఁడు సామాను కొఱకు బజారునకు వెళ్ళి నప్పుడెల్ల దండమును వెంటఁ గొనిపోవు చుండును. శెట్టి ఆతనితో నిత్య మిట్లను చుండెను :- "నీకంటె నధిక మూర్ఖుఁ డెవఁడైనఁ జిక్కినాఁడా?"

అప్పుడు సేవకుఁడిట్లనెను :- "లేదు స్వామీ! ఇంతవర కెవఁడును దొరకలేదు." ఇదివిని శెట్టిగారు హిఁహి యని నవ్వుచుండును వానికిది ప్రతిదినమును వినోద సామగ్రి యయ్యెను.

ఒకదినమున శెట్టిగారికి విశూచిక (కలరా) వ్యాధి వచ్చెను చికిత్సకులు నిరాశను బ్రకటించిరి. ఇకఁ దాను బ్రదుకనని ఆతనికి నిశ్చయ మయ్యెను. ఆతని ప్రియ సేవకుఁడును నాతని సేవ యందు నంలగ్నుఁడై యుండెను. మిక్కిలి కాతరవాక్కులతో శెట్టిగారిట్లనెను :- "ఘసీరామా ! ఇఁక నేను బోవుచున్నాను."

ఘసీరాముఁ డిట్లనెను :-"శెట్టిగారూ ! మీ వెంట నేనును వచ్చెదను. శుష్కహాసమొనర్చుచు శెట్టిగారు కష్టముతో నిట్లనెను : "ఓరీ ! అచ్చటికెవరును వెంటఁరాజాలరు "

అప్పుడు ఘసీయిట్లనెను :- "మంచిది, ఈగుఱ్ఱపుబండి వెంటఁరాగలదు." శెట్టిగారికి మాటలాడుట కష్టముగ నుండెను ;- "ఆతఁడు తలనూపెను" కాని ఘసీ మూర్ఖుఁడు కావున నాతఁడు మెదలకుండక యిట్లనెను :- "శెట్టిగారూ ! గుఱ్ఱపుబండి పోకున్న నెట్లుపనియగును. రూపాయల నన్నిటిసిఁ దీసికొని పోదము. నేయి, బియ్యము, పోపుదినుసులు, దిండు, పరుపు వగైరా లన్నిటినిఁ గట్టెదను."

శెట్టిగారు కష్టముతో నిట్లనెను :- "నీవు మూర్ఖుఁడవురా అచ్చటికేదియును బోరాడు. ఈశరీరము నిచ్చటనే యుండిపోవును. కేవలము పుణ్యపాపములే వెంటవచ్చును."

అప్పుడు ఘసీరాముఁడు కఱ్ఱను దీసికొని శెట్టిగారి చేతి కిచ్చుచు నిట్లనెను :- "మంచిది ఈకఱ్ఱను మీరేవట్టుకొనుఁడు. నాకు మీరే మూర్ఖులుగ గనఁబడు చున్నారు. ఏలయనఁగా నిదియంతయు

నెఱిఁగి యీపృథివీ విహారమగు రూపాయల కొఱకు సదా చచ్చు చుంటిరి పరలోకము దానపుణ్యముల నేమియును జేయలేదు.'' ఈ విషయము ఉపయుక్త సమయమునఁ జెప్పబడినది. ఇది శెట్టిగారి మనస్సున కెక్కెను. భగవత్కృపచే నాతఁ డారోగ్యవంతుఁ డయ్యెను. తరువాత నతఁడెన్నో దానపుణ్యములొనర్పసాగెను.

సూతుఁడిట్లనెను - ''మునులారా! కావునఁ దమ తమ యాదాయములో నైదవ భాగమును ధర్మకార్యములకు వినియోగింపవలయును.'' అందువలననే శుక్రాచార్యుఁడు తనయాదాయ మందైదవ భాగమును ధర్మకార్యములందు వ్యయ మొనర్పవలయు నని చెప్పెను.

శుక్రాచార్యుఁడు బలికి నీతి నుపదేశించుచు నిట్లనెను :- "రాజా! రు 500 లు నెలకాదాయముండిన నందులో రు 100 లు ధర్మకార్యములకు వినియోగింపవలెను. రు 100 లు యశమును వృద్ధిఁ బొందించు కార్యములందున వినియోగింపవలయును. ఏల యనఁగాఁ బ్రపంచములో యశము లేకున్నచో వాఁడు జీవన్మృతుఁడే అతఁడు మనుష్యుఁడై నందులకు విశేష మేమున్నది? కుక్కలు పందులును బొట్టఁబోసి కొనును. కావున యశోపార్జనము కొరకు తన ఆదాయములో నైదవ భాగమును వినియోగింప వలయును విద్యార్థులకు సహాయ మొనంగుఁడు. అన్న సత్రములు కట్టింప వలయును ఉచితవైద్యశాలలను నెలకొల్పుడు. ధార్మిక పుస్తక ప్రచారమునకు వినియోగింపుఁడు. ఏ శుభకార్యముచే యశము వృద్ధిని జెందునో దానికి వినియోగింపవలెను.

ఒక అయిదవ భాగమును మరల నా ధనమును వృద్ధి చేయుటకు వినియోగింపవలయును. దానివలన నిత్యము ధనము వృద్ధి కావలయును. రు 100 లను వానికి వినియోగింపవలయును. రు 100 లను యనఁగా నాదాయములో నైదవ భాగమును శారీరక సుఖోపభోగములకు వినియోగింప వలయును. పరుపు, దిండు, వాహనము మొదలగునవియు, వివిధములగు నాహార పదార్థములును సంగీతాది మనోరంజక మగు కార్యములందును వినియోగింప వలయును, ధనముండియు ననుభవింపఁ జాలని వానిగతి గానుగ యెద్దువలె నిరంతరము గానుగను ద్రిప్పినట్లే, వానికి ధనమున్నను లేకున్నను నొక్కటే వానికిని జీతగాండ్రకును భేద మేమున్నది ?" కావునఁ బంచమాంశముచే సుఖోపభోగము లొనర్పవలయును.

మిగిలిన నైదవ భాగమును దన బంధు బాంధవులకును, స్వజనులకును సహాయ మొనర్చుటలో వినియోగింపఁ వలయును తాను సుఖోపభోగములనుభవించుచుఁ దన బంధువులకు లేకుండు టెట్లు ? వారికి సహాయపడవలయును. మనవాఁడు సంపన్నుఁడు. అతఁడు మనకు సహాయ మొనర్పఁగలడని బంధువులంద రాశించు చుందురు. జన్మించి, సంపన్నుఁడై, యోగ్యుడై తనకులము వారికి సహాయపడకున్న నాతని జన్మ విద్య, యోగ్యత లన్నియును వ్యర్థములే. కావున రాజా ! కులోన్నతికొరకవశ్య మైదవవంతును వ్యయ మొనర్పవలయును.

శుక్రాచార్యుఁ డిట్లనెను - "రాజా! గృహస్థు తన యాదాయము నిట్లు వినియోగ పరుపవలయును. ధన సంపత్తుల మీఁద నాతని కొక్కనికే అధికారము లేదు. పరివారమున కంతకును దాని మీఁద నధికారము కలదు. మరుగుజ్జు వామనుఁడు మూఁడడుగుల భూమిని దానమడుగుచున్నాఁడు. రెండడుగులలోనే నీ సర్వస్వమును హరింపఁ గలఁడు. సర్వస్వము నొసంగుటకు నీ కేమి యధికారఁ మున్నది? కావుననే నేను దీనిని కాదనుచున్నాను. ఈ మాయలో నీవు పడి దాన సంకల్పము నొనర్పకుము."

బలిచక్రవర్తి యిట్లనెను :- స్వామీ! చేతిలోనికి జలమును గుశలను గైకొని సంకల్ప మొనర్చుట యేమంత గొప్పదికాదు. ఫలాని వస్తువు నొసంగెదనని మానసికముగ సంకల్ప మొనర్చినను వాక్కుతో వాగ్దాన మొనర్చినను సంకల్పమైనట్లే, జలకుశలను గైకొని మంత్రమును బఠించుట దానికి బుష్టి నొనంగు శారీరక క్రియ మాత్రమే, నేను మనోవాక్కులతో సంకల్పము నిదివఱకే చేసి యుంటిని, ఇప్పుడు సంకల్ప మొనర్చి యీయకున్నను నరక గామినగుదును. సంకల్ప మొనర్చినను నీయరాదని మీ శాస్త్రములలో నెచ్చటైనను గలదా?"

శుక్రాచార్యుఁ డిట్లనెను :- అవును. ఎందులకు లేదు? ఇది వేదమతము."

నవ్వి బలిచక్రవర్తి యిట్లనెను :- "స్వామీ! ఇది వేదములలో లిఖింపఁబడినదా గీతములలో లిఖింపఁ బడినదా? ఏ వేద మందిట్లు లిఖింపఁబడినది?"

శు క్రాచార్యు డిట్లనెను:- "ఋగ్వేదములలోని చాలఋక్కు లలో నేను జెప్పిన విషయమునకు ఋష్టి కలదు. దానిని నేను నీకు వినిపించెదను వినుము."

శ్రీ శుకదేవు డిట్లనెను :- "రాజా! ఇట్లు పలికి శుక్రాచార్యుడు తాను జెప్పినదానికి ఋష్టికొఱకై వైదిక ఋక్కుల కిష్టము వచ్చి నట్లర్థములు చెప్పసాగెను."

.....

## శుక్రాచార్యుని విపరీత ధర్మము

శ్లో॥ పరాగ్రిక్తమ పూర్ణం వా అక్షరం యత్తదోమితి।
యత్కించి దోమితి బ్రూయాత్తేన రిచ్యేత వైపుమాన్ ।
భిక్షవే సర్వమోంకుర్వన్నాలం కామేన చాత్మనే॥

—శ్రీభాగ. ౮స్కం. ౧౯అ. ౪౧శ్లో॥

సీ॥ అంగీకరించిన నఖిలంబుఁబోవుచో
నన్నృతంబుగాదు లేదనిన నధిప
యాత్మవృక్షము మూల మన్నృతంబు నిశ్చయ
మన్నృతమూలము గల్గ నాత్మ సెడదు
పుష్పఫలము లాత్మ భూజంబునకు సత్య
మా మ్రాను బ్రదుకమి నదియుఁజెడును
ఫలపుష్పములు లేక పన సెడి వృక్షంబు
మూలంబుతో వృద్ధిబొందుఁగాదె

తే॥గీ॥ చేటుఁ గొఱఁతయు లమమయుఁజెందకుండ
నిచ్చుపురుషుండు సెడకుండు సిద్ధచరిత
కాక యంచిత సత్యసంగతి వటంచు
నిః ధనం బర్థి కిచ్చిన నీకు లేదు.

—శ్రీ మదాంధ్రభాగవతము.

వేదశాస్త్రములం దనేక విధములగు వచనము లుండును, వానిలో నన్నియును తమ తమ బుద్ధి ననుసరించి తమ తమ మతములను బుష్టి నొనర్చునవియే. వేదవ్యాసుఁడు రచించిన బ్రహ్మసూత్ర మొక్కటియే. దాని నుండి వివిధాచార్యులు వివిధార్థములను దీసియున్నారు. కొందఱు దానినుండి ద్వైతార్థమును దీసిరి, కొందఱద్వైతమును, కొందఱు విశిష్టాద్వైతమును, గొందఱు శుద్ధాద్వైతార్థమును స్థాపించిరి. ఈ విధముగ నందఱును దమతమ మతములను స్థాపించుకొనిరి.

ఈ జగత్తు త్రిగుణాత్మకమైనది. అట్లే వేదములను త్రైగుణ్యములు. ఏ గుణముకలవారట్టి యర్థమును దీయుచుందురు, పచారీదుకాణమునఁ త్రిఫలములు (ఉసరిక, తాడి, కరక్కాయ) శుంఠి, మిర్చి మొదలైన రసాయనిక వస్తువులును గలవు. నాభి, పాషాణము మొదలగు విషములును గలవు. సమస్త విధముల మసాలా దినుసులు కలవు. ఇతర వస్తువులును గలవు, ఎవరి కేవస్తువు కావలసిన నాతఁడావస్తువు కొఱకై వచ్చి తీసుకొనిపోవును. అదే విధముగ వేదములలోఁ గొన్ని వ్యావహారిక విషయములును

గలవు. అది యే యభిప్రాయముతోఁ జెప్పఁబడినను, నీతిజ్ఞులు దానిని తమ స్వార్థసిద్ధి నిమిత్తమై వానినిఁ బరమ ప్రమాణముగ గ్రహించి యుపదేశించెదరు.

శ్రీ శుకుఁ డిట్లనెను ;- రాజా ! అసురాధిపుఁడగు బలిచక్రవర్తి వామనునకు మూఁడడుగు లిచ్చెదనని ప్రతిజ్ఞ నొనర్చినాడనియు. నిప్పుడాతని కీయనని ప్రతిజ్ఞోల్లంఘన మొనర్చి మిథ్యాభాషణాపరాధము నెట్లు చేయగలననియు బలుకఁగా శుక్రాచార్యుఁ డిట్లనెను ;- "రాజా ! సత్యమేమో నిర్ణయించుట చాలకష్టము. ఒక్కొక్కప్పుడు సత్యమువలెఁ గనఁబడునది అసత్య మగుచుండును."

బలిచక్రవర్తి యిట్లనెను :- "స్వామీ! అట్టిది సందేహవాక్యములందు సంభవమగును. ఇచ్చుట స్పష్టమేకదా! ఒక్కసారి మనమేదైన వస్తువు విషయములో యాచకునితో 'సరియే యిచ్చెద' నని మరల నీయకున్నచో నిది నిర్వివాదమైన నసత్యము, మీరు నాచే నసత్యాచారణ మేలఁ జేయించెదరు.?"

శుక్రాచార్యుఁడు గద్దించి యిట్లనెను - ఓయీ ! పిల్లతనపు చేష్ట లొనర్పకుము. చెప్పినది వినుము. ఎవనికి 'అవు' నని అంగీకరించితిమో అది సత్యమే, ''బ్రహ్మమున్నాఁడు'' ఇదియే సత్యము. 'లే' దని నిషేధించిన నదిఅసత్యము. మంచిది, చూడుము శ్రద్ధగాఁ దెలిసికొనుము. బ్రహ్మ సత్యము, జగన్మిథ్య యనుజ్ఞాన మెవరి ద్వారా కలుగును ?"

బలి యిట్లనెను - స్వామీ! ఈ జ్ఞానము శరీర సంసర్గము చేతఁగలుగును. ప్రసన్నుఁడై శుక్రాచార్యుఁడిట్లనెను - "అవునంతే, జ్ఞానప్రాప్తికి సాధన భూతమైనదీ శరీరమే. ఈ దేహము అసత్యముచే నుత్పత్తియైనది. మూలప్రకృతియందు వికృతి గలిగిననే చతుర్వింశతి (24) తత్వము లుత్పత్తియగును. ఈ పదార్థము లన్నియును నాశవంతములు, మిథ్యలు, అసత్యములు. ఈయసత్పదార్థములచే నేర్పడిన దేహము ద్వారా సత్యస్వరూపమగు బ్రహ్మ ప్రాప్తించును. కావున నీ దేహరూపమగు వృక్షమునకు మూలము అసత్యమైనది, సాధన రూపమగు జ్ఞాన పుష్పమును, మోక్షరూపమగు ఫలము వచ్చినది. అసత్యము అనఁగా దేహమే లేకున్నచో జ్ఞానమును, ముక్తియును నెట్లు ప్రాప్తింపఁ గలదు? వేఱు తెగిపోయిన వృక్షమెండినట్లు, అసత్యమగు దేహమునశింపఁగా దాని దేహమును వెంటనే యెండిపోవును. ఇందుకు సందేహములేదు."

బలి ఆశ్చర్యముతో నిట్లనెను :-"స్వామీ! నేఁడు మీరు నూతన విషయములను జెప్పుచున్నారు. అయితే మానవుడు సదా అసత్యమునే చెప్పవలయునన్నమాట."

శుక్రాచార్యుఁడు శీఘ్రముగ నిట్లనెను :-"సదా అసత్యాచరణ మొనర్పుమని నా యభిప్రాయముకాదు. యథా శక్తిగ సత్యమునే చెప్పవలయును. అసత్యమును వీడవలెను, కాని ఆ జీవిక పోవు నప్పుడును, శరీరరక్షణ ప్రశ్నము వచ్చినప్పుడును, కేవలము ముక్తితోఁబని జరుపుకొనవలయును. నాశమును గాదాదు."

బలియిట్లనెను :-"స్వామీ! ఇది ప్రత్యక్ష అసత్యము. వటువగు వామనుఁ డిట్లడిగెను నాకు మూఁడడుగుల పృథివి నొసంగుము." నేను 'సరియేయిచ్చెద' నంటిని. ఇందులో నేమియుక్తి రాఁగలదు ? 'సరియేయిచ్చెద'నని పలికి యీయకుండుట నిర్వివాదమగు నసత్యము."

శుక్రాచార్యుఁడిట్లనెను :-"ఓయీ ! నేనేది చెప్పుచున్నానో నీవా విషయము మూలము వరకు పోనేలేదు. పైపైనే విచారించుచున్నావు. నీదగ్గరకు నిత్యమును యాచకులు వచ్చి వస్తువులను యాచించుచుందురు. నీవు సరియే యిచ్చెదననుచుందువు. సరియే యిచ్చెదననిఁ దనసర్వస్వము నొసంగుట యను నర్థము కాదు తన శరీరమును, దారాపుత్రాదులను, రాజ్యమును గోశమును రక్షించుకొనుచు నిచ్చెదననియే అర్థము. "అవును నేనిచ్చెదను" అను నీ వచనమునకు మిక్కిలి వ్యాపకార్థము కలదు. మొదటి యర్థమేమనఁగా నావద్దనున్న వస్తువును దీసి, దాఁనిమీఁదఁగల నామమత్వమును దీసివైచి, నీకొసంగెదను, కాని యేమి యొసంగెదను, ఎంత యొసంగెదను, ఎంతకాలమువరకొసంగెదను, ఖరీదున కొసంగెదను, అల్పకాలము వరకొసంగెదను, ఇన్ని అర్థములుకలవు. ఇందులో సంకేతమేమియునులేదు. భిక్షగాని కెల్లప్పుడడుగుటయే పనిఁ దాత యిచ్చునపుడు దాత ఒకటి గుర్తునందుంచుకొనవలెను. ఎవఁడైన నన్నము నడిగిన 'అవునిచ్చెదను' అనిన దానియభిప్రాయము మన యింటిలోనున్న అన్నమంతయును నిచ్చెదనను నర్థముకాదు. ఎంత యిచ్చుట ఉచితమో అంతయిచ్చెదనను అర్థమే. అడిగిన దంతయ్యును

నిచ్చుచుండిన మనవద్ద మిగులునదేమియునుండదు. తీసుకొనువారికి కొదువయుండదు. నీవెంత యిచ్చిననంతయును దీసికొందురు. పరిశ్రమలేకయే వచ్చుధనమునకుఁ జెఱుపేమున్నది. భిక్షుకునకు బ్రహ్మాండ రాజ్యమొసంగినను దృప్తియుండదు. కావున దాతతెలిసికొని యీయవలయును, 'అవునిచ్చెదను' అని నిరంతరమనువాఁడు ధనహీనుఁడై నిర్ధనుఁడగును. చేతిని వెనుకకు లాగుఁవాడును, అడుగుకొనువాఁడును, లాకేత్వము దాకుకొమ్ము పెట్టువాఁడును, వీరి వద్దలక్ష్మి నిలుచును. కావున ధనికులు కృపణులుగ నుందురు. కృపణత లేనిది ధనము ప్రోవువడదు."

బలి నవ్వియిట్లనెను :- "స్వామీ! అడిగినవారందరకును లేదనవలయునని దానికభిప్రాయ మేర్పడుచున్నది. ఇచ్చుచుండిన ధనము ఖాళీయగును గావున నెవ్వనికిని నేనిచ్చెద ననరాదనియే తెలుచున్నది."

అంత శుక్రాచార్యుఁడిట్లనెను :- "కాదు నాయనా! నీవు నా యభిప్రాయమును గ్రహింపలేదు. నేనొక సిద్ధాంత విషయమును జెప్పితిని. భిక్షువునకు దన సర్వస్వము నొసంగువాఁడు తనకావశ్యకములగు భోగములను సంరక్షించుకొనలేనివాఁడు కాఁగలఁడు. దీనికి విపరీతముగ నీయననువాఁడు తన వస్తువులనన్నిటిని సురక్షిత మొనర్చుకొనుచున్నాఁడు. సదా ధనధాన్యములచే సంపన్నుఁడగును. కాని యిట్టి కృపణుని నందఱును నిందించెదరు. నిద్రలేవఁగానే

వాని పేరు నెవరును దలంపరు. అతఁడు వట్టిలోభియని అందఱు నందురు. లోభియని ప్రసిద్ధిఁజెందినవాఁడు జీవించియును మరణించినవాఁడే. అతఁడు స్వయముగఁదినఁడు. ఇంకొకరికిఁ బెట్టఁడు."

అంత శౌనకుఁ డిట్లడిగెను :-"సూతా ! లోభియని యెవరి నందురు?"

ఇది విని సూతుఁడు నవ్వి యిట్లనెను :-"స్వామీ ! ఇదియొక లోకోక్తి. దీని యభిప్రాయము తన వస్తువు నణుమాత్రమైన నితరుల కీయకుండు వానిని (మఖ్ఖీచూస్) లోభియందురు ఒక కృపణుడుండెను. అతఁడు లడ్డు చేయుటకు పంచదార పాక మొనర్చుచుండెను. దైవయోగమున దానిలో నొక యీగ పడెను. అతఁ డా యీగను దీసివైచెను. అతడు కృపణుడు కావున నాతడిట్లనుకొనెను:- "ఆ ఈగ కాళ్ళతో బోయిన పాకము వ్యర్థముగఁ బోవును. అది నాకు పనికి రాక చీమలు తినివేయును. అందువలన నాతఁ డా యీగను నోటిలోఁ బెట్టుకొని చీకెను. దాని ఱెక్కలందు దగుల్కొనిన పాకమును వృథాగాఁ బోనీయలేదు. దాని యుపయోగమును దన కొరకే చేసికొనెను." అందువలననే లోభివానిని మఖ్ఖీచూస్ (యీగను చీకిన) వాఁడందురు. ఈ రకమువానిని నితరుల సంగతియేల భార్యాపుత్రులుకూడా యేవగించుకొనుచుందురు. ఈ లోభివాఁడెప్పుడు చచ్చును. మాకు కడుపునిండ భోజనమెప్పుడు లభింపఁగలదు" అని అనుకొనుచుందురు. ఇట్టివారు కేవల మితరుల కొరకే ధనమును బ్రోవుచేయుదురు. బుద్ధిపూర్వకముగ బ్రదికి యున్నంతవరకు

తినరు. యీయరు, పుణ్యకార్యములకు వినియోగింపరు. చిన్న చిన్న పిల్లలు కృపణుఁ జూచి వారిని వెక్కిరించుచు నిట్లందురు. కూచమ్మ కూడబెడితే మాచమ్మ మాయము చేసినది.

శుక్రాచార్యుఁడు బలితో నిట్లనెను :- రాజా! మానవుడు కృపణుఁడు కాఁగూడదు. వచ్చిన వానికి లేదనరాదు. ఒకానొకఁడు వచ్చి వేయిరూపాయలడిగిన మంచిది యథాశక్తి యిచ్చెదను అని తన విత్తమును జూచుకొఁని వందయో యేఁబదియో యీయవల యును. చేతులను జోడించుకొని స్వామీ! యింతవరకే యున్నది. యిప్పటి కిది కృపఁజేయుఁడు అని యీ విధముగ సర్వథా కాదని అపయశస్సును బొందనురాదు. సర్వస్వదానము నొనర్చి తాను భిక్షగాడును గారాదు. మధ్యమార్గము నాచరింపవలెను.

బలి యిట్లనెను :- స్వామీ! దానిని నే నొప్పుకొందును. మీరెంత యడిగెదరో అంత యిచ్చెదనని మనమని యుంటిమి. మన మొక్కటి యీయనిండు, వేయి యీయనిండు, ఇచ్చుటకు స్వతంత్రులము, కాని యింతకు ముందుగనే నేనింతయే తీసుకొందును, దానిని మేమిచ్చెదమని యొప్పుకొని, అప్పుడుదాని నీయకున్న నసత్యమైపోఁగలదు. వామనుఁ డిట్లనెను :- నేను నా పాదములతో మూఁడడుగుల భూమినిఁ గొనెదను :- నేను మీ యిష్టానుసారముగ నిచ్చెదనంటిని. ఈ మాటలలో విపరీతార్థము లొనర్ప వీలులేదు.

శుక్రాచార్యుఁ డిట్లనెను :- నీవు దీనినిఁ గొంచెముగ సంశోధింపుము. నేను పృథివి నొసంగెదను. మూడడుగు లొసంగెదను,

నీ పాదముల తోడనే యిచ్చెదనని నీ వంటివి. నీవు పృథివి నిమ్ము. మూఁడడుగులు కాదు మూఁడువంద లడుగుల నిమ్ము. కాని ఓ వామనదేవతా! నీ పాదములతో గొలువ నీయమని గట్టిగా జెప్పివేయుము. ఇదియే నేను జెప్పునది. ఇందులో నే హానియు నుండఁబోదు భిక్షుకుఁ డడిగిన దానికి మించి యిచ్చుచున్నాము.

బలి చేతులను జోడించుకొని యిట్లనెను ;- స్వామీ అన్యథా భావింపకుఁడు ఇది పచ్చి అబద్ధమైనది. వామనుఁడు మాటిమాటికిని నాకు మూఁడడుగులకంటె నధికముగ నక్కరలేదు, అధికముగ నిచ్చినను దీనికొనను, తక్కువయును గైకొనను. నాపాదముల తోడనే కొలుచు కొందుననుచున్నాఁడు. నేనట్లే యిచ్చెదనంటిని. నీ పాదములతో నీయనకు ప్రతిబంధమును బెట్టినచో నది అబద్ధపు వ్యవహారముకాఁగలదు. ఇట్లబద్ధమాడుట ధర్మమేనా ?

శుక్రాచార్యుఁడు మధురవచనములతో నిట్లనెను - అవును అబద్ధమేనయ్యా! కాని అబద్ధమాడినను దోషముగఁ బరిగణింపఁ బడని స్థానములు కొన్ని కలవు.

బలి యిట్లనెను - స్వామీ! అబద్ధమబద్ధమే. దాని నుండి తప్పించుకొనవలయును.

శుక్రాచార్యుఁడిట్లనెను - ఏయే యవసరములలో నబద్ధము క్షమింపఁదగినదో నేను జెప్పెదనువినుము అచ్చట నబద్ధము చెప్పిన నంతగా దోషముండదు.

శ్రీశుకదేవుఁడిట్లనెను - రాజా ! ఇట్లు పలికి శుక్రాచార్యుఁడప వాద ధర్మములను గూర్చి చెప్పసాగెను.

.....

## ఎచ్చటి అసత్యము నిందనీయము కాదు

శ్లో॥ స్త్రీషు నర్మ వివాహేచ వృత్త్యర్థే ప్రాణసంకటే ।
గోబ్రాహ్మణార్థే హింసాయాం నానృతం స్యాజ్జుగుప్సితమ్॥
శ్రీభాగ. ౮ స్కం. ౧౯ అ. ౪౩ శ్లో ॥

గీ॥ వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణవిత్తమానభంగములను
జకిత గోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘముఁ బొంద దధిప॥

శ్రీమదాంధ్ర భాగవతము.

నియమము నుండును. దానికపవాదము నుండును, మరియు వివశతయునుండును. ఎట్లనఁగా సదా సంధ్యావందన మొనర్ప వలయునను నియమము కలదు. సూతకములోఁ జేయరాదను నప వాదమునుగలదు. వివశతయన నెట్టిదనఁగా ఏదైన గొప్పయుత్స వములో నుండినను, యాత్రయందవకాశము లేకున్నను, ఏదైనఁ బరోపకార కార్యమందు నంలగ్నుఁడైనను, నప్పుడు సంధ్యావందన

మొనర్చ నవకాశము దొరకకున్నచో సంధ్యావందనలోపమైనను నిది దోషముగఁ బరిగణింప బడదు అదిక్షమ్యాపరాధము. ఇదేవిధముగ నన్యనియమములందును గమనింపవలయును.

బలి మాటి మాటికిని శుక్రాచార్యునితో "నన్ను బద్ధమాడమను చున్నారా ?" యని నిరుత్తరునొనర్ప దలఁపఁగా శుక్రాచార్యుని "డెనిమిది యవసరములలో నబద్ధమాడవలెనివచ్చినను దోషము లేదనెను."

బలి చక్రవర్తి యిట్లడిగెను :- "స్వామి ! ఆ యెనిమిది యవసరము లేవి ?" శుక్రాచార్యుఁ డిట్లనెను :- "స్త్రీలను బ్రసన్నుల నొనర్చుటకై అబద్ధమాడవలసి వచ్చినచో విశేషదోషమేమియు నుండదు. వృద్ధస్త్రీలు తమహాని లాభముల నన్నిటిని నెరుఁగుదురు వారికి పుత్ర పౌత్రుల భారమువచ్చి పడుటచేఁ దమ హాని లాభముల స్థితి నెరుఁగుదురు. వృద్ధులగుటచే నలంకారము లొనర్చుకొనవలయునను గోరికయును దగ్గిపోవును. కాని క్రొత్త గాఁపురమునకు వచ్చినవారికి అనుభవ ముండదు. నిత్యమును నూతన వస్త్రముల కొరకును, భూషణముల కొరకును భర్తతో రోదించు చుందురు. ఇవ్వకున్న ముఖమును ముడుచుకొని కూర్చుందురు. ఎవరైన మంచి మెరుపుగల చీరెను గట్టుకొనిరా వచ్చి పతితో నిట్లందురు :- "విన్నారా ? నేను నిన్న కమల వివాహమునకు బోయితిని. పెద్ద శెట్టిగారి పిల్ల పెద్దాపురము నుండి వచ్చినది. ఆమె మంచి సాజూకైన చీరెను గట్టుకొన్నది. నామనస్సంతయును దాని మీఁదనే యున్నది. 'అమ్మాయీ! ఈ చీరెప్పుడు తీసికొంటివని నేనడిగితిని."

ఆమె యిట్లనెను :- "పిన్నీ ! దీనిని కొని నాలుగేండ్లైనది. దీని నెంతగా నుదికిన నంతయు మెఱుపువచ్చును. ఎంతో ధర లేదు." అప్పటినుండియు నా మనస్సంతయును దానిమీఁదనే యున్నది. అట్టి చీరెను నాకును దెచ్చి పెట్టుడు."

నెల కెంత జీతమో ఆమె కేమి తెలియును? ఆ ఒక్క చీరెకే పెట్టినచోఁ దినునదేమి కలదు? ఆమె ముఖము చిన్న బుచ్చుకొనును. ఆ సమయమున బలి బుచ్చిక మొనర్చుటకై యిట్లన వలెను :- "మంచిది, సరే, ఇంకను నెలను బూర్తి కానిమ్ము. నాకు పెద్దాపురము వెళ్ళవలసిన పనియునుగలదు. తెచ్చి పెట్టెదను" ఈ విధముగఁ బలికి టలాయింప వలెను. ఒక సంవత్సరమునకైనను దేలేక పోవచ్చును. సాధ్యమైనంత వరకు సత్యమునే చెప్పవల యును; కాని వస్త్ర భూషణములు, ఇంక చిన్న చిన్న విషయములలో జగడములువచ్చు భయమున్నప్పుడు, ఆతఁడు సత్య హరిశ్చంద్రుని వలె సత్యవాది యైన జెప్పలేము కాని యెంత గొప్ప వారైనను స్త్రీల సమ్ముఖమున నిట్టి మాటలు చెప్పవలసి వచ్చును. ఇట్టి సమ యములం దసత్య మంతగా నిందితము కాదు. సాధారణముగ వ్యవహారమున నిట్లు చేయవలసి వచ్చును. స్త్రీలు మాటమాటకును ముఖమును ముడుచుకొనుచుందురు. వారికి చెప్పఁ దగిన విషయము లుండును. స్త్రీ లేవిషయమునైనను లోన దాచుకొనఁజాలరు. వారి కేదైన రహస్యపు మాట జెప్పినచో వారందరకును రహస్యముగ జెప్పుదురు ఈ విధముగ వెల్లడించెదరు. దీని నెవరికిని జెప్పగూడ దని వారికిని జెప్పుదురు. కాని వారును నట్లే చెప్పెదరు. ఈవిధముగ నది లోకమంతయును వెల్లడి కాఁగలదు. కావున స్త్రీ లేదైన రహస్య

విషయమును గూర్చి పట్టు పట్టినచో నా యీ మాటలను జెప్పి టలాయించి యేదియో సమాధానము జెప్పవలసి యుండును."

కైకయ మహారాజన్ని జీవుల భాషల నెరుఁగును. ఒక యోగి ఆతని కీవిద్యను జెప్పెను. దీని నెవరి కైనను జెప్పినచో నీ ప్రాణము పోవుననియు నాయోగి చెప్పియుండెను. ఒక దినమున నాతఁడు తన యంతః పురమునఁ గూర్చుండెను. రెండు చీమలు తమలోఁ దాము మాటలాడుకొనుచుండెను. అవియును బూర్వ జన్మమున రాణులు. వాని మాటలను వినఁగానే రాజునకు నవ్వు వచ్చెను. రాణియును దగ్గరనే కూర్చుండినది. రాజు తనను జూచి నవ్వుచున్నాఁడని ఆమె తలఁచెను.''

క్రుద్ధురాలై రాణి యిట్లనెను :- "మహారాజా! మీరు నన్ను జూచి యెందుకు నవ్వుచున్నారు ?''

రాజు ధైర్యముతో నిట్లనెను - దేవీ! నేను నిన్నుఁ జూచి నవ్వుట లేదు. ఇది వేరు విషయము.

రాణియిట్లడిగెను - అదేమిటి ? దానిని నేను వినవలయును. నాకవశ్యము చెప్పవలయును.

రాజిట్లనెను - దానిని నేను జెప్పినచో నాకు మృత్యువు కలుగును. నీవీ విషయమును నన్నడుగకుము. కాని స్త్రీహఠ మొనర్చినచో బ్రహ్మచెప్పినను వినదు. ఆమె యిట్లనెను - కాదు మహారాజా! ఏమైనగాఁనిండు మీరు నవ్విన కారణమును జెప్పితీర వలయును. మీరు చెప్పకున్నచో నేనువిషమును దిని చచ్చెదను.

రాజుమిక్కిలి ధర్మసంకటములోఁబడిపోయెను. ఆతఁడు పోయి యోగితో జెప్పెను. యోగి యిట్లనెను – ఆమెను జావనిమ్ము అట్లే హఠము చేయును గాని చావదు. ఆమెకుఁ జెప్పవలదు. రాజట్లే చేసెను. నీవు చచ్చినను బ్రతికినను జెప్పననెను. రాజు యోగికి జెప్పుటచే సత్యమును రక్షించుకొనెను. ఒక వేళ నేవిషయము మీఁదనైన స్త్రీ యిట్లు మొండివట్టును బట్టినచో నాయీమాటలను జెప్పి శాంతింపఁ జేయవలయును. కుంతి కర్ణుని విషయమును దాఁచఁగా ధర్మరాజు స్త్రీ లేవిషయమునైన దాఁచకుండెదరుగాక యని శపించి యుండెను. ఏదైన విషయము బయటకుఁ జెప్పరానిది యున్నచో దానిని స్త్రీలకుఁజెప్పకూడదు. దీనిలో విశేషదోషములేదు.

రెండవది నవ్వుటాలకు అబద్ధములునోటివెంట వెలువడినచో నంతదోషములేదు. నవ్వుటాలకును నబద్ధములు రాకుండుట చూచుకొనుట చాలముఖ్యము. కాని నవ్వుటాలలోఁ జాలగ నబద్ధములు వచ్చుచుండును. పసివిల్లను ముద్దునకుఁ జంకలోని కెత్తుకొని 'చూడు నిన్నుగంగలోఁ బడవైచెద' నందురు. ఈతఁడు పడవేయఁడు ఊరక నవ్వుటాల కనుచున్నాఁడని ఆవిల్లకును దెలియును. మన మును బడవేసెదమను భావనతో ననము. నాటకములలో రాజుకాని వాఁడు రాజువేషమును వేయును. అతఁడు మాటిమాటికిని నేను రాజును అదిచేసెదను, వీనినిఁ గొట్టెదను. వానిని బడవేయుదును. మాటలన్నియు నబద్ధములే; కానిఆటలోనిమాటలు, వాని కసత్య దోషమాపాదింపదు.

మూఁడవ స్థానము, వివాహ ప్రసంగము. ఒకానొక పిల్ల కలదు. ఆమెనల్లనిదని చెప్పిననామెకు వివాహముకాదు. ఆవిషయమును దాచి పిల్లఅందమైనది, కొంచెము చామనచాయ, ఏమియును

ఫరవాలేదని చెప్పవలయును. ఇదే విధముగ నేదైన వరుని వివాహము విషయములో నాతఁడు నిర్ధనుఁడని చెప్పినచో వానికి వివాహము కాదు. అప్పుడు పిల్లవాఁడు సంపన్నుఁడు. తినువాఁడును త్రాగువాడును గాదు పిల్లసుఖించును. ఏదోషములులేవు; అని చెప్పవలెను. పెండ్లికి ముందే నలుపు, తెలుపు, ధనికుఁడు, నిర్ధనుఁడను విచారముఁ వివాహమైన పెండ్లికొడుకును బెండ్లికూతురును గలిసికొనిరా అన్ని విషయములును బ్రాతపడి పోవును. ఇక నిభాయించు చింత నిలిచిపోవును. కావునఁ గన్యావరాది స్తుతిసమయమునఁ గొంతగా నసత్యభాషణము వచ్చినను దోషములేదు.

నాల్గవస్థాన మాజీవికా ప్రసంగము. వాణిజ్యవ్యాపారము లొనర్చు చుందురు. అచ్చట వారు ఫలాని వస్తువును రు. 10 లకు తక్కువ కీయమని తొమ్మిదికే ఇవ్వవలయుననిన నష్టములేకుండిన తొమ్మిదికే యిచ్చినచో నది విశేషదోషముకాదు. ఇదే విధముగాఁ దన ఆజీవిక పోఁబోవుచిన్నప్పుడు ఫలాని యుక్తిని దాఁచుటచే నది రక్షింపఁ బడుచో దానిని దాఁచినది విశేషనిందనీయ దోషము లోనిది కాదు. ఏలయనఁగా జీవనము కంటెను బ్రియమైనది జీవిక.

అయిదవ స్థానము- ప్రాణసంకటము కలిగినప్పుడు-అనఁగా ప్రాణములుపోవు నవసరము తటస్థించు నప్పుడు కొంచెము అసత్యమును జెప్పుటచే రక్షణము జరుగుచో నామాటను జెప్పి ప్రాణ రక్షణము చేసికొనవలెను. బ్రదికి యుండిన నీపాపమునకు బ్రాయశ్చిత్తము చేసికొనవచ్చును. ఇంక నధిక పుణ్యమును సంపాదించు కొనవచ్చును. ప్రాణ రక్షణము కొఱకు విశ్వామిత్రునివంటి ఋషి

అఖాద్యపదార్థమును దొంగిలించెను. ఒక ఋషి మిక్కిలి ఆఁకలిని జెంది యుండెను. ఆఁకలి కారణమున నాతనికిఁ బ్రాణములు పోవు చున్నట్లుండెను. ఒక మావటి వా డలచంద గుగ్గిళ్ళను దినుచుండు టను గాంచి ఋషి తినుట కడిగెను. అతఁడిట్లనెను :- "స్వామీ! నా వద్ద అలచంద గుగ్గిళ్లున్నవి కాని యెంగిలివి" ఋషియిట్లనెను:- "ఎంగిలివే యిమ్ము". ఆతఁడు ఋషి, దానినిఁదినెను. ఆ మావటీ వాఁడు నీటినిఁ ద్రాగుట కీయఁబోగా ఋషి 'నేను జలమును ద్రావ'ననెను.

మావటివాఁ డాశ్చర్యముతో నిట్లనెను :- స్వామీ ఎంగిలి గుగ్గిళ్లు తినిన మీకు ధర్మము పోలేదు. నా చేతిలోని శుద్ధజలమును ద్రాగుటతో మీకు ధర్మమెట్లు పోఁగలదు?"

ఋషి యిట్లనెను:- "సోదరా! ఆసమయమున నేను మిక్కిలి ఆఁకలినిఁజెంది యున్నాను. అప్పుడు నాకేమియును లభింపకుండిన నా ప్రాణము పోయెడిదే. అందువలన నేను ప్రాణరక్షణము కొఱకా యెంగిలి అలచందలను జీవించుటకు దింటిని. ఈ పాపమునకుఁ బ్రాయశ్చిత్తము చేసి కొందును. కాని జలము సర్వత్ర దొఱకును ఒకవేళ దొరకినను నే నాలస్య ప్రమాదవశమున దీనినిఁ ద్రాగినచో నాకు దోషము ప్రాప్తించును. దానికిఁ బ్రాయశ్చిత్తములేదు. కావునఁ బ్రాణరక్షణము కొఱకు కొంచెమనుచిత కార్య మొనర్పవలసి వచ్చి నను జీవన రక్షణను గోరువాఁడట్టి కార్యము నొనర్చి జీవన రక్షణ మొనర్చు కొనినచో నేమంత దోషముండదు.

ఆరవ స్థానము గోరక్షణము. గోవులు లోకమునకు మాత లుగఁ జెప్పబడినవి. ప్రాణము నొసంగి యైనను గోసంరక్షణ మొనర్ప వలయును. గోసంరక్షణము కొఱకేదైన నబద్ధమును జెప్పినచో నది నిందనీయముకాదు. గోహత్య నొనర్చు వానిని శక్తికొలఁది దండింపఁ గలిగినచో దండింపవలయును. గోరక్షణ మొనర్చుట ప్రతి వ్యక్తికినీ ధర్మమైయున్నది. అజన్ముఁడయ్యును భగవానుఁడు గోవులను, బ్రాహ్మణులను రక్షించుకొఱకై జన్మించు చుండును. సమస్త దేవతులును, పితరులును గోశరీరమందు నివ సించు చుందురు. గోమయమునందు లక్ష్మి నివసించుచుండును. గోసేవ యొనర్చుట సమస్త దేవతల రక్షణ మొనర్చుటయే, గోవు పారిపోవుచుండి, దానివెంట కసాయివాఁడు తరుముకొని వచ్చుచు నే వైపుగా గోవు పోయినదా యని యడిగినచో అచ్చట సత్యము పలు కుట అనుచితమే కాదు, అధర్మము. నచ్చట నేవిధముగ నైనను గోవును రక్షింపవలయును.

అంత శౌనకుఁ డిట్లనెను :- "సూతా! పాపము పాపమే, సత్యమును బలుకుటయే నధర్మ మెట్లగును ?"

అంత సూతుఁ డిట్లనెను :- "స్వామీ! ఒక్కొక్కప్పుడు సత్యమువలెఁ దోచు కార్య మధర్మ మగుచుండును. అసత్యముగఁ దోఁచునది ధర్మమగుచుండును. ఈ విషయమున నేను మీకొక యితిహాసమును జెప్పెదను."

ఒక గొప్ప భగవద్భక్తుఁడగు సాధువుండెను. అతఁడు నాలుగుధామములను (కన్యాకుమారి, జగన్నాథము. బదరీ, ద్వారక) యాత్రచేయుటకుఁ గాలినడకన బయలుదేరెను యాత్ర చేయుచుఁ

జేయుచు నాతఁడు జగన్నాథపురికిఁ బోవుచున్నప్పుడు రాత్రి ఆతఁ డొక గృహస్థుని యింట నిలిచెను. సాధువు యువకుఁడు అత్యంత సుందరుఁడు. ఆ యింటియందొక ముసలిది యుండెను. ఆమెకొక యువతియగు కూతురుండెను. ఆ యువతి సాధువునకు గొప్పగా స్వాగత సత్కారములనుగావించెను. మిక్కిలి ప్రేమతో భోజనము పెట్టి రాత్రియందచ్చటనే యుండవలయుననెను. సాధువు అమాయ కుఁడు. కావున నామె శ్రద్ధను గాంచి నిలిచిపోయెను.

రాత్రియందరును నిద్రించిన తరువాత నాస్త్రీ సాధువు సమీ పమునకు వచ్చి ఆతనితో ననుచిత ప్రస్తావమును గావించెను. సాధు విట్లనెను :- 'నీవు నీపతిని భజింపుము, పతియుండఁగా నన్య పురుషుని సమీపమునకువచ్చుట ఉచితముకాదు' దానికామె 'ముందు నీవు నీపతిని ఖండించుము. ఆతఁడుండఁగా నాకడకు రాబోకు' మను నర్థమును దీసెను. ఆమె మనస్సు మలినమై యుండెను. అందువలన నామెపోయి, ఒక ఖడ్గముతోఁ దనపతి శిరమును ఖండించి మరల సాధువు కడకు వచ్చెను.

సాధువిట్లనెను;- "దేవి! నీంవెంతటి పాపపూర్ణమగుఁ బ్రస్తాన మొనర్చుచుంటివి, నీవు నా తల్లివంటి దానవు. ఇట్టి వ్యవహారము నీకు శోభింపదు, "సాధువుయొక్క యీ వ్యవహారము వలన నామెపై విపరీత ప్రభావము పడెను. ఆమె శిరమునఁ గామభూతము స్వారీ చేయుచుండెను, తన కోరిక నెఱవేరక, తన స్వార్థమునకు వ్యాఘాతము కలుగుటను గాంచి ప్రతిహింసా వృత్తి జాగృతినిఁ జెంది యిట్లరచెను - చూడండట్టో, ఈ మనుష్యుఁడు నా పతిని హత్య కావించినాఁడు." ఈ గోలను విని అటునిటు నుండి చాల

మంది మనుష్యులు గుమికూడిరి. రాజ కర్మచారులును వచ్చిరి. సాధువును బట్టుకొని రాజుముందు నిలువఁ బెట్టిరి. పురుషుఁడు చావనే చచ్చెను. రాజా సాధువు రెండు చేతులను ఖండించెను. సాధు విట్లనుకొనెను ;-ఇదియును నా పూర్వజన్మపు పాపమై యుండవల యును. ఇది భోగము చేతనే నివృత్తి కాఁగలదు. అనుకొని ఆతఁడు జగన్నాథమునకుఁ బోయెను. కొంతదూరము పోఁగానే ఆతనికొక సిద్ధుఁడు లభింపఁగా నాతని నిట్లడిగెను :- స్వామీ! ధర్మకార్యము లొనర్చుచున్నను నకారణముగ దీనినేల యనుభవింపవలసి వచ్చినది?

సిద్ధుఁడిట్లనెను ,- సాధువర్యా! ఎవ్వఁడును నితరులకెన్న డును నకారణముగా బాధకలిగింపఁడు పూర్వజన్మ సంస్కార ముండిన, వారే సుఖదుఃఖముల నొసంగి ప్రతీకారము నొనర్చెదరు

సాధువిట్లనెను :- స్వామీ! నే నీ తల్లికేమి యనిష్టమును గావించితిని ?

సిద్ధుఁడిట్లనెను :- మహాత్మా! నీవు పూర్వజన్మమునఁ గాశీ క్షేత్రమున గొప్ప విద్వాంసుఁడవు. కర్మిష్ఠివి. సత్యవాదియగు బ్రాహ్మణుఁడవు. ఒక దినమున నీవు దశాశ్వమేధ ఘట్టమున స్నానము చేయుచుంటివి. ఆ సమయమున నొక కటికవాని గోవు తప్పించుకొని వచ్చెను. ఆతఁడును వెంటనంటెను తన గోవు ఒక గల్లిలోనికి దూరుటను గాంచెను.

కటికవాఁడు వచ్చి నీతో నిట్లనెను :- "పండితవర్యా! మీకు మా ఆవు కనబడినదా ?"

నీవు రెండు చేతులనెత్తి యిట్లంటివి :- "అవును ఇప్పుడే వెళ్ళుటను నేను గాంచితిని.'' నీవు చెప్పుటచే నాతఁడు పరువిడి

యాగోవును వట్టుకొని వధశాలకుఁ గొనిపోయి దానిని వధించెను. కాలక్రమమున నాగోవేవచ్చి యీ స్త్రీగనయ్యెను. ఆ కటికవాఁడే దానికి పతియయ్యెను. పూర్వజన్మమున ద్వేషముకలదు. అందువలన నామె తన వతినిఁజంపి తన పూర్వజన్మపు క్రోధమునకుఁ బ్రతీకార మొనర్చెను. ఆ హింసలో నీకును భాగముకలదు. నీవు రెండు చేతులనెత్తి గోవును జూపించితివి. నీవు చెప్పకుండినచో నాతనికి దొరికి యుండెడిదికాదు. అది రక్షింపఁబడెడిది. ఏ చేతులనెత్తి నీవు గోహత్యకు నహాయమును గావించితివో ఆ నీరెండు చేతులను ఖండింపఁబడినవి. ఇప్పుడు నీవు శ్రీజగన్నాథుని శరణు వేఁడుము, ఆతఁడశరణ శరణుడు, దీనబంధువు, దయాసింధువు, ఆతఁడేది తలచుకొనిన దానినిఁ జేయఁగలఁడు.''

సూతుఁ డిట్లనెను ;–''మునులారా ! సిద్ధుని నోట యీమాటలను విని సాధువు జగన్నాథమునకుఁజేరి ఆతనిఁ స్తుతించెను. చూచుచుండఁగనే ఆతడి రెండు చేతులును మరలఁ గమలములవలె బయటకు వచ్చెను. ఇంతకీ కథయొక్క సారాంశమేమనఁగా నిట్టి సమయములందు సత్యమును చెప్పుటయును బాపమునకు సమానమే యగును.''

శుక్రాచార్యుఁడు బలికి చెప్పుచు నిట్లనెను :–''రాజా ! గోరక్షణము జరుగనెడల నచ్చట అసత్యమును జెప్పుటయును దోషము కాదు.''

ఏడవస్థానము బ్రాహ్మణహితము. ఒక బ్రాహ్మణుఁడు విపత్తులోనుండి అసత్యమును జెప్పుటచే వాని విపత్తు దూరమగుచో

నా యసత్యము యసత్యము కాఁజాలదు. భావనము, పరోప కారమే, దొంగతనమువంటి నిందిత కర్మలొనర్చి, దా ని వ ల న ధనముదెచ్చి, దానిచే సాధుబ్రాహ్మణులకు భోజనమిడిన సద్గోతిసిఁ జెందని భక్తులనేకులుకలరు. కావున సాధుబ్రాహ్మణులకు మేలౌన ర్చుటలోఁ గొంచెముగనో గొప్పగనో, అసత్యమును బలుకవలసి వచ్చినచో నది నిందనీయముకాదు.

ఎనిమిదవస్థానము - ఇతరుల హింసను నివారించు సమయ మున ఒకానొకఁడు రితీయఁబడబోవుచుండ మన మసత్యమును జెప్పు టచే వాని ప్రాణము రక్షింపఁబడుచో నట్టి యవసరమున నబద్ధమును జెప్పవలయుననునదివిధికాదు. అట్లును గావచ్చుననియే. ఏమియును జెప్పక తప్పించుకొనినఁ దప్పించుకొనవచ్చును. కాని సత్యవాదియై యితరుల కనిష్టమును దేరాదు."

శౌనకుఁడిట్లనెను :- "సూతా ! తప్పించుకొనుటెట్లు ? ఎవరై నను మన సమ్ముఖమున నిలుచుండి యడుగుచుండిన మన మవుననవలయునా కాదనవలయునా ? ఈ రెంటిలో నేదియో చెప్ప వలయునుగదా ?"

సూతుఁడిట్లనెను :- "స్వామీ ! అసత్యమును జెప్పియేకాదు. సత్యమును జెప్పియును నెవరికిని దుఃఖమును గలిగింపరాదు. ఇతరులకు దుఃఖమును గలిగించునప్రియసత్యము పాపసదృశముఁ ఈవిషయమున నొకదృష్టాంతమును వినుఁడు."

ఒక గొప్ప ధర్మాత్ముఁడును సత్యవాదియునైన ముని కలఁడు. అత డెన్నడును ననత్యభాషణము నొనర్చెడువాఁడు కాఁడు. ఒకసారి అతఁడు స్నానమొనర్చి వచ్చుచుండఁగా నాతఁ

డొక గాయపడిన మృగము పొదమాటున దాగియుండుటను గాంచెను. ఇంతలోనే మిక్కిలి బలవంతుడును, హృష్టపుష్ట శరీరుడునగు క్రూరవధికుడు చేతులలో ధనుర్బాణములను ధరించి ఋషిసమ్ముఖమునకువచ్చి యిట్లడిగెను :- "బ్రాహ్మణోత్తమా! మీరిటువచ్చిన మా గాయపడిన మృగమును గాంచితిరా ?"

ముని యిట్లనుకొనెను-"నేను వధికునకు సత్యమును జెప్పితినా యాతడిప్పుడె దీనిని జంపగలడు. దాని హింసయందు నేనును సమ్మిళితుడనైనవాడనగుదును.నేను జూడలేదనిననానత్యవ్రతము ఖండితమగును." అని యాలోచించి ఆతడు మెదలక అవుననలేదు కాదనలేదు." ఆవధికుడెన్నిసార్లడిగినను మౌనముగనే యుండెను.

చివరకాతడు కోపముతో నిట్లనెను :- "మునివరా! మీరు గొప్ప ధర్మాత్ములని నేను వినియుంటిని. నవ్వులాటకైనను మీరసత్యమాడరట. మీరు మృగమును జూచిన నౌననుడు చూడకున్న లేదనుడు. నేను వెళ్ళెదను మీరేదో ఒక ప్రత్యుత్తరమిండు."

ముని గంభీరుడై యిట్లనెను:- "అయ్యా! ఏమి ప్రత్యుత్తరమిచ్చెదను. చూచిన కన్నులకుజెప్పు శక్తిలేదు, జిహ్వ మాట్లాడగలదు. దానికిజూచు శక్తిలేదు. కావున నెను నీ కేమని చెప్పంగలను! చూచిన కన్నులు చెప్పినచో నది నిజమగును. చెప్పంగలిగిన జిహ్వ చూడకలిగినచో నది సత్యమగును. ఒకటి చూచి, యింకొకటి చెప్పినదానిని విశ్వసించుటెట్లు-కావున నేది జూచినదో దానినడుగుము."

Acc NO 2339 294.592

ఈ అకటావికటపు ప్రత్యుత్తరమును విని వధికుడత్యంత ప్రసన్నుడయ్యెను. ఆతడు వధికుడుకాడు. సాక్షాత్తుగ ధర్మమే

వధిక రూపమును ధరించి ఆతనిఁ బరీక్షింపవచ్చెను. ఆతనికి మనో వాంఛిత వరము నొసంగి ధర్మమప్పుటనే అంతర్ధానమయ్యెను. అట్లా సత్యవాదియగు మునియే ఉత్తరమీయవలెను. సాధారణులిట్టి ప్రత్యుత్తరమీయఁజాలరు.

శుక్రాచార్యుఁడు బలిచక్రవర్తితో నిట్లనెను:- "రాజా! ఇది నీతిధర్మసంగత విషయము.

గీ॥ వారిజాక్షులందు వైవాహికములందు
ప్రాణవిత్తమాన భంగమందు
చకిత గోకులాగ్ర జన్మరక్షణమందు
బొంక వచ్చు నఘము బొందదధిప॥

ఆ అసత్యము నిందనీయము కాదు. ఈ సమయమున నీ యాజీవికా ప్రశ్నకలదు. ఈ విష్ణువు మోసమునఁ గపటవేషమును ధరించి నీ సర్వస్వమును హరింపఁజూచుచున్నాఁడు. ఈ సమయమున నీవు కొంచెముగ ననత్యభాషణము పలికినను దోషమేమియు నుండదు."

శ్రీ శుకదేవుఁ డిట్లనెను :- "రాజా ! శుక్రాచార్యుఁడన్ని యుక్తులనొసంగి వేద, శాస్త్ర సమ్మతమగు నీతి నుపదేశింపఁగా ధర్మాత్ముఁడును, సుదారుఁడునగు బలిచక్రవర్తి దృఢముగ నీవిషయములకుఁ బ్రత్యుత్తర మొసంగ నుద్యుక్తుఁడయ్యెను.

— మొదటి భాగము సమాప్తము —